- తెలుగు సంస్కృతి – వారసత్వ అధ్యయన ప్రాముఖ్యం
- వావిలికొలను సుబ్బారావు – సాహిత్య సేవ
- వసంతశోభకు పునాది ‘ఉగాది’
- భారతీయ మహిళా వైభవం
- మాతృభాష మనుగడ
- వసుచరిత్ర – సంగీత శాస్త్ర విశ్లేషణ
- డా. కపిలవాయి లింగమూర్తి పీఠికలు – పరిశీలన
- తెలంగాణ సాహిత్య చరిత్రలు – పరిచయం

# మూసీ

# MUSI

• Samputi : 28 • Sanchika : 05 • Pages : 64 • Rs. 20
• March 2025




Scanned with OKEN Scanner





వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి

# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 28 సంచిక : 5
మార్చి - 2025
'క్రోధి' ఫాల్గుణ మాసం

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. MANOHARI**

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక'
(MUSI Telugu Monthly Magazine)
పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్
- 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com992

ISSN 2457-0796

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

తెలుగు సంస్కృతి - వారసత్వ అధ్యయన ప్రాముఖ్యం ... ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ 7
వావిలికొలను సుబ్బారావు - సాహిత్య సేవ ...
ఆచార్య పమ్మి పవన్ కుమార్, కప్పల సురేశ్ 11
వసంతశోభకు పునాది 'ఉగాది' ... ఆచార్య శ్రీవత్స 17
భారతీయ మహిళా వైభవం ... డా. భిన్నూరి మనోహరి 21
మాతృభాష మనుగడ ... రాఘవ మాష్టారు కేదారి 23
వసుచరిత్ర - సంగీత శాస్త్ర విశ్లేషణ ... కె. పాతన్న 23
డా. కపిలవాయి లింగమూర్తి పీఠికలు - పరిశీలన ... డా. కసప నరేందర్ 30
తెలంగాణ సాహిత్య చరిత్రలు - పరిచయం ... కావలి రాఘవేందర్ 35
జైలు సాహిత్యంలో వ్యక్తి వ్యవస్థ ... కొల్లూరి నాగరాజు 39
నీతి శాస్త్రము - తాళపత్ర గ్రంథము... డా. గంద్ర లక్ష్మణరావు 41
దళిత సాంస్కృతిక సరోవరం - నాగప్పగారి సుందరరాజు కథలు ...
ఆచార్య కె. శ్రీదేవి, పి. శివశంకర 43
గీతకార్మికుల వెతలను తిరుగ రాస్తున్న 'నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్' ... డా. కొత్తిరెడ్డి మల్లారెడ్డి 49

### సమీక్షలు

సాహిత్య సంకీర్తకుడు 'సన్నిధానం' జన్మదిన విశేష సంచిక ... ఘట్టమరాజు 53
'నాతి చెరామి' కథలు - వస్తువు ... తుడుం మోహన్ 55
జీవన సమరం - బి.సి. అస్తిత్వ ప్రకటన ... డా. మద్దిరాల సత్యనారాయణ రెడ్డి 57
పాత్ర నిర్మాణ పద్ధతిని విశ్లేషించే విశిష్ట రచన ... డా.డి. చంద్రశేఖర్ రెడ్డి 59

### కవితలు

తొక్కిసలాట ... ఆచార్య ఫణీంద్ర - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; విముక్తి ... నక్క హరికృష్ణ - 19; మా నాయిన ... బాలాజీ పోతుల ... 34; గురువు అంటే ... రైటర్ రాజు - 52; పరవశించి పోవు పరమ శివుడు... పసుపులేటి నరసింహారావు-52; ఆగుపారకా ... గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్ - 59; అవును! నేను అబలనే !! ... ఎం. అనంత లక్ష్మి - 62

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by :*
**B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2025

సంపాదకీయం






వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి


స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**




# సంవత్సరం

సమ్యక్ వసంతి ఋతవోకస్మిన్నితి సంవత్సరః, వత్సరశ్చ. ఋతువులు దీనియందు వసించును కావున సంవత్సరము, వత్సరము అని పేరు. సంవత్సరానికే, వసంతం, వర్షం, శరత్తు, అబ్దం అని పేర్లున్నాయి. ఋతువుల ప్రకారం సంవత్సరంలో ఒక సారి వచ్చే ఋతువులైన వసంతం, వర్షం, శరత్కాలాలను దృష్టిలో పెట్టుకొని సంవత్సరానికి పర్యాయపదాలు అయ్యాయి. అదేవిధంగా 'ఆపః' అనే జలం కావడం వల్ల సంవత్సరానికి ఒకసారి జలాన్నిచ్చేది అనే అర్థంలోనూ ఉపయోగించబడుతుంది. కాల విభాగాలు నిత్యజీవనాలు అయ్యాయి. ఎన్నో వాక్యాలు కాలానికి సంబంధించినవి జీవితంలో ప్రయోగించుకుంటున్నాం. వాడు సమస్యలకు వణికిపోతున్నాడు, నిన్ను ఎండగడతాను మొదలైన పదాలన్నీ అటువంటివే. ఋతువులలోని గొప్పదనం అంతా నింపుకుని ప్రవర్తించేది వత్సరం అవుతుంది.

మూలాలకు వెళ్ళి చూస్తే ఈ ఋతువులు ఏర్పడడానికి, కాలం ఏర్పడడానికి మూలం భూమి మాత్రమే. భూమి తనచుట్టూ తాను తిరగడం వల్ల పగలు, రాత్రి (అహర్నిశలు) ఏర్పడుతున్నాయి. అదేవిధంగా సూర్యుని చుట్టూ పరిభ్రమణం చేయడం వల్ల ఋతువులు ఏర్పడుతున్నాయి. ఈ ప్రక్రియ మన భూమి మీద మాత్రమే సాధ్యం అవుతుంది. ఇతర గ్రహాలపై వాతావరణం లేనందున అది సాధ్యం కాదు. అందుకే భూమి మాత్రమే కాలానికి ఆధారం. ఈ తిరిగే భూమికి ప్రతీకగా భారతీయులు శివలింగాన్ని భావన చేశారు. అందువల్ల శివలింగం అంటే ఈ భూమి మాత్రమే. కాలం ఏర్పరచడానికి ఆధారభూతమైన వాడు కాబట్టి శివునికి 'కాలుడు' అని పేర్లు పెట్టడం జరిగింది. శివసంబంధమైన గాథలన్నీ భూ సంబంధమైన వ్యవహారాలే. అభిషేకాదులన్నీ భూమిపైన పడే వర్ష ప్రతీకలే.

సంవత్సరాలు, ఋతువులు, మాసాలు, పక్షాలు, వారాలు, తిథులు, ఘడియలు, విఘడియలు అన్నీ వస్తూ పోతూ ఉంటాయి. మనమూ భూమితో పాటు తిరుగుతూనే ఉన్నాం. వేరు వేరు కాలాలను పునరావృత్తిగా దర్శిస్తున్నాం. నిత్యజీవనంలోనూ నిద్రలేచింది మొదలు పడుకునేంత వరకూ చేసిన పనులే మళ్ళీ మళ్ళీ చేస్తున్నాం. ఇదేవిధమైన స్థితి జరుగుతూ, అవే పనులు చేస్తూ ఉంటే వ్యక్తిలో మార్పు ఏమీ ఉండదు. దీనినుండి కొంత భిన్నంగా శక్తివంతంగా జీవితం కొనసాగాలి. ఏ ప్రకృతిలో తిరుగుతున్నామో దానిని ఎప్పటికప్పుడూ దర్శిస్తూ దానిలోని శక్తితో మమైకమయ్యే ప్రయత్నం జరగాలి. ఆరు ఋతువులలో, పన్నెండు మాసాల్లో వేరు వేరు ప్రకృతులు ఉంటాయి. ఆ యా సందర్భాల్లో చేయాల్సిన కర్మలు చేయడమే కాకుండా, ఆ ఋతు తత్త్వాన్ని పరిశీలించి, మూల శక్తిని ఉపాసించడం మొదలు పెట్టాలి. తగిన జ్ఞానం దీనికి కావాలి. పొందిన జ్ఞానాన్ని బట్టి పొందే శక్తి సులువుగా వస్తుంది. జ్ఞాన పరిమితి తగ్గితే పొందే శక్తి కూడా కొంచెమే అవుతుంది. ఈ విధంగా మానవునికి కొత్త సంవత్సరమే కాదు, ప్రతి రోజూ కూడా గమనించేందుకు, శక్తి పెంచుకునేందుకు అవకాశం కలుగుతూనే ఉంటుంది.

పరీక్షలకు సిద్ధమై, చక్కగా రాసి, గొప్పగా ఉత్తీర్ణత పొందినవారికి స్థాయి పెరిగినట్లుగా, జీవితంలోనూ వేరు వేరు ఋతువుల మాధ్యమంగా వచ్చే సమస్యలను ఎదుర్కొని, స్పష్టమైన మార్గం అవలంబించి, ఉన్నత, ఉత్తమ స్థాయికి చేరడమే సంవత్సరం ఇచ్చే సందేశం. మూల శక్తికి అన్ని ఋతువులూ, ప్రకృతి అంతా సమానమే అయినట్లుగా... మనకు కూడా అదేవిధంగా ఉంటే మనమూ శక్తివంతులమే. దాన్ని సాధించేదే ప్రయత్నం. కాలాన్ని ఈ రూపంలో అర్థం చేసుకుంటే సకాలంలో అన్ని పనులూ పూర్తి అయ్యే అవకాశం లభిస్తుంది.

# తొక్కిసలాట





సీ. సినిమ టాకీసులో సినిమాల అభిమాని
తొక్కిసలాటలో తూలి చచ్చు!
దైవ దర్శనముకై తపియించు భక్తుడు
తొక్కిసలాటలో తూలి చచ్చు!
పండుగ సెలవులన్ బస్ టికెట్ కొనువాడు
తొక్కిసలాటలో తూలి చచ్చు!
క్రికెటు స్టేడియములో క్రీడాభిమానియు
తొక్కిసలాటలో తూలి చచ్చు!

ఆ.వె. వినుచు నుందు మిట్టి వేదనాభరితమౌ
కరకు వార్తలెన్నొ తరచుగాను!
ఎవడు చక్కదిద్దు నిట్టి దౌర్భాగ్యమున్?
మనకు మనమె సుంత మారలేమె?

కం. అరె! చిన్ని చీమ సైతము
వరుస క్రమము నందు నెపుడు పరగుచునుండున్!
నరులము గదా మరి మనము!
చిరు సంస్కారము కరువన సిగ్గగ లేదే?

తే.గీ. దక్కవలె నాకె యను స్వార్థ మెక్కువాయె!
వేచియుండెడి గుణమునే విడిచివేస్రి -
వరుస క్రమములో సాగుట వదలివేస్రి -
ఓపి కన్నది ప్రజలలో ఉడిగిపోయె -

తే.గీ. బ్రతికి యున్నచో తరువాత బడయవచ్చు
సినిమ టికెటైన, దైవ దర్శనమునైన,
బస్సు టికెటైన, బ్రహ్మాండ భాండమైన -
జనులు సాధింతురేమిటి, చచ్చు పిదప?

ఉ. ఒక్కరి పిమ్మటన్ నొకరు నోపికతో చనుచుంద్రు చూడగా
నెక్కడ నే విదేశమున నెవ్వడునైన! అదేమి ఖర్మయో!
ఇక్కడ భారతావనిని ఇట్టుల చచ్చుచునుందు రీ జనుల్!
చక్కగ నెల్లరున్ వరుస సాగుట యన్నది నేర్తు రెప్పుడో?

కం. తల్లియు, తండ్రియు, గురువులు -
పిల్లలకిది తెలియజెప్పి, ప్రేరణ నిడగా
నెల్లపుడు తాము సైతము
నుల్లంఘన సేయకుండ నుండుడు వరుసన్!

కం. సరి సరి! ఇప్పటికైనను
వరుస క్రమమునందు సాగు పద్ధతిని ప్రజల్
పరగవలయు తప్పని సరి!
అరయగ ప్రాణముల కన్న నధికం బేదీ?

(ఇటీవల - సంధ్య థియేటర్, తిరుమల వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల తొక్కిసలాటల దుర్ఘటనలకు స్పందిస్తూ)

"కవి దిగ్గజ" "పద్య కళా ప్రవీణ" ఆచార్య ఫణీంద్ర
ఫోన్ : 995 988 2963

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2025

# మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. **ఉపోద్ఘాతం :** ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. **విషయం :** పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యధాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (“ ”) తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. **ముగింపు :** పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
4. **ఉపయుక్త గ్రంథసూచి :** ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. ప్రచురణ సంవత్సరం). గ్రంథం పేరు, ప్రచురణసంస్థ, ప్రచురణ స్థలం.) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. '**భారత ధ్వని దర్శనము**'. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యధాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

# తుకారాం అభంగం

నీదనేది ఏది కాదు
నీకు సొంతమనేది లేదు
నేను నేననేది విడువు
నీలోనే అసలు నిన్ను చూడు

భ్రమలలోన ఏలుండేదవు
బతుకు సుఖములో తూగెదవు
అహంకారి మద మత్సరమున
సదా తేలిపోతుండెదవు
నీలోకి తొంగి ఒకపరి చూడు
నీలోనే అసలు నిన్ను చూడు

కాలమొక నదీ ప్రవాహం
కాలముఖుని మాయాజాలం
కనుగొని కదలిపోవుటే మార్గం
కడతేరితే రాదు మరొక్క జన్మం
కమలనాథు మంత్రము జపుము
నీలోనే అసలు నిన్ను చూడుము

తుకా అసలు తెలిసి పలికెను
నామ జపము చేయుచుండును
సాక్షి చంద్రభాగ శ్రీపతి
సదా సత్యము పలుకుచుండెను.




అనువాదం
డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2025

# తెలుగు సంస్కృతి – వారసత్వ అధ్యయన ప్రాముఖ్యం

**ఆచార్య రాచుగాల్ల రాజేశ్వరమ్మ,** శాఖాధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి..
ఫోన్ : 9491 420 180

**ఉపోద్ఘాతం**

అతి ప్రాచీన చరిత్ర – సంస్కృతి ఉన్న జాతులలో తెలుగు జాతి ఒకటి. సాహిత్య సంపద కలిగి ఉన్న అతి కొద్ది జాతులలో తెలుగు జాతి విశిష్టత సుసంపన్నం. తెలుగు జాతికి 3 వేల సంవత్సరాలకు పైగా సాహిత్య నేపథ్యం ఉంది. ఈ నేపథ్యంలో భాగంగా తెలుగు సంస్కృతి, నాగరికతల గురించి, సంస్కృతిలోని వివిధ అంశాల గురించి, వారసత్వ సంపద అధ్యయన ప్రాముఖ్యాన్ని గురించి ఈ వ్యాసంలో తెలుపడం ప్రధాన ఉద్దేశం.

**వ్యాసరచన ఉద్దేశం**

సంస్కృతిలోని అంశాలు వారసత్వ పరంపరలో, మానవ సంబంధా లలో, ఆచార విశేషాలలో, విపరీతమైన మార్పులు చోటు చేసు కున్నాయి. ఈ మార్పుల వలన 'సంస్కృతి' స్థిరమైంది కాదని, నిరంతరం మార్పు చెందుతూ ఉండటమే దీని లక్షణమని, సంస్కృతిని ఏ ఒక్కరూ మార్చలేరని, అది కాలానుగుణంగా సమాజంలోని మార్పుల ఫలితంగానే మారుతుందని అర్థం చేసుకోవచ్చు. ఎంతో ఉన్నతమైన విలువలు, సహృదయ వాతావరణం, కళాత్మక విలువలు, మత సహనం, వివిధ ఆచార సంప్రదాయాలు తెలుగు సమాజంలో అనుసరించినప్పటికీ ఆధునికోత్తర కాలంలో ప్రపంచీకరణ ప్రభావం వలన మన సంస్కృతి నాగరికతలోని అంశాలలో విపరీత పోకడలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మార్పులను ఎంతవరకు మనం స్వాగతించి అనుసరించాలి, వేటిని, ఎటువంటి వాటిని విడనాడి అభ్యుదయపథంతో మనిషి జీవించాలి అనే అంశాల గురించి తెలియజేయడం ఈ వ్యాస ప్రధాన ఉద్దేశం.

**ప్రధాన పదాలు (కీ వర్డ్స్)**

సంస్కృతి, నాగరికత, వారసత్వం, సంస్కారం, బౌద్ధిక జీవితం, కళలు, కెయిరనులు, కార్పటి, లెంకలు, రణపుకుదుపు మొదలగునవి.

**సంస్కృతి**

సంస్కృతి అంటే **"ఒక జాతి అభివృద్ధిమార్గాన నడచిన రీతిని సంస్కృతి అని, వ్యక్తి చేయు అభివృద్ధి యత్నమును సంస్కారం"** అని పెద్దల నిర్వచనం. ఇప్పటి పరిభాషలో సంస్కారమనగా, సంఘము నందలి దురాచారాలను సవరించుటకో, నిర్మూలించుటకో కృషి చేయువాడనే అర్థం స్థిరపడింది. మొత్తానికి **"జాతులు, సంఘాలు భౌతికంగా, మానసికంగా ఉచ్ఛదశ నొందుటకై చేయు నిరంతర ప్రయత్నమే వారి సంస్కృతి"** అన్నారు. సంస్కృతికి



పర్యాయపదంగా కొందరు నాగరికత అను పదమును వాడుచున్నారు. సంస్కృతి మానవుని ఆత్మ ధర్మమని ఇది ఆంతర జీవితానికి హృదయ వ్యాపారానికి, ఆధ్యాత్మిక జీవితానికి సంబంధించినది. నాగరికత దేహ ధర్మమని చెప్పారు.

**"ఒక జాతి యొక్క విజ్ఞానం, కళలు, విశ్వాసాలు, ఆచారాలు, సంప్రదాయాలు, నైతిక దృక్పథాలు, జీవన విధానం, మొదలగునవి వాటి సమిష్టి సంపదయే సంస్కృతి"** అని నిర్వచించారు. ప్రముఖ చరిత్రకారుడు ఇ.బి. టైలర్ **"సమాజంలోని వ్యక్తుల, సమూహాల, అనుభవాలు అన్నీ సంస్కృతిలో విషయాలుగా ఉంటాయి. జ్ఞానం, విజ్ఞానం, విశ్వాసం, కళ, నీతి చట్టం, ఆచారవ్యవహారాలే కాక మానవుడు సంఘజీవిగా ఆర్జించిన శక్తియుక్తులు, అలవాట్ల సమాహారమే సంస్కృతి"** అన్నారు.

**"సహనమే సంస్కృతి"** అని డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు నిర్వచించారు. శ్రీ అరవిందుడు "హ్యూమన్ సైకిల్" అను గ్రంథంలో **"దీప్తిమంతమైన బౌద్ధిక జీవితాన్ని సంస్కృతి"** అన్నారు. అనగా **"అడుగు కింది మెట్టు నుండి పై మెట్టుకు, అక్కడ నుంచి అతి మానసిక స్థితికి చేసే పయనమే లేదా మనో వ్యవసాయమే సంస్కృతి"** అని తెలిపారు.

ఈ నిర్వచనాలను పరిశీలిస్తే **"ప్రకృతి పట్ల జీవకోటి పట్ల, జీవితం పట్ల దాని సమస్యల పట్ల, సమాజం పట్ల సమన్వయం, ఋజువర్తన, సమగ్రమైన అవగాహన కల్పించడం సంస్కృతి యొక్క ముఖ్య ధ్యేయం"** అని తెలియవస్తుంది. అంతేగాక సంస్కృతిలో ఏదీ స్థిరంగా ఉండదు. నిరంతరంగా అది మారుతూ ఉండటమే సంస్కృతి లక్షణం. సంస్కృతిని ఏ ఒక్కరూ ఎవరూ సంరక్షించుకోలేరు. చెడగొట్టనూ లేరు. సంస్కృతిలో కాలానుగుణంగా మార్పులు జరుగుతూ ఉంటాయి.



ఈ మార్పుల గురించిన వివరాలు తెలుగు చరిత్ర సంస్కృతిలోని అంశాల ఆధారంగా వివరించుకోవచ్చు.

**వారసత్వం**

**"ఒక నిర్దిష్ట సమాజంలో అభివృద్ధి చెందిన ప్రజల జీవన విధానాలను ఒక తరం నుంచి మరో తరం అంది పుచ్చుకున్న వైనాన్ని వ్యక్తపరిచేదే వారసత్వం."** ఇంతకూ ఒక జాతికి వారసత్వ సంపద ఏమిటి? అంటే కొన్ని వేల సంవత్సరాల జాతీయ జీవన ప్రవంతిలో అది సృష్టించిన సాహిత్యం, అది ప్రతిపాదించిన స్థిరమైన జీవన విధానం, అందలి ఆదర్శాలు, మత సంస్కృతులు పరిపాలనా పద్ధతులు, కళలు, కట్టడాలు, సంగీతం, మహాపురుషుల జీవితాలు మనకు పొరుగువారితో ఏర్పడిన అనుబంధాలు మొదలగు వాటిని ఎన్నింటినైనా వారసత్వ సంపదగా పేర్కొనవచ్చు.

**చరిత్రకారుల ప్రస్తావన**

తెలుగు వారి సాంస్కృతిక, వారసత్వ సంపద గురించి తెలుసు కోవడానికి ముందు మన చరిత్రకారుల, కవుల కృషిని కొంత వివరించుకోవాలి. ఈ భూమి మీద ఉన్న ప్రతి జాతికి ఒక చరిత్ర ఉంటుంది. అది ఉన్నతం కావచ్చు లేదా హీన చరిత్ర కావచ్చు. ఆంధ్రుల, లేదా తెలుగువారి చరిత్రను ఆద్యంతంగా మనకు అందించిన చారిత్రకులు చిలుకూరు వీరభద్రరావుగారు. ఈ పరంపరలో శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మ, రాళ్ళబండి సుబ్బారావు, డా॥ నేలటూరు వెంకటరమణయ్య, డా॥ మారేమండ రామారావు, కురుగంటి సీతారామభట్టాచార్యులు మొదలగువారు తెలుగు చరిత్రను పరిశోధించి వెలుగులోకి రాని, మనకు తెలియని అనేక విషయాలను పరిశోధించి చీకటి కోణాలనెన్నింటినో తేజోవంతం చేశారు. ఇలా తేజోవంతం చేసిన అంశాలలో సంస్కృతికి, వారసత్వ సంబంధమైన అంశాలలో కొన్నింటిని గురించి చరిత్ర, సాహిత్యం, ఆధారంగా వివరించుకోవచ్చు.

**ప్రాచీన చరిత్ర – సంస్కృతిలోని అంశాలు**

ఆంధ్ర దేశమున ప్రాచీన కాలమున నివసించిన తెలుగు జనుల వాస్తుకళ గురించి 'కెయిరనులు' ద్వారా వారి నాగరకత గురించి తెలుస్తుంది. 'కెయిరనులు' అనగా పూర్వకాలపు సమాధులు. వీటిని 'రాక్షసగుళ్ళు' అన్నారు. వీటి ద్వారా ఆనాటి ప్రజలు బండరాళ్ళను మలచు కౌశలము కలవారుని ఆనాటి వాస్తు పరిజ్ఞానాన్ని తెలిపే చక్కని నిదర్శనంగా చెప్పవచ్చు. దీనివలన తెలుగు జాతి క్రీ.పూ. 3000 సం॥ పూర్వమునందే నాగరికతతో జీవించారని తెలుస్తుంది. అలాగే బద్దెన నివసించిన కాలానికి ప్రజల సమిష్టి జీవితానికి సంబంధించిన అంశాన్ని ప్రస్తావించాడు. సంఘ జీవితానికి రంగం గ్రామం. గ్రామ నిర్మాణ పద్ధతులు, గ్రామంలో తప్పక ఉండాల్సిన వాటిని **"అప్పిచ్చువాడు, వైద్యుడు, యెప్పుడు నెడతెగక పారే యేరును, ద్విజుడున్, జొప్పడిన యూరనుండుము, చొప్పడకున్నట్టి యూరం చొరకుము సుమతీ!"** అని వివరించారు. ఇవి లేని ఊరులో నివసించ రాదని పేర్కొన్నాడు.

కార్తీక శుద్ధ చవితిని 'నాగుల చవితి'గా నోములు జరుపుకునే సంప్రదాయం అనాది కాలంనుండి ఉంది. ఆంధ్రదేశములో ప్రాచీన కాలమున నివసించిన అనేక రకాల జనులలో ఆంధ్రులు 'నాగజాతి' వారని, వీరు సర్పములను పూజించే వారని వీరి పాలనకు సంబంధించిన అంశాలు బౌద్ధగాథలు కూడా తెలుపుచున్నాయని తెలుసుకోవచ్చు. అలాగే శ్రావణ బహుళ అమవాస్యను 'పోలాల లేదా పొలముల అమావాస్య' అని 'పోలేరమ్మ అమవాస్య' అని పిలుస్తున్నారు. ఇది వ్యవసాయమునకు సంబంధించిన శుభదినాన్ని తెలుపుతుంది. కందపిలక వలే తమ సంతానం తామరతంపరగా పెరగవలెననే కోరికతో చేసే వ్రతంగా, సంప్రదాయంగా వస్తున్న ఆచారం. పశువులను శుభ్రపరచి, కొమ్ములకు పసుపు, నూనెరాసి, బెల్లము, నువ్వులు తినిపించే సంప్రదాయం అనాది నుండి వస్తున్న సంప్రదాయం.

ధర్మశాస్త్రకారుడైన ఆపస్తంబ మహర్షి **"భార్యతో కలసి భుజించుట అనురాగమును, కలివిడితనమును సూచించును. ఈ ఆచారం దాక్షిణాత్యులయందు కల"**దని స్మృతుల వలన తెలియ వస్తుందని తెలపడం, మన ఆంధ్రసమాజంలోని భార్యాభర్తల మధ్య అభ్యుదయ కరమైన వాతావరణం ఉన్నదని, అది పరంపరగా కొనసాగుతూందనే సత్యం దీని వలన తెలుస్తుంది. తెలుగు సంస్కృతిలో భాగమైన బతుకమ్మ పండుగ, గంగమ్మ జాతర, నాగోబా జాతర, పైడితల్లి జాతరలు మొదలగునవి ఆనాడు ప్రజల నమ్మకాలను సంప్రదాయాన్ని ప్రజల సంరక్షణ శ్రేయస్సు దృష్ట్యా జరుపుకునేవిగా చెప్పుకోవచ్చు. ఈ సంప్రదాయాలు, విశ్వాసాలు ఆధునికోత్తర కాలంలోనూ అనుసరించడంలోనూ ప్రధాన ఉద్దేశ్యం మారలేదు. కానీ జరుపుకునే తీరులో కొన్ని మార్పులు చేర్పులు జరిగాయని తెలుగు ప్రజలందరికీ తెలిసిన విషయమే.

క్రీ.పూ. 7, 6 శతాబ్దాలకు చెందిన ఆపస్తంభుడు పేర్కొన్న గృహస్థ కర్మలలో ఒకటి 'సీమంతోన్నయనము'. గర్భవతియగు స్త్రీలకు నాల్గవ మాసమున చేయబడు ఒక కర్మము. ఈ వేడుక వలన స్త్రీకి

ఆనందమును, సంతోషమును కల్గించుటే కాక, ఆశీస్సులను అందజేసే తీరు నేటికి కొనసాగుతూనే ఉండడం మన ఆంధ్రుల వారసత్వ సంపదగా పేర్కొనవచ్చు. చాళుక్య రాజు 2వ అమ్మరాజు 'మాగల్లు శాసనం'ను బట్టి దొమ్మన అను బ్రాహ్మణుడు 'కార్పటీ' వ్రతమును అనుసరించాడని తెలుపుతుంది. యావజ్జీవ బ్రహ్మచర్యము నడుపు వ్రతమును 'కార్పటీ' వ్రతము అనే వారని దీనిని అనుసరించే వారు ఆనాటి నుండి ఉండేవారని చరిత్ర ద్వారా తెలుస్తుంది. తెలుగు సంస్కృతిలో నిశ్చితార్థ సమయంలో కన్యకు తలపై పేలాలుంచుట ఆచారం. ఈ ఆచారాన్ని 'ముద్రారోహణము' చేయట అనేవారు. తూర్పు చాళుక్యుల నాటి ఆచారాల గురించి, చాళుక్య సోమేశ్వరుడు 'అభిలాషతీర్థ చింతామణి'లో చక్కగా వివరించాడు. వ్యాపారం నిమిత్తం పశువులపై వేయు ధాన్యపు సంచులను 'పెరికలు' అనేవారు. రాజుకు ఉండే సెక్యూరిటీగార్డ్స్ 'రక్షకభటులను' 'లెంకలు' అని పిలిచేవారు. రాజును దైవంగా భావిస్తూ, అతన్ని అన్నివేళలా కాపాడుతూ, రాజుతో పాటు మరణించడానికి కూడ వెనుదీయనివారే 'లెంకలు'.

"రణపుకడుపు" ఆచారం రెడ్డి, వెలమ రాజుల యుగంలో సర్వ సాధారణంగా అనుసరించేవారు. యుద్ధంలో మృతులైన వారి రక్త మాంసాలతో బియ్యం కలిపి వండిన వంటకాన్ని రణదేవతలకు భూత ప్రేత పిశాచాలకు నివేదన చేయడమే "రణకడుపు". ఇది ఒకరకంగా దండెత్తిన ప్రజలకు భయం కలిగించడం కోసం అనుసరించిన పద్ధతిగా తెలుస్తుంది. ఇటువంటి భయానక పద్ధతులను ఆచారాలను తరువాత తరం వారు వారసత్వంగా కొనసాగించక విడనాడారు. సమాజ, వ్యక్తి శ్రేయస్సుకు క్షేమకరం, ప్రయోజన కరం కాని అంశాలను సంఘటనలను విడనాడడం అభ్యుదయ లక్షణం.

ఇలా చెప్పుకుంటూ పోతే మతం, కళలు, శిల్పసంపద, వృత్తులు, పరిపాలనకు సంబంధించిన సంస్కృతి అంశాలు ఎన్నో ఒక తరం నుంచి మరో తరం అందిపుచ్చుకుంటూ రావడాన్ని **"సాంస్కృతిక వారసత్వంగా"** చెప్పుకోవచ్చు.

పైన వివరించిన సంస్కృతిలోని అంశాలలో కాలానుగుణంగా కొన్ని మార్పులకు లోనయ్యాయి. అలా మారుతూ ఉండడమే సంస్కృతి లక్షణం. సంస్కృతిలో ఏది స్థిరంగా ఉండదనే విషయాన్ని మనం గమనించచవచ్చు. సంస్కృతిలో మార్పు సహజమనే విషయాన్ని అభ్యుదయ కవి తిలక్ **"మన సంస్కృతి"** అనే కవితలో ఇలా తెలియ జేశారు.

**"మన సంస్కృతి నశించిపోతుందన్న పెద్దల విచారానికి మనవడు పిలక మాని క్రాపింగ్ పెట్టుకున్నాడనేది ఆధారం మనగలిగనదీ, కాలానికి నిలబడగలిగినదీ వద్దన్నా పోదు మరణించిన అవ్వ నగలు, మన కాలేజీ అమ్మాయి ఎంత పోరినా పెట్టుకోదు యుగ యుగానికి స్వభావం మారుతుంది అగుపించని ప్రభావానికి లోనగుతుంది"** (తిలక్ – అమృతం కురిసిన రాత్రి, పుట. 131)

తిలక్ కవిత్వీకరించిన దానితో సంస్కృతి తత్త్వం అభివ్యక్త మవుతుంది. మానవుని ఉత్తమ ఆదర్శ విలువలు మార్పులు రాకుండా కొనసాగే వాటిని వారసత్వం అంటున్నారు. ఇంతటి గొప్ప సంస్కృతి వారసత్వ సంపద కలిగి ఉన్న మనం నేటికి దానిని తూచ తప్పకుండా అనుసరించాలా లేదా విడనాడాలా అనేది ప్రశ్న. ఆధునికోత్తర జీవన విధానం మానవ సంబంధాలు సమాజ విలువల దృష్ట్యా ఇతరులకు ఇబ్బంది కలగనంతవరకు సంస్కృతిని అనుసరించవచ్చు. ఒకవేళ ఇబ్బంది కలిగించేదిగా ఉ



ంటే దానిని వదిలివేయడం మంచిది. అయితే వీటిలో ఆచరణలో చూపించేవి కొన్ని ఉంటాయి. ఆచరణలో చూపించక నమ్మకంతో విశ్వాసంతో కొనసాగించేవి పాటించేవి కొన్ని ఉంటాయి.

**వస్తు సంస్కృతులు**

ప్రపంచీకరణ మూలంగా వచ్చిన మార్పులు అన్నీ ఇన్ని కావు. ఇవి ముఖ్యంగా మనుషుల కంటే వస్తు సంస్కృతికి ప్రాధాన్యం ఇవ్వడం కనిపిస్తుంది. ఇల్లు అంటే అమ్మా నాన్న కాక వస్తువులుగా మారడం, కంపెనీలు మనిషికోసం కాక మనిషినే తమ ఆధీనంలోకి తీసుకోవడం మార్కెట్ సంస్కృతికి మహిళ ఆధీనం కావడం, సంస్కృతి లో స్త్రీ వినియోగ వస్తువవ్వడం ఆ వస్తువులను ఆడవాళ్ళకు పరిమితం కానివాటిని సైతం వారిచే (ప్రమోట్) ప్రచారం చేయించడం నేడు బాగా కనిపిస్తుంది. వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు పెరుగు తున్నాయి. వంటరి జీవితాలు స్వగ్రామాలలో యువకులు ఉండక పోవడం అమ్మానాన్న మరణించినా చివరి చూపుకొరకు రాలేని పరిస్థితి డాలర్‌కు దాసోహమవ్వడం, పరువు హత్యలు మొదలైనవాటి నుండి మన సంకల్పాలను సంస్కృతిని వదులుకోవల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

వస్తు సంస్కృతుల విషయానికి వస్తే ప్రపంచీకరణ ప్రభావం వలన రెండు ప్రధానమైన సంస్కృతులు గ్లోబల్ విలేజ్‌లోకి అడుగుపెట్టాయి. అవి 1. వస్తు వినిమయ సంస్కృతి 2. వస్తు వ్యామోహ సంస్కృతులు. ప్రపంచంలో ఎక్కడైనా మనుషులే వస్తువుల్ని లేదా సరుకుల్ని తయారు చేస్తారు. కానీ ఈనాటి మార్కెట్ ప్రపంచంలో

వస్తువులు లేదా సరకులే తమ వినియోగం కోసం మనుషుల్ని తయారు చేసుకుంటున్నాయి. వస్తు సంస్కృతులు మానవ జీవితంలో నెలకొన్న తీరును **"ఈ దారి ఎక్కడికి పోతుంది"** అన్న కవితలో అద్దేపల్లి రామమోహన్‌రావు చాలా చక్కగా విశ్లేషించారు.

**"అంతర్జాతీయ వ్యాపార తుఫానులో సొంత ముద్ర చెరిగిపోయిన వింత వస్తువును నేను మనిషి స్థానంలో వస్తువును ఆరాధిస్తున్న కొనుగోలు దారుణ్ణి నేను నిన్న నేను నా అవసరానికే వస్తువులు కొన్నాను నేడు నేను నా స్థాయికోసం వస్తువులు కొంటున్నాను రేపు నేను ఒక వస్తువుని కావడం కోసం జీవితాన్ని అమ్ముకుంటాను"** (పొగ చూరిన ఆకాశం, పుట.6)

ఈ కవితలో వస్తు సంస్కృతులు మనిషి జీవితంలోకి ప్రవేశించి పరాకాష్ట దశకు చేరాయి. మనిషి స్థానంలో వస్తువును ఆరాధించడం, తన స్థాయి హోదా కోసం వస్తువులు కొనడం వస్తు వ్యామోహం సంస్కృతికి చిహ్నాలు. తానే ఒక వస్తువు కావడం కోసం తన జీవితాన్ని అమ్ముకోవలసి రావడం, వస్తువినిమయ సంస్కృతిలో భాగం. ఈ సృష్టిలో అమ్మ ప్రేమకు సమానమైనది ఏదీ లేదంటారు. నవమాసాలు మోసి కని పెంచి పెద్దచేసే మానవతామూర్తి అమ్మ. అటువంటి అమ్మలకు **"తల్లుల దినోత్సవం"** అని సంవత్సరంలో ఒకరోజు ప్రకటించారు. ఆరోజు మదర్స్‌డే చాలా అసహజంగాను డాంబికం గాను మారుతున్న తీరును కవులు కొంత మంది వ్యతిరేకించారు. ఇందులో భాగంగా కవయిత్రి అనిసెట్టి రజిత రాసిన **"అమ్మ సంస్మరణ దినం"** కవితలో –

**"ఈ రోజు అమ్మల పండుగట ఎందుకో ఈ దండుగ పాపం మనకు బ్రతికున్న తల్లులు గుండెల మీద బండలు గతించిన తల్లులు అమృతామూర్తులు ఎంత నకలీవి మదర్స్‌డే లు ఎంతటి అవకాశవాదు మీ అమ్మల ఔన్నత్యంపై స్తుతిమోతలు"** (అనగనగా కాలం, పుట.53)

ఎన్ని మదర్స్‌డేలు వచ్చినా తల్లులు అనాథాశ్రమంలో చేరుతున్నారు. దీనికి కారణం బిడ్డలు, తల్లిదండ్రులను పట్టించుకోకపోవడం, వారిపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమే.

**ముగింపు**

తెలుగు చరిత్ర సంస్కృతిని వారసత్వంలో భాగంగా కొంత లోతుగా అధ్యయనం చేయడం వలన సంస్కృతిలోని అంశాలు తెలియడంతో పాటు, సంస్కృతి ప్రత్యేకత, సంస్కృతి నాగరికతల వైరుధ్యాన్ని గుర్తించవచ్చు. అయితే సంస్కృతిలోని వివిధ అంశాలు ఏవి ఈ నాటికీ వారసత్వంగా కొనసాగుతున్నాయో గుర్తించవచ్చు. అయితే వీటిలో వేటిని కొనసాగించాలి. వేటిని విడనాడాలో నిర్ణయించుకోవల్సిన బాధ్యత మన భుజస్కంధాలపై ఉంది. ఆధునికోత్తర పరిణామాలు, ప్రభావాల దృష్ట్యా మానవుని శ్రేయస్సు, సంక్షేమాన్ని కొలమానంగా స్వీకరించాలని మానవ శ్రేయస్సుకు తోడ్పడని వాటిని విడనాడే లక్షణాన్ని గుర్తించాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందని తెలుసుకోవచ్చు.

**ఆధార గ్రంథాలు**

1. చలపతి, గల్లా – తరతరాల తెలుగువారి మతాచార విశేషాలు
2. ప్రసాదరావు, పి.వి.కె – ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర, 2011, ఎమెస్కో ప్రచురణ
3. ప్రతాపరెడ్డి సురవరం – ఆంధ్రుల సాంఘిక చరిత్ర, 2017, క్లాసిక్ బుక్స్
4. ఆచార్య లక్ష్మీ రంజనం, ఖండవల్లి –ఆంధ్రుల చరిత్ర సంస్కృతి, బాలేందు శేఖరం, ఖండవల్లి
5. సత్యనారాయణ, కంబంపాటి – ఆంధ్రుల చరిత్ర సంస్కృతి
6. వెంకటేశ్వరరెడ్డి, అన్నపరెడ్డి –సంస్కృతి విన్యాసం, మోనోగ్రాఫ్, తెలుగు అకాడమీ, 2005


# శిలాక్షరం


**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-




**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్: 934 7971177**

# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక

మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి

వెంటనే శాశ్వత చందాదారులు కండి.

సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక

పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక

యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక

శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-

**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్: 934 7971177**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (11) హైదరాబాద్ మార్చి : 2025

# వావిలికొలను సుబ్బారావు – సాహిత్య సేవ

**ఆచార్య పమ్మి పవన్ కుమార్**, తెలుగు అధ్యయన శాఖ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం,

**కప్పల సురేశ్**, తెలుగు పరిశోధక విద్యార్థి, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఫోన్ : 98664 86934

## 1. పరిచయం

తెలుగు సాహిత్య రంగాన్ని సస్యవంతం చేసిన మహానుభావులు ఎందరో ఉన్నారు. వీరిలో ఒక ప్రత్యేకకోణంలో అధ్యయనం చేయ దగిన కవి, మహాయోగి శ్రీ వావిలికొలను సుబ్బారావుగారు. వీరు జమ్మలమడుగు పట్టణంలో 1863వ సంవత్సరంలో జన్మించారు. వాల్మీకి రామాయణాన్ని ఆంధ్రీకరించి ఆంధ్ర వాల్మీకిగా, వాసుదాస స్వామిగా ప్రసిద్ధిచెందారు. పోతనామాత్యుడిలాగా ఇష్టదైవమైన శ్రీరామచంద్రుడికి తన రామాయణాన్ని అంకితం చేశారు. **'రామకథ అనే పాలసముద్రంలో నిత్యం స్నానం చేస్తాను. ఆకలిదప్పులు తీరడానికి రామకథనే అమృతంగా తాగుతాను. వృథా ముచ్చట్లాడుతూ పొద్దు పుచ్చకుండా రామకథ అనే దివ్యమైన వెలుగులో ఒకపుంజమై శ్రీరాముని నామాన్ని పారాయణ చేస్తాను. రామకథ అనే ఔషధాన్ని గ్రోలుతూ శాశ్వతసౌఖ్యాన్ని అనుభవిస్తాన'**ని సుబ్బారావుగారు (మందరము: బాల–47, పుట:77) పేర్కొన్నారు. శ్రీ రామ సేవా తత్పరులై ఆదర్శవంతమైన సామాజిక జీవితాన్ని గడిపారు. 1936వ సంవత్సరం ఆగష్టు ఒకటవ తేదీన శ్రీరామునిలో ఐక్యమయ్యారు.

## 2. జీవితం – అధ్యాత్మ జీవితం

వావిలికొలను వారి తల్లిదండ్రులు శ్రీమతి కనకమ్మ, శ్రీరామ చంద్రరావు గార్లు. వీరిద్దరూ శ్రీరామ భక్తులు. వాలికొలనువారు చిన్నతనం నుండే సీతారాముల విగ్రహాలను బొమ్మరింటిలో పెట్టుకొని పూజించేవారట. 22 సంవత్సరాల వయసులో చిన్నాన్న లక్ష్మాజీరావు గారి దగ్గర శ్రీమద్రామాయణం ఉపదేశం పొందారు. ఆనాటి నుండి తన జీవిత పర్యంతం రామ నామమే జపిస్తూ రామపాద సేవ చేశారు. కంపసముద్రం నివాసులైన శ్రీమాన్ చెట్లూరి నరసింహాచార్యులవారు తనంతట తానే వీరి దగ్గరకు వచ్చి శ్రీరామ షడక్షర మంత్రాన్ని ఉపదేశించారు. వావిలికొలను వారు శ్రీరామ తారక మంత్రాన్ని జపిస్తూ నీతి బోధకాలైన కృతులను రచించి శ్రీరామచంద్రునికి అంకితం ఇచ్చారు.

సుబ్బారావుగారికి 1910వ సంవత్సరంలో భార్యావియోగం కలిగింది. లౌకిక బంధాలపట్ల విరక్తులై యోగసాధన కోసం ఘటికాచలం వెళ్లారు. కోదండరాముని స్వప్నాదేశాన్ని అనుసరించి ఒంటిమిట్టకు వెళ్ళి తమకు ఉన్న ఆస్తులన్నిటిని శ్రీరాముని సేవకోసం వినియోగించారు. స్వామి కైంకర్యానికి అవి మాత్రమే చాలవని తెలిసి, టెంకాయ చిప్పను పాత్రగా చేసుకొని భిక్షాటన చేస్తూ, అనేక పల్లెలు, పట్టణాలు తిరిగి ధనాన్ని సంపాదించి శ్రీరామునిసేవ కోసం ఉపయోగించారు.

సుబ్బారావుగారి పేరు వినగానే ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామ దేవాలయం కూడా గుర్తుకువస్తుంది. ఈ దేవాలయాన్ని పునరుద్ధరించి నిత్యం పూజా కార్యక్రమాలు, నిత్య ఉత్సవాలు జరిగేవిధంగా ఏర్పాటు చేశారు. ఒంటిమిట్టకు వచ్చే భక్తుల కోసం శ్రీ కోదండరామ సేవక సమాజాన్ని 1925లో ప్రారంభించారు. జబ్బుపడ్డ పేద ప్రజల కోసం ధర్మ వైద్యశాలను స్థాపించారు.



సుబ్బారావుగారు భక్తిమత ప్రచారానికై శ్రీ కోదండ రామ సేవక సమాజ సభ్యులతో కలిసి ఆంధ్ర దేశమంతటా పర్యటిస్తుండేవారు. అహోబిలంలో జరిగిన శ్రీరామ సప్తాహంలో స్త్రీలకు దాంపత్య ధర్మాలను గురించి, సాధువులకు వారి విధుల గురించి తెలియ జేశారు. వేదాంతుల రూపంలో ఉంటూ మాయలు చేసేవారిని, దంబాచారాలను నిరసించారు. ప్రజలలో నిజభక్తి చైతన్యాన్ని కలిగించడానికి సుబ్బారావుగారు కళ్యాణ దుర్గం, ధర్మవరం, హిందూపురం, కడప, జమ్మలమడుగు, మార్కాపురం, గుంటూరు, అంగలకుదురు, కంకిపాడు, నడిగడ్డపాలెం, జమ్ములపాలెం, సత్తెనపల్లి, నరసరావుపేట వంటి ప్రాంతాలలో పర్యటించి ధర్మోపదేశాలను అందించారు. కొన్నిచోట్ల భక్తుల కోసం వాల్మీకి ఆశ్రమాలను స్థాపించి వారికి వసతి సౌకర్యాలను కల్పించారు.

నేడు మనం పూజించుకొంటున్న ఎందరో యోగులు ఆ కాలంలో శ్రీ సుబ్బారావుగారిని దర్శించి ఆశీస్సులను అందుకొన్నారు. జిల్లెళ్ళ మూడి అమ్మగా ప్రసిద్ధి చెందిన అనసూయాదేవి గారికి తొమ్మిది సంవత్సరాలు వయసు ఉన్నప్పుడు సుబ్బారావుగారిని దర్శించారు. శేషశయనదాసు, చక్కిరాల అన్నపూర్ణమ్మ, తురగా కామాక్షమ్మ, బుద్ధాం శ్రీరామ శరణ్ వంటివారు భక్తులుగా, శిష్యులుగా ఉంటూ శ్రీరామునిసేవలో

సుబ్బారావుగారికి సహకరించారు. సుబ్బారావుగారు తాను యోగిగా జీవించారు. ఎందరో యోగులకు, మహానుభావులకు మార్గదర్శిగా ఉన్నారు. ధర్మాచరణకు ఉపకరించే ఎన్నో గ్రంథాలను మనకు అందించి తన జీవితాన్ని, అధ్యాత్మ జీవితాన్ని పండించుకొన్నారు.

### 3. సాహితీసేవ

వావిలికొలను సుబ్బారావుగారు తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలలో రచనలు చేశారు. తమ సాహిత్యాన్ని కేవలం పండితుల కోసం మాత్రమే కాకుండా, పామరులకు, బాలురకు, స్త్రీలకు, వృద్ధులకు అర్థమయ్యే రచనలు సైతం చేశారు. సుబ్బారావుగారి ప్రబంధ, నాటక, శతక సాహిత్యం ఘనమైన వారి సాహితీ పటిమను అనేకమైన కోణాలలో ప్రదర్శిస్తుంది. తెలుగు సాహిత్య లోకంలో వీరికి విశిష్ట స్థానాన్ని సంపాదించి పెట్టిన రచన మందరము. నైతిక, సాహిత్య రంగంలో నాటి పెద్దలు పూండ్ల రామకృష్ణయ్య, వేదం వేంకటరాయశాస్త్రి, తిరుపతి వేంకటకవులు, కందుకూరి వీరేశలింగం పంతులు, ధర్మవరం రామకృష్ణమాచార్యులు... వంటివారు సుబ్బారావు గారికి మిత్రులు, సమాజ, సాహితీ సేవలలో సహచరులు.

వావిలికొలను వారి సాహిత్యాన్ని అధ్యాత్మ సాహిత్యం, ఉపదేశాత్మక సాహిత్యం, పురాణ కథా సంబంధ సాహిత్యం, విమర్శనా సాహిత్యం, శతకసాహిత్యం, ప్రబంధసాహిత్యం, నాటక సాహిత్యం, దండక రచనలు, గద్యలు, వ్యాకరణ రచన వంటి విభాగాలు చేసి అధ్యయనం చేయవచ్చు. ఈ పత్రంలో ప్రబంధసాహిత్యం వరకు చేసిన రచనలను రేఖామాత్రంగా పరిచయం చేయడం జరుగుతున్నది.

### 3.1 అధ్యాత్మ సాహిత్యం

వావిలికొలను సుబ్బారావుగారు ఆంధ్ర వాల్మీకి రామాయణము, భక్తి ప్రాశస్త్యము, భక్తి విజయము , శ్రీరామ నామ మాహాత్మ్యము, శ్రీకృష్ణ లీలామృతము, భగవదారాధన విధానము, యోగవిద్య, ప్రమేయ రత్నావళి, పరమార్థ తత్త్వము మొదలైన ఆధ్యాత్మిక గ్రంథాలను రచించారు.

### 3.1.1 ఆంధ్ర వాల్మీకి రామాయణము

వావిలికొలను సుబ్బారావుగారు మూలాన్ని అనుసరించి (వాల్మీకి రామాయణం), ఆంధ్ర వాల్మీకి రామయణాన్ని రచించారు. ఏడు కాండలలో 24 వేల పద్యాలలో వెలువడిన బృహద్రచన ఇది. ఈ రచన 1904–1908 సంవత్సరాల మధ్య కాలంలో సాగింది. ఆయన ఈ గ్రంథాన్ని 1908వ సంవత్సరం అక్టోబరులో ఒంటిమిట్టలో శ్రీకోదండరామ స్వామి వారికి అంకితం ఇచ్చారు. గొప్ప కవులు, విద్వాంసులు, ఎందరో ఆ సభలకి వచ్చారు. విద్వత్కవులందరూ ఈ రామాయణ రచనని పరీక్షించి వారి అభిప్రాయాలను పద్యరూపం లోనూ, ఉపన్యాసరూపంలోనూ చెప్పి ఆశీర్వదించారు. ఈ సభలలోనే వావిలికొలను సుబ్బారావుగారికి ఆంధ్రవాల్మీకి అనే బిరుదును ప్రదానం చేశారు. వాల్మీకి హృదయాన్ని ఆవిష్కరించిన గ్రంథంగా ఆంధ్రవాల్మీకి రామాయణానికి తెలుగునాట, బయటా ఎంతో కీర్తి లభించింది.

### 3.1.2 భక్తి ప్రాశస్త్యము

సుబ్బారావుగారు 1926వ సంవత్సరంలో గుంటూరులో నెలవైన శ్రీ కోదండ రామస్వామి కైంకర్యానికి వెళ్ళినప్పుడు, శ్రీ సీతారామ భక్త సంఘం వారు ద్వితీయ మహాజన సభ జరిపారు. ఈ సభలకు సుబ్బారావుగారు అధ్యక్షులు. సుబ్బారావుగారు భక్తి మార్గ ప్రాశస్త్యాన్ని చక్కగా వివరిస్తూ చేసిన ఉపన్యాసాన్ని తరువాతికాలంలో భక్తి ప్రాశస్త్యము అనే గ్రంథంగా ప్రకటించారు. భక్తియే అన్నింటికన్నా శ్రేష్ఠమైనదని ఈ గ్రంథంలో సుబ్బారావుగారు సిద్ధాంతీకరించారు.

### 3.1.3 భక్తి విజయము

ఈ గ్రంథంలో సుబ్బారావుగారు నవవిధ భక్తి మార్గాలను గురించి వివరించారు. కపట వేదాంతుల మాయమాటలకు మోసపోకుండా అన్ని మతాలవారు, అన్ని వర్ణాలవారు, అన్ని వయస్సులవారు భక్తితో ఇష్ట దేవతలను తమ తమ సంప్రదాయాల ప్రకారం సేవిస్తే కృతార్థులు అవుతారని సుబ్బారావుగారు ఈ గ్రంథంలో విపులీకరించారు.

### 3.1.4 శ్రీరామనామ మాహాత్మ్యము

వావిలికొలను సుబ్బారావుగారు శ్రీ కోదండ రామ కైంకర్యం కోసం ఒకసారి చాగంటివారిపాలెం వెళ్లారు. అక్కడ కృష్ణమ్మ, రామమ్మ, సీతమ్మ, రంగారెడ్డి, మహానందిరెడ్డి అనే భక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా చెప్పిన విషయాలే తరువాత కాలంలో శ్రీరామ మహాత్మ్యము అనే గ్రంథంగా ప్రకటించారు. శ్రీరామ నామ శబ్ద ఔచిత్యాన్ని, వైశిష్ట్యాన్ని పురాణ సంబంధ పాత్రలు ద్వారా వివరించడం ఈ గ్రంథం యొక్క ప్రత్యేకత.

### 3.1.5 శ్రీకృష్ణ లీలామృతము

వావిలికొలను సుబ్బారావుగారు శ్రీకృష్ణ లీలామృతము అనే గ్రంథాన్ని నాలుగు భాగాలుగా రచించారు. ఆయన సోదరుడు రంగారావుగారు శ్రీకృష్ణుని చరిత్రను, లోక హితం కోసం రాయమని కోరినమీదట సుబ్బారావుగారు ఈ గ్రంథాన్ని రచించారు. శ్రీకృష్ణుని చరిత్రగా భాగవతం పరిచయం చేసిన విషయాలను, శ్రీకృష్ణ చరిత్రలోని అనేకమైన ఘట్టాలను వీరు 'లీల'లుగా ఈ గ్రంథంలో చిత్రించారు. అందుకే ఈ గ్రంథంలోని విభాగాలకు శ్రీకృష్ణ జన్మలీల, శైశవ లీల, బృందావన లీల, కళ్యాణ లీల, మహాత్మ్య లీల, విజయ లీల, క్రతురక్షా లీల, దూత కృష్ణ లీల, సూత కృష్ణ లీల, సాంత్వన లీల, దేశిక లీల, ద్వారక లీల, చిత్ర లీల, గర్వభంజన లీల అనే శీర్షికలను ఉంచారు. శ్రీకృష్ణుని చరిత్రను రమ్యంగా, సమగ్రంగా కళ్ళకు కట్టే రచన ఇది.


ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 13 హైదరాబాద్ మార్చి : 2025

### 3.1.6 భగవదారాధన విధానము



వావిలికొలనువారు స్థాపించిన శ్రీకోదండరామ సేవక సమాజంలో సభ్యులుగా చేరిన కొందరు స్త్రీలు భగవదారాధన గురించి వెలిబుచ్చిన సందేహాలకు సమాధానంగా భగవదారాధన విధానము అనే గ్రంథాన్ని రచించారు. భగవధారాధనకు సంబంధించిన ప్రపన్న ధర్మసార సముచ్చయము అనే రచనలోని అనేకమైన విషయాలను తెలుగులోకి అనువదించి ఈ గ్రంథ పీఠికలో పేర్కొన్నారు. పూజా విధానంలో ఉండే ఉపచారాలను స్వామికి సమర్పించే విధానాన్ని ఉత్తర పీఠికలో పొందుపరిచారు. భగవధారాధన మార్గాలు, పూజోపకరణాల విషయంలో పాటించవలసిన ధర్మాలను, విధి విధానాలను శాస్త్ర సమ్మతమైన పద్ధతిలో ఈ గ్రంథంలో వివరించారు.

### 3.2 ఉపదేశాత్మక సాహిత్యం





వావిలికొలను సుబ్బారావుగారు ప్రజల హితాన్ని ఆశించి ఎన్నో రచనలు చేశారు. బాల్యం నుండి జీవితాన్ని ఉత్తమమైన మార్గంలో నడుపుకోడానికి మార్గదర్శనంచేసే బాలక హితచర్య, కుమార హితచర్య, పతిహితచర్య, కుమారీ హితచర్య, సతీహితచర్య, గర్భిణీ హితచర్య, వైధవ్య ధర్మచర్య, ముముక్షు హితచర్య మొదలైన హితచర్య మాలికా గ్రంథాలను రచించారు. వీటిలో కొన్ని గ్రంథాలు ఆ కాలంలో ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలో పాఠ్యాంశాలుగా నిర్దేశించబడ్డాయి. శాస్త్రీయ ఆచారాలను, శాస్త్రీయ పద్ధతులను, వైదిక సంస్కారాలను అనుసరించటంలో సుబ్బారావుగారికి విశ్వాసం అధికంగా ఉండేదని ఈ గ్రంథాలను చదివితే అర్థం అవుతుంది.

### 3.2.1 బాలక హితచర్య

బాలురకు ఆరోగ్యంపట్ల అవగాహన కల్పించే కొన్ని ఆచరణ యోగ్యమైన పద్ధతులను సుబ్బారావుగారు ఈ గ్రంథంలో చర్చించారు. శంకరుడు, రాముడు అనే బాలుర సంభాషణతో ఈ గ్రంథం మొదలవుతుంది. పంచేంద్రియాలను సక్రమంగా ఉపయోగించడం, హితాన్ని కూర్చే ఆహార వివరాలు, ఆహారం జీర్ణం అయ్యే విధానం, నవ రంధ్రాలు నిర్వహించే విధులు, దేహ నిర్మాణం, మనస్సు వంటి విషయాలను ఈ గ్రంథంలో వివరించారు.

### 3.2.2 కుమార హితచర్య




రంగన్న అనే ఆయన అడిగిన ప్రశ్నలకు జవాబుగా వావిలికొలను సుబ్బారావుగారు ఈ గ్రంథాన్ని రచించారు. కోరికలను అదుపులో ఉంచుకోవడం, ఆత్మను రక్షించుకోవాలనే కోరిక, సంతానాన్ని పొందాలనే కోరిక, శాశ్వతానందం కోసం దేహరక్షణ యొక్క ఆవశ్యకత, చదివేకాలం, చదివే విధానం, అభ్యాసం, వినయం, మర్యాద, బలం, ప్రాణం, బ్రహ్మచర్యం, సుఖం వంటి విషయాల గురించి ఈ గ్రంథంలో వివరించారు.

### 3.2.3 కుమారీ హితచర్య

అత్తవారింట కోడలు మసలుకోవలసిన విధానాన్ని తెలియజెప్పే విషయాలన్నీ కుమారీ హితచర్యలో వివరించబడ్డాయి.ప్రాతః కాలంలో నిద్రలేవటం, గృహ కృత్యాలు, స్నానం, వంట, వడ్డన, దుష్టస్త్రీ జన సాంగత్యంవల్ల వచ్చే ఆపదలు, విరామ కాలంలో విజ్ఞానదాయక గ్రంథాలను చదవడం, ఆటలాడటం, ఉన్నదాంతో సంతృప్తి చెందడం, దొంగ గురువులను నమ్మకుండా ఉండడం, మానహానిని కలిగించే పనులు చేయకుండా ఉండడం, భోజనం చేసేటప్పుడు గమనించదగిన జాగ్రత్తలు, ఓర్పు కలిగి గృహ కృత్యాల ను నిర్వహించటం వంటి విషయాలను సుబ్బారావుగారు ఈ గ్రంథంలో వివరించారు.

### 3.2.4 పతి హితచర్య

వావిలికొలను సుబ్బారావుగారు కుమారహితచర్య తరువాత రంగన్నగారికి గృహస్థ ధర్మాలను బోధించటానికి పతిహిత చర్య గ్రంథాన్ని రాశారు. ఇందులో వివాహ ప్రయోజనం, స్త్రీ పురుష స్వభావ తారతమ్యం, భార్య–భర్తల సంబంధం, భార్య విషయంలో భర్త కర్తవ్యాలు, సంభోగ విషయాలు, వంశ పరంపరాగతం, గర్భధారణ చిహ్నాలు మొదలైన విషయాలను చర్చించారు.

### 3.2.5 సతీ హితచర్య

రుక్మిణమ్మ అనే మహిళ, మహాలక్ష్మమ్మ అనే మహిళకు వివరించిన పద్ధతిలో సుబ్బారావుగారు ఈ గ్రంథాన్ని రచించారు. ఇందులో పతివ్రతా స్త్రీలకు ఉండాల్సిన లక్షణాలను, అనుసరించాల్సిన నియమాలను పేర్కొన్నారు. ఆరోగ్య విషయం, యవ్వనంలో కలిగే శారీరక మార్పులు, గర్భస్రావం, ప్రసవవేదన, ప్రసవ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మొదలైన వివరాలు ఈ గ్రంథంలో ఉన్నాయి.

### 3.2.6 వైధవ్య ధర్మచర్య

కామేశ్వరమ్మ అనే మహిళ సుబ్బారావుగారికి రాసిన లేఖకు సమాధానమే ఈ గ్రంథం. అందులో భర్త లేని ఒక స్త్రీ సమాజంలో ఎలా బ్రతకాలో మార్గాలను సూచించమని కోరారు. ఆ ప్రశ్నకు సమాధానంగా సుబ్బారావుగారు వైధవ్య ధర్మచర్య అనే గ్రంథాన్ని 1925లో రచించారు. ఈ గ్రంథంలో పూజ్య–అపూజ్యముల చర్చ, సహగమనం, పునర్వివాహం, ఉద్యోగంలో చేరడం, మిత భాషణం... మొదలైన విషయాలను బోధించారు.

### 3.2.7 ముముక్షు హితచర్య

ఒంటిమిట్ట కోదండరామ సేవా సమాజంలో సభ్యురాలిగా ఉన్న వెంకట సుబ్బమ్మగారి వల్ల ముముక్షు హితచర్య అనే గ్రంథం వెలువడింది. ఎన్నో సందేహాలను సుబ్బారావుగారి వద్ద ఆమె నిత్యం ప్రస్తావిస్తుండేది. సుబ్బారావుగారు ఆమె అడిగిన సందేహాలన్నిటికీ ఓపికగా జవాబులు చెప్పేవారు. కొంతకాలం తరువాత ఆ జవాబులే ఈ గ్రంథరూపాన్ని పొందాయి. మోక్షం పొందాలని ప్రయత్నించేవాడు ముముక్షువు. అలాంటి ముముక్షువు కార్య సాధనకు మేలు కలిగించే చర్యను బోధించే గ్రంథమవడంవల్ల దీనికి ముముక్షు హితచర్య అనే పేరు పెట్టారు. ఇందులో సర్వ ముముక్షువులకు భక్తియే అవశ్యమని సుబ్బారావుగారు ప్రతిపాదించారు.

### 3.3 పురాణ కథా సాహిత్యం

జనశ్రుతిలో ఉన్న ప్రసిద్ధమైన పురాణ పాత్రలను చిన్న కథల రూపంలోకి మార్చి, వాటిని హరిశ్చంద్ర చరిత్రము, శకుంతలా చరిత్రము, నల చరిత్రము, రుక్మాంగద చరిత్రము, హనుమంతుని చరిత్రము, వామన చరిత్రము వంటి గ్రంథాలుగా మలిచారు సుబ్బారావుగారు.

### 3.3.1 హరిశ్చంద్ర చరిత్రము

సుబ్బారావుగారు ఈ గ్రంథాన్ని రాముడు, కృష్ణుడనే ఇద్దరు బాలకుల సంభాషణతో ప్రారంభించారు. ఈ గ్రంథంలో హరిశ్చంద్రుడు, చంద్రమతి, వశిష్ఠుడు, విశ్వామిత్రుడు, నక్షత్రకుడు మొదలైన పాత్రల ద్వారా సత్య, ధర్మాలయొక్క ఔన్నత్యాన్ని గొప్పగా వర్ణించారు.

### 3.3.2 శకుంతలా చరిత్రము

వావిలికొలను సుబ్బారావుగారు సంస్కృతంలో కాళిదాస మహాకవి రచించిన అభిజ్ఞానశాకుంతలము నాటకంలోని ఇతివృత్తాన్ని కాకుండా, మహాభారతంలోని కథను ఆధారంగా చేసుకొని ఈ గ్రంథాన్ని రచించారు. ఈ గ్రంథంలోని శకుంతల, దుష్యంతుల సంభాషణలు పఠితలకు ఆసక్తిని కలిగిస్తాయి. ఈ గ్రంథాంతంలో విద్య వల్ల కలిగే ప్రయోజనాలను సంక్షిప్తంగా పేర్కొన్నారు.

### 3.3.3 రుక్మాంగద చరిత్రము

సూర్య వంశ రాజైన రుక్మాంగదుడు విదిశాపురాన్ని పాలించిన విధానాన్ని సుబ్బారావుగారు ఈ గ్రంథంలో వివరించారు. ఏకాదశి వ్రతం చేయడం వల్ల కలిగే సత్ఫలితాలను ఈ గ్రంథంలో హృద్యంగా చెప్పారు.

### 3.3.4 హనుమంతుని చరిత్రము

ఈ గ్రంథాన్ని సుబ్బారావుగారు రెండు భాగాలుగా రచించారు. హనుమంతుడు సూర్యున్ని మింగడం, మైనాకుడు హనుమంతునికి అడ్డంగా రావడం, హనుమంతుడు లంకను చూడటం, జంబుమాలిని వధించటం, రావణుడు ఇంద్రజిత్తున్ని హనుమంతుని మీదకు పంపడం వంటి విషయాలు ఇందులో ఆసక్తికరమైన రీతిలో వర్ణించబడ్డాయి.

### 3.3.5 వామన చరిత్రము

వావిలికొలను సుబ్బారావుగారు వామన వృత్తాంతాన్ని వచనంలో రాశారు. విష్ణుమూర్తి దశావతారాలలో వామన అవతారం ఒకటి. ఈ గ్రంథంలోని కథలో విష్ణుమూర్తి దానం అడగడానికి వామనుడి రూపంలోవచ్చి బలిచక్రవర్తిని పాతళానికి అణిచివేస్తాడు. ఈ వృత్తాంతాన్ని సుబ్బారావుగారు వర్ణించిన తీరు, పోతానామాత్యుని శ్రీమద్భాగవతములోని వామనావతార ఘట్టాన్ని కళ్ళకు కడుతుంది.

### 3.4 విమర్శనా సాహిత్యం

వావిలికొలను సుబ్బారావుగారు ఆధునిక వచనం, జాతీయవిద్య, అస్పృశ్యత, రామావతార తత్త్వం మొదలైన అంశాలను గ్రహించి విమర్శనాత్మకంగా, విరివిగా వ్యాసాలు రాశారు. భాష, సమాజం, సాహిత్యం... మొదలైన అంశాలకు సంబంధించి సూటిగా చెప్పదలచు కొన్న విషయాలను మాత్రమే తమ వ్యాసాలలో చర్చించారు. ఈ

వ్యాసాలే తరువాత కాలంలో ఈ ఉపవిభాగంలో వివరించిన గ్రంథాలుగా ప్రకటించబడ్డాయి.

### 3.4.1 ఆధునిక వచన రచనా విమర్శనము

వావిలికొలను సుబ్బారావుగారు మద్రాసు రాజధాని కళాశాలలో ఆంధ్ర పండితులుగా పనిచేస్తున్నకాలంలో ఆ కళాశాలలో ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజం ఏర్పడింది. ఈ సమాజంవారు శెట్టి లక్ష్మీ నరసింహంగారు రచించిన గ్రీకు పురాణకథలు అనే నవీనాంధ్ర గ్రంథాన్ని సుబ్బారావుగారికి ఇచ్చి దీనిలోని శైలి సాధువా, అసాధువా? దీనిలో సూచించిన మార్గాలను అనుసరించి మేము పోవచ్చునా, పోకూడదా? అనే వివరాలను అందించవలసిందని కోరారు. సుబ్బారావుగారు ఆ గ్రంథాన్ని చదివి అందులోని శైలిని పాటిస్తే ఆంధ్ర భాషకు నష్టం కలుగుతుందని భావించారు. ప్రతిగా ఆధునిక వచన రచనా విమర్శనము రచించారు.

సుబ్బారావుగారు గ్రీకుపురాణ కథలు అనే గ్రంథంలో ప్రధానంగా– 1. సంభాషణ శైలి, 2. సంధి జ్ఞానమనావశ్యకం, 3. సంస్కృతం, తెలుగు, ఉర్దూ అని తేడా లేకుండా సర్వ పదాలు ప్రయోగించుట, 4.అర్ధానుస్వారం, శకట రేఫలను విడుచుట, 5. ఈ గ్రంథం విద్యార్థులకు ఉద్దేశించబడింది – అనే విషయాలను విమర్శించారు. ఈ నియమాలన్నీ గ్రామ్యవాద ఖండనాన్ని తెలిపేవే. నాటి కవి పండితులైన వేటూరి ప్రభాకర శాస్త్రి, కొక్కొండ వెంకటరత్నం, వేదం వేంకటరాయ శాస్త్రి... వంటివారు ఈ గ్రామ్య వాద ఖండనలో సుబ్బారావుగారికి సహకరించారు.

### 3.4.2 పోతన నికేతన చర్చ బమ్మెర పోత రాజ విజయముల వృత్తాంతము

వావిలికొలను సుబ్బారావుగారు తమ ఆంధ్రవాల్మీకి రామాయణములో బమ్మెర పోతనామాత్యుడు ఒంటిమిట్ట నివాసి అని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనకు ఆధారాలు తెలియజేయవలసిందని కొందరు సుబ్బారావుగారికి ఉత్తరాలు రాశారు. వారికి ప్రత్యుత్తరంగా సుబ్బారావుగారు వ్యాసాలను రాసి ప్రకటించారు. ఈ వ్యాసాలలోని ప్రతిపాదనను ఖండిస్తూ శ్రీ జయంతి రామయ్య పంతులు వంటివారు పోతానామాత్యుడి జన్మస్థలం ఏక శిలానగరమని వ్యాసాలు రాశారు. వీరిద్దరి వాదనలు ఆంధ్ర కవులచరిత్రములోని పోతన నికేతనచర్చలో ఉన్నాయి.

వావిలికొలను సుబ్బారావుగారి వ్యాసాలను చదివి, కందుకూరి వీరేశలింగంగారుకూడా ప్రత్యుత్తరంగా ఒక వ్యాసం రాశారు. సుబ్బారావుగారు కందుకూరి వారి అభిప్రాయాన్ని ఖండిస్తూ రాసిన ఐదు వ్యాసాలను కలిపి బమ్మెర పోతరాజ విజయము అనే గ్రంథంగా ప్రకటించారు. ఈ గ్రంథంలో పోతన ఒంటిమిట్టవాడని నిరూపించ డానికి ప్రధానంగా ఎనిమిది కారణాలను చూపించారు. ఆయన అభిప్రాయయాన్ని సమర్థించిన మంత్రిప్రెగడ భుజంగ రావుగారు, నాగపూడి కుప్పస్వామయ్యగారు వంటివారిని కూడా ఈ గ్రంథంలో ప్రస్తావించారు.

### 3.4.2 ఆర్య విద్యోపన్యాసములు

ఈ గ్రంథాన్ని జగన్నాథపురం జాతీయపాఠశాలలో వావిలికొలను సుబ్బారావుగారు స్వయంగా చదివి వినిపించారు. ఇందులో పాశ్చాత్య నాగరికతను విమర్శించారు. సంప్రదాయ విద్యాభ్యాసానికి సంబంధించిన అంశాలను ఈ గ్రంథంలో వివరించారు.

### 3.4.3 అస్పృశ్యత

అడయార్ ఆంధ్ర పరిషత్తు ద్వితీయ వార్షికోత్సవాల సంధర్భంగా వావిలికొలను సుబ్బారావుగారు అధ్యక్షతన అస్పృశ్యత అనే విషయంపై ఒక సభ జరిగింది. ఆ సభ చివరలో అస్పృశ్యతకు సంబంధించిన అనేక అంశాలకు సమాధానాలను తమ ఉపన్యాసంలో వివరించారు. తరువాతి కాలంలో ఆ ఉపన్యాసమే అస్పృశ్యత గ్రంథంగా వెలువడింది.

### 3.5 శతక సాహిత్యం

సుబ్బారావుగారు రచించిన శతకాలు మూడు. తల్పగిరి రంగనాయక శతకము, టెంకాయ చిప్ప శతకము, శ్రీ కల్పద్రుమ శతకము. ఇందులో తల్పగిరి రంగనాయక శతకము మొదటిది, పాండిత్య నిరూపణ కోసం రచించబడినది. మిగిలిన రెండు శతకాలూ శ్రీకోదండ రామ కైంకర్యాలకు వెళ్ళినప్పుడు ఎదురైన అనుభవాలను వివరిస్తాయి.

### 3.5.1 తల్పగిరి రంగనాయక శతకము

వావిలికొలను సుబ్బారావుగారు శ్రీకుమారాభ్యుదయము అనే ప్రౌఢ ప్రబంధాన్ని రచించారు. ఈ సందర్భంలో నెల్లూరులో శరభ లింగంగారు సన్మానసభ ఏర్పాటుచేశారు. ఆ సభలో కొంతమంది పండితులు ఆ గ్రంథం సుబ్బారావుగారు రాయలేదని, ఆయన పేరుతో వారి పెద్దలెవరో రాసి ఉంటారని విమర్శించారు. రెండు రోజుల తరువాత ఆ పండితుల విమర్శలు సుబ్బారావుగారికి తెలిశాయి. ఆ మరుసటి రోజే సుబ్బారావుగారు తల్పగిరి రంగనాయక శతకమును రచించి శ్రీ పూండ్ల రామకృష్ణయ్యగారికి అంకితం ఇచ్చారు.

విక్రమ సింహపురి రంగ నాయకులస్వామివారికి గిరియే తల్పము కాబట్టి, సుబ్బారావుగారు ఈ శతకానికి తల్పగిరి రంగనాయక శతకము అని పేరు పెట్టారు. ఈ శతకంలో మొదటి పద్యం నుండి పన్నెండు వరకు గల పద్యాలలో మొదటి అక్షరాలను కలిపి చదివితే **శ్రీ రంగనాయకీ నాయకాయ నమః** అని వస్తుంది. అంతేకాకుండా ఈ శతకంలో 81వ పద్యం నుండి 90వ పద్యంవరకు గల పద్యాల లోని మొదటి పాదంలోని ప్రాసాక్షరాలను కలిపి చదివితే వావిలికొలను సుబ్బారావు అని వస్తుంది. ఇలాంటి భాష–ఛందో ప్రయోగాలను సుబ్బారావుగారు ఈ శతకంలో హృద్యంగా ఆవిష్కరించారు.

### 3.5.2 టెంకాయ చిప్ప శతకము

వావిలికొలను సుబ్బారావుగారు శ్రీకోదండరామస్వామి వారి కైంకర్యం కోసం వివిధ ప్రాంతాలను సందర్శిస్తున్నప్పుడు కలిగిన అనుభవాలను గుదిగుచ్చి టెంకాయ చిప్ప శతకాన్ని రచించారు. శ్రీరాముని కైంకర్యానికి మొట్టమొదటిగా తమకు సహకరించిన టెంకాయ చిప్ప మీద రమ్యమైన పద్యాన్ని చెప్పారు. **'నా చేతిలో నిలిచి, వేల రూప్యములను పోగుచేసి, ఒక్క దమ్మిడి కూడా దాచుకోకుండా, శ్రీరాముని సేవకు అర్పించి ధన్యమయ్యావు, ఓ టెంకాయ చిప్పా! నీ కంటే లోకంలో గొప్పదేముంది?'** (టెంకాయ చిప్ప శతకం. 1:30). లోకపురీతిని భక్తితో రంగరించి అందించిన కృతి ఇది.

### 3.5.3 శ్రీభక్త కల్పద్రుమ శతకము

వావిలికొలను సుబ్బారావుగారు శ్రీకోదండరామ స్వామి వారి సామ్రాజ్య పట్టాభిషేక వైభవాన్ని వర్ణిస్తూ ఈ శతకాన్ని రచించారు. దీనిలో కూడా టెంకాయ చిప్ప శతకంలోలాగా శ్రీ కోదండ రామ కైంకర్యానికి వెళ్ళినప్పుడు కలిగిన అనుభవాలను చెప్పారు.

### 3.6 ప్రబంధ సాహిత్యం

వావిలికొలను సుబ్బారావుగారు శ్రీకుమారాభ్యుదయము, శ్రీ కౌసల్య పరిణయము అనే రెండు ప్రబంధాలు రచించారు. వీటిలో మొదటి గ్రంథాన్ని ప్రౌఢ కావ్యంగా రచించారు. రెండవది సరళమైన రచన.

### 3.6.1 శ్రీ కుమారాభ్యుదయము

సుబ్బారావుగారు కడపజిల్లా రాజంపేటతాలూకా టంగుటూరులో పనిచేస్తున్నప్పుడు రచించిన తెలుగు పద్యకావ్యం శ్రీకుమారాభ్యుదయము. ఈ కాలంలో రచించబడిన మిశ్ర ప్రబంధాలలో శ్రీకుమారాభ్యుదయము లాంటి పదగుంఫనం కలిగిన చమత్కారమైన కావ్యంలేదని ప్రతీతి. ఇందులో మూడు ఆశ్వాసాలు ఉన్నాయి. మొదటి ఆశ్వాసంలో మన్మథ సంహారం, ద్వితీయాశ్వాసంలో శ్రీకృష్ణుని – రుక్మిణీ కళ్యాణం, ప్రద్యుమ్నుని జననం, మూడవ ఆశ్వాసంలో ప్రద్యుమ్నుని విజయం మొదలైన ఘట్టాలు ఉన్నాయి. ఈ కావ్యంలో పద్మ బంధం, నాగబంధం, ఛత్ర బంధం, శ్వేత బంధం, ఖడ్గబంధం వంటి పద్య బంధాలు ఉన్నాయి.

వావిలికొలను సుబ్బారావుగారి మిత్రులైన లంకలపల్లి వేంకటసుబ్బయ్యగారు శ్రీకుమారాభ్యుదయము పద్యకావ్యం పాఠక లోకానికి సుబోధకంగా అర్థమవ్వడానికి సుమనోల్లాసము అనే పేరుతో టీకా తాత్పర్యాలను రాశారు. పూండ్ల రామకృష్ణయ్యగారు శ్రీకుమారాభ్యుదయానికి కృతి విమర్శనంచేస్తూ ఇందులోని దండకం దాదాపుగా భోగినీ దండక శైలిని పోలియున్నదని, కొన్ని పద్యాలు శృంగార నైషధము, రామాభ్యుదయములోని పద్యాలలాగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

### 3.6.2 శ్రీ కౌసల్యా పరిణయము

వావిలికొలను సుబ్బారావుగారు మాతృ ప్రేరణతో శ్రీకౌసల్యా పరిణయము అనే ప్రబంధాన్ని 1894 వ సంవత్సరంలో రచించారు. ఇది ఆరు ఆశ్వాసాల చంపూకావ్యం. ఈ కావ్యానికి మాతృకలు మారాఠీ భాషలో గేయాల రూపంలో ఉన్నాయని సుబ్బారావుగారు పీఠికలో ప్రస్తావించారు. ఇందులో మొదటిగా ఇష్ట దైవమైన శ్రీరామచంద్రుని స్తుతించారు. తరువాత సంస్కృతాంధ్ర కవులను ప్రస్తావించారు. స్త్రీ వర్ణనల కంటే, ప్రకృతి వర్ణనలను మెండుగా కలిగి ఉన్న ఈ గ్రంథం పాఠకులను ఎంతో ఆహ్లాదపరుస్తుంది.

### 4. ముగింపు

వావిలికొలను సుబ్బారావుగారి రచనలలో పైన చెప్పబడిన గ్రంథాలు మాత్రమే కాకుండా శ్రీమద్భగవద్గీత అనే వ్యాఖ్యాన గ్రంథం, శ్రీరాముని దండకము, ఆంజనేయ దండకము, వాసుదాసు దండకము మొదలైన దండక రచనలు, బమ్మెరపోతన రత్నములు, రహస్య రత్నాకరము అనే రెండు సంకలన గ్రంథాలు, చతుఃశ్లోకి, శరణాగతి గద్య అనే రెండు అనువాద రచనలు కూడా ఉన్నాయి.

వంగదేశంలో గౌరాంగుడిలాగా ఆంధ్ర దేశంలో భక్తి చైతన్యాన్ని ప్రజలలోనింపి, జీవితాన్ని, సాహిత్య జీవితాన్ని ఫలప్రదం కావించుకొన్న ధన్యజీవి శ్రీ వావిలికొలను సుబ్బారావుగారు.

### 5. ఉపయుక్త గ్రంథ సూచి

1. అహోబలరావు, కల్లూరి. 1975. రాయలసీమ రచయితల చరిత్ర. హిందూపురం: శ్రీకృష్ణ దేవరాయ గ్రంథమాల.

2. కామాక్షమ్మ, తురగా. 1935. ఆంధ్ర వాల్మీకి శ్రీవాసుదాస జీవితము. మద్రాసు: సరస్వతీ ముద్రణాలయం.

3. తిరుపతిరెడ్డి, గౌరు. 2007. కడప జిల్లా సాహితీ మూర్తులు. హైదరాబాద్ : ప్రజాహిత పబ్లిషర్స్.

4. రమాపతిరావు, అక్కిరాజు. 1991. ప్రతిభా మూర్తులు. హైదరాబాద్ : విజ్ఞాన దీపిక ప్రచురణలు.

5. రామరాజు, బిరుదురాజు. 2003. ఆంధ్ర యోగులు (చతుర్థ భాగం). హైదరాబాద్ : ఓం సాయి గ్రాఫిక్స్.

6. రామారావు, యస్వీ. 2017. సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర. హైదరాబాద్ : స్వయంప్రభ పబ్లిషర్స్.

7. సత్యనారాయణ శాస్త్రి, మధునాపంతుల. 1950. ఆంధ్ర రచయితలు. రాజమండ్రి : సరస్వతి పవర్ ప్రెస్.

8. సీతాపతిదాసుడు, మెట్టపల్లి. 2009. శ్రీ వాసుదాస దేశిక వైభవము. అంగలకుదురు : శ్రీ కోదండ రామసేవక సమాజం.

9. హనుమచ్ఛాస్త్రి, జానుమద్ది. 1973. మా సీమకవులు. కడప : మాసీమ పబ్లికేషన్స్.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక  సంపుటి -28 : సంచిక - 5

హైదరాబాద్  మార్చి : 2025

# వసంత శోభలకు పునాది 'ఉగాది'

**ఆచార్య శ్రీవత్స,** తిరుపతి, ఫోన్ : 90003 24024

ప్రకృతి విలసనంతో మరో ఉగాది (ఉగస్య ఆది:) పర్వం ప్రభవించింది. చైత్ర శుద్ధ పాడ్యమి ఉగాది పర్వదినం శ్రీకర సోయగాలతో నవ నవోన్మేష లావణ్యంతో ప్రకృతి మాత పరిమళిం చగా పుడమితల్లి పులకరిస్తుంది.

తెలుగునాట ఆనందోత్సాహాలతో నూతన సంవత్సరారంభం కావించే దినమే ఉగాది. అదే నవ్యాశలకు పునాది. కాలకన్య భూ నభాలనే రెండు పెదవుల మధ్య ఈనాటి చిరునవ్వుల పేరే ఉగాది.

కవుల కలాల చిందుల పరిష్వంగంతో తనువెల్లా తన్మయత్వం చెందిన కళామతల్లి చిత్రకారుల కుంచెలతో సమ్మేళనం బొంది పరిఢవిల్లుతుంది.

అనంతమైన, అద్భుతమైన మహోన్నతమైన సకల చరాచర సృష్టికి ఆది ఉగాది. ప్రతి యుగాదికి ఆదిలో 84 లక్షల జీవరాసుల్ని సృష్టించి విశ్వరచనకు శ్రీకారం చుట్టిన క్షణమే ఉగాది.

మానవ మనుగడకు సాకారమై పుకరించిన గుండెలతో కోయిల కూస్తుంది. మధురానురాగ మమతలకు ఆశావహ భవితల పరంపరాకృతమై పలవరించిన మనసుతో మల్లెలు విరుస్తాయి.

పుడమితల్లిపై ఉషస్సులకు నిలయమై పరిఢవిల్లిన మధువులు కురుస్తాయి. నవ పల్లవ లాస్య మృదుహేలతో స్నిగ్ధారావ ప్రమోదాలు పూస్తాయి.

ఉగాది ఉగాదికీ మనసు కోయిల, ఊహల మామిడిచెట్టు మీద ఆశల చివురులు తింటూ వనంలోని పచ్చదనం మా జీవనంలోనూ నింపమంటూ ఆమనికి స్వాగతం పలికే క్షణమే ఉగాది. ఏడాదికో పేరుతో వచ్చి ఊరించే ఉగాది ముందు కోరికలన్నీ ఏకరువు పెడతాయి. కష్టనష్టాల లిస్టు చెప్పి మా కన్నీళ్ళు తుడవమని చెప్పే సమయమే ఉగాది. సత్యాసత్య విచికిత్సతో ఆత్మానాత్మ వివేచనలో పడి ప్రశ్నార్థకమై పోయేవాళ ఉద్దీపించు ఆశల కిరణమే ఉగాది. నవ జీవనారంభ సంచికకు మేలుబంతీ ఉగాది. అనంతకాల సాగర లహరి వసంత శోభల భవ్య ఉగాది.

పుడమితల్లిపై ఉషస్సులకు నిలయమై పరిఢవిల్లిన మధువులు కురుస్తాయి. నవపల్లవ లాస్య మృదుహేలతో స్నిగ్ధారావ ప్రమోదాలు పూస్తాయి. ప్రభవించిన ప్రమాదాన్ని నిర్మూలించి, విరిసిందీ చైత్ర మాసారంభ ఉగాది. ఇది నవ జీవనకు నాందియై కొత్త ఆశల విరజాజుల్ని విరబూయిస్తుంది. భవితాశలకు పునాదియై ఆమని సోయగాలతో కొత్త భాష్య నేర్పుతుందీ ఉగాది. సమతా మమతల ద్యుతులతో వనదేవత సాక్షాత్కారమై విన్యాసలీలల ఊసుల్ని నింపుతుంది. అంతులేని ఆశల సవ్వడియై వసంతకాంత సోయగాల్ని నింపుకుని మానవాళికి జాగృతులతో అవతరిస్తుంది.

నిరాశా నిస్పృహుల నైమిశారణ్యంలో జీవించే మానవాళికి కొత్త మనుగడను కల్పించే భవిష్యదాశల పునాదియై సర్వజనులను ఆహ్లాదపరిచేదే తెనుగు సంవత్సరాది. ఆంధ్ర సంస్కృతికి ప్రతీకగా విరాజిల్లుతూ మొత్తం ప్రపంచానికి మూలాధారమైంది.



భవిష్యత్ ఆశల తీపితో, చేదు అనుభవాలను మేళవింపజేసి అభిరుచుల వగరుతో పొత్తు కలిపి, కఠిన నియమ ప్రవర్తనల కారాన్ని చేర్చి చింతపులుపుతో రంగరించి, వింత వింత పోకడల ఉత్పాతాల ఉప్పుతో నిగూఢపరచి, పరమార్థ తత్వాన్ని చూపించి జీవితానికి సార్థక్యాన్ని కలిగింపచేసేదే ఉగాది.

అంతేగాక ఈ 'క్రోధి' నామ సం॥ర ఉగాది నవ్యమై సుఖదు:ఖాల్ని సమం చేసి, జీవితంలో ఆశల చివుళ్ళను చివురింపచేసి, నవ నవోన్మేషంగా ప్రకాశిస్తూంటుంది. మరియు మానవత్వంతో పరిమళిస్తుంది.

హైందవ సంస్కృతికి, ధర్మానికి సంబంధించిన పర్వాల్లో ఎంతో పరమాత్మ తత్త్వం ప్రాముఖ్యత ఉంది. భారతీయ జాతి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలై విలసిల్లేవే మన పండుగలు, అలాంటి పండుగల్లో ప్రకృతికి సంబంధించిందే ఉగాది.

### ఉగాది ఎప్పుడు వస్తుంది...?

**"చైత్రమాసే జగద్బ్రహ్మా - ససర్జ ప్రథమేహని ।**
**శుక్ల పక్షే సమగ్రంతు - తదా సూర్యోదయే సతి॥"**

చైత్రశుద్ధ పాడ్యమి సంవత్సరాది అవుతుంది. పాడ్యమి సూర్యోదయ సమయంలో ఉండాలి. బ్రహ్మదేవుడు చైత్రశుద్ధ పాడ్యమి నాడు సూర్యోదయ సమయానికి తన సృష్టినంతయు పూర్తి చేశాడు. సంవత్సరారంభమున పూర్వ తిథితో కూడిన పాడ్యమినే గ్రహించాలి. చైత్రశుద్ధ పాడ్యమి దినాన ఉపవాసం చేసి బ్రహ్మను పూజించినవారు సంవత్సరమంతయు సుఖాన్ని పొందగలరు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2025



**"అమాయుక్తా న కర్తవ్యా ప్రతిపచ్ఛండికార్చనే ।
ముహూర్త మాత్రా కర్తవ్యా ద్వితీయాది గుణాన్వితా ॥**
**(దేవీపురాణం)**

విదియతో కూడిన పాడ్యమినే గ్రహించాలి. అమావాస్యతో కూడిన పాడ్యమి పనికిరాదు అని దేవీపురాణం చెప్తోంది.

అని విష్ణు ధర్మోత్తర పురాణమ్ పేర్కొంటుంది. చైత్రమాసం శుక్ల పక్షం పాడ్యమి తిథిరోజున బ్రహ్మ సృష్టి ప్రారంభించాడు. ప్రకృతి పరంగా ఆలోచిస్తే శిశిర ఋతువులలో చెట్లన్నీ ఆకులు రాలుస్తాయి. వసంత ఋతువు రాగానే ఎండిన మోడులు సైతం చిగిర్చి, పుష్పించి నవనవోన్మేషంగా విలసిల్లుతాయి. ఇందులో దాగిన పరమార్థ మేమిటంటే... సకల రుగ్మతలతో బాధపడి నిరాశా నిస్పృహలకు లోనయ్యే జీవుడు వసంతాగమనంతో సంతోషం, ఆనందమనే చివుళ్ళ తొడుక్కుని హాయిగా విరాజిల్లుతూ, సకల రుగ్మతల్ని విస్మరించి, భవిష్యదాశలపై దృష్టిని సారించి ముందుకు నడుస్తాడు. అలా ధర్మమార్గంలో నడిచే నడకకే 'ఉగాది' అని పేరు.

**యుగాది – ఉగాది ...!**

ఉగాది (ఉగ + ఆది) అంటే సంవత్సరాది అని పేర్కొంటున్నాం.

**"అహస్సంవత్సరో వ్యాళః" (విష్ణు సహస్రనామం)**

**"కాలాత్మనా స్థితః విష్ణుః సంవత్సరః"**

అని శంకరభాష్యం స్పష్టం చేస్తున్నాయి. కాలస్వరూపుడైన శ్రీమహావిష్ణువే సంవత్సరమని భావం. "ఉగ" అంటే జన్మ, ఆయుష్షు (శబ్దరత్నాకరం, సూర్యరాయాంధ్ర నిఘంటువు చెప్పిన మేరకు) **"ఉగము ద్రుంగించెడునన్"** అని రాఘవ పాండవీయం చెబుతోంది. దీనిబట్టి ఉగాది అంటే ప్రపంచం యొక్క జన్మ, ఆయుష్షులకు మొదటి రోజు అని అర్థం. 'ఉగాది' తెలుగు పదమైతే దీనికి సంస్కృతరూపం 'యుగాది'. యుగాదే ఉగాదిగా మారింది.

'ఉగ' అంటే నక్షత్ర గమనం. సృష్టి కార్యం ప్రారంభమైన రోజే ఉగాది. సూర్యుడు చైత్రమాస శుక్లపక్ష పాడ్యమి నాడు భూమధ్య రేఖపై యుండుట వల్ల చంద్రగమనం శుక్లపక్ష పాడ్యమి, అశ్వనీ నక్షత్రంతో ప్రారంభమైనందున ఈ రెండు కలిసే చైత్రశుద్ధ పాడ్యమి నాడు యుగ దిన మాన వర్షారంభం అవుతుందని సిద్ధాంతీకరింప బడింది.

"ఉగస్య ఆదిః – ఉగాదిః", "ఉగ" అనగా నక్షత్ర నడక ప్రారంభమైన రోజు. అంటే సృష్టి ఆరంభమైనరోజే ఉగాది. 'ఉడు' అంటే నక్షత్రం 'గ' అనగా గమనం (నడక). 'ఉడు'లోని 'ఉ', గమనంలోని 'గ'ను స్వీకరించగా "ఉగ" ఏర్పడిందని శాస్త్రజ్ఞులు పేర్కొంటున్నారు. సృష్టి ఆరంభకాలమే "ఉగాది" అయ్యింది.

'యుగ' శబ్దానికి జంట, కాలం, సంవత్సరం, నాల్గు హస్తముల ప్రమాణం, కృతాది యుగములు, రథము, బండికాడి, ఓషధి తదితర అర్థాలున్నాయి.

"యుగము" అంటే జన్మ అని యాజ్ఞవల్క్య మహర్షి వివరించాడు. 'జన్మాద్యస్యయతః" వ్యాసభగవానుని రెండవ బ్రహ్మసూత్రం అంటే ఈ జగత్తు జన్మాది బ్రహ్మమని అర్థం.

ఈ యుగ శబ్దానికి దేవుడు, వేదము, రథము, బండికాడి అని అర్థాలు ఉండటం వల్ల సహజంగా వివాహ సమయంలో లగ్నం కాగానే వెంటనే వివాహ ప్రక్రియ యుగం (బండికాడి)తో ప్రారంభ మవుతుంది. వరుడు వధువు తలమీద యుగాన్ని (బండికాడి) ఉంచి ఆ కాడి రంధ్రాల ద్వారా ఆవుపాలతో అభిషేకించి ఆమెను పవిత్రురాల్ని చేస్తాడు.

ఈ యుగం (బండికాడి)లో నున్న రెండు రంధ్రాలు అర్థకామాలని విజ్ఞులు వివరిస్తున్నారు కదా! లగ్న సమయంలో వరుడు – **"ధర్మేచ, అర్థేచ, కామేచ, మోక్షేచ నాతిచరామి, నాతి చరితవ్యా"** అని అంటాడు. అంటే **"ధర్మార్థ కామమోక్షాలను నేనతిక్రమించను. నీవతిక్రమించకు"** అని ప్రమాణం చేస్తాడు. దీనికి గుర్తుగానే యుగం (బండికాడి) యొక్క రెండు కొనల నుంచి గోక్షీర ధారలతో వధువును అభిషేకిస్తున్నాడు. ధర్మబద్ధమైన అర్థకామాలు వర్షించుగాక! అనే పరమార్థ తత్త్వానికి ఇది ప్రతీక.

ఈ విధంగా ధర్మార్థ కామాలను వర్షించు దైవ స్వరూపమైన యుగంతో ప్రారంభమైంది కాబట్టే వివాహం ఇంత మంగళప్రదమైంది మన హిందువులకు. ఈ యుగారంభమే వివాహానికి యుగాది – ఉగాది అయిందన్న మాట!

**"యుజ్యత ఇతి యుగః – యోగః"** అనే సమాసం. యుజిర్ యోగే అనే ధాతువు ననుసరించి యుగమంటే యోగమని అమరసింహుడు విశదీకరించాడు. యుగమే యోగము పరస్పరం కూడుకొని ఉండేవి. పరస్పరం కూర్చునవి అనే అర్థాలు కూడా ఉన్నాయి.

నూతన వధూవరులు అంటే కొత్తజంట (యుగము)ను వేద స్వరూపమైన యుగము (బండికాడి)తో కూర్చి పరస్పరం అవి కూడుకొని ఉండేలా సరికొత్త యుగాన్ని అంటే జీవితా (జన్మ)ని ప్రారంభిస్తారు. ఆ యుగం చేత ఆ జంట అలా కొత్త జీవితాన్ని ప్రారంభిస్తారు. కాబట్టే వారికి పెండ్లిరోజే యుగాదైంది. అది వారికి నిజమైన విశిష్టత కల్గిన "ఉగాది" అవుతుంది.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2025

### ఉగాది పచ్చడి వైశిష్ట్యం

**"శతాయుర్వజ్ర దేహాయు: సర్వ సంపత్కరాయచ ।**
**సర్వారిష్ట వినాశాయ నింబకుసుమ భక్షణం ॥"**

వేపపూత పచ్చడిని సేవించడం వల్ల సర్వారిష్టాలు తొలగి సర్వ సంపదలు కలిగించే అదృష్టం పెరిగి, దీర్ఘాయువు, వజ్రంలాంటి దేహదారుఢ్యం, శాంతి కలుగుతాయి అని పై శ్లోకార్థం.

అయితే ఈ వేపపూవు షడ్రుచులతో కలిపి ఉగాది పచ్చడిగా సేవిస్తారు. దీని అంతరార్థం జీవితంలో వచ్చే ఒడిదుడుకులు, ఆటుపోట్లు, సుఖదు:ఖాలను ఎదుర్కొనే స్థైర్యం కొరకు ఈ ఉగాది పచ్చడిని సేవిస్తారు. ఇది త్రిగుణాత్మక గుణాలను సమం చేసి తాత్త్విక దృష్టికి ప్రతీకగా షడ్రుచుల ఉగాది పచ్చడిని సేవించాలి. అందుకే ధర్మసింధువు ఇలా చెప్పింది.

నూత్న సంవత్సర (ఉగాది) ప్రారంభం రోజున ప్రతి ఇంటికి తోరణాలు కట్ట వేపపూత కల్గిన ఉగాది పచ్చడిని సేవించి, సంవత్సర ఫలం (పంచాంగ శ్రవణం)తో తినాలి. ఆ తర్వాత ఉగాదినుండి నవమి వరకు శ్రీరామ నవరాత్రులు జరపాలి. తర్వాత పంచాంగ శ్రవణం చేసిన వారికి సూర్యభగవానుడు శౌర్యాన్ని, చంద్రుడు ఇంద్ర సమానమైన వైభవాన్ని, కుజుడు శుభాన్ని, బుధుడు బుద్ధిని, శుక్రుడు సుఖాన్ని, శని ఐశ్వర్యాన్ని, రాహువు బాహుబలాన్ని, కేతువు వంశాభివృద్ధిని కలుగజేస్తారని శాస్త్ర ప్రమాణ వచనం.

పంచాంగ శ్రవణం ఉగాది రోజునే చేయాలి. అలా చేస్తే శుభప్రదం. శత్రుహరం, గంగాస్నాన పుణ్యప్రదం. ఆయుర్దాయకం. అనేక కర్మల సుసాధనం అని జ్యోతిష శాస్త్రవేత్తలు ఘోషిస్తున్నారు.

విధి నిర్వహణ మానకుండా ఉగాది పురుషుని స్పర్శతో పుడమితల్లి తనువెల్లా చిగిర్చి నిలువెల్లా పులకరిస్తుంది. ఎటువంటి ఉపప్లవాలు లేక 'క్రోధి' నామ సంవత్సరాది వెలుగుదనం, తేజసుసతో వెల్లివిరిసి ఈత బాధల్ని నశింపజేసి జగతికి శాంతి సౌఖ్యాలు కలుగజేస్తాయని ఆశిద్దాం.

❖ ❖ ❖ ❖ ❖

## విముక్తి

**నక్క హరికృష్ణ, ఫోన్ : 994 88 77 662**







ఆది నుంచి మొదలుకొని
వారం రోజుల బ్రతుకు

ఒక్క పౌర్ణమి కోసం
ఎన్ని శుక్లపక్షాలు
ఎన్ని కృష్ణ పక్షాలు

అనేక మలుపుదారులలో
గతి సాగుతూ ఉంది
కాలం కాంతి రూపంలో ఒడుస్తుంది
నేను తల వంచుతున్నాను

మాటల్ని మూటకట్టుకుని నడుస్తున్నాను
మనో ఫలకంపై
మాటల్ని కత్తులకు కట్టుకొని
మాటలకు తేనె దట్టుకొని
మాట మీద పూలు పట్టుకొని
భూమికి సమానంగా
వేగానికి సమాంతరంగా
కాలం కల్పిత భ్రమనంలో
నాలాగే దారిలో ఎందరో...

వెన్నెలను వాంచిస్తూ
అమావాస్యను అనుభవిస్తూ
కొన్ని భుజాలు జంటగా
కొన్ని భుజాలు ఒంటరిగా
ఇంకొన్ని అవిటిగా
మూడు విభాజితాల మధ్య
అనేక సాగరాలను ఈదుతున్నాయి.

తీరం ఎక్కడుందో తెలియదు
జాబితా పట్టుకొని
లెక్కలు కడుతూ కొన్ని నావలు
తిరుగుతున్నాయి
పట్టు విడుపుల పయనంలో
నిశ్చల చూపులు కొన్ని
నిట్టూర్పు ముఖములు కొన్ని
ఎరుకలోనైనా, ఎరుకలేకనైనా
అందరికీ కావలసింది మాత్రం
దుఃఖ విముక్తి

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (20) హైదరాబాద్ మార్చి : 2025

## ఆదిత్య హృదయ మహిమ

**"ఆదిత్యః సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్**
**సువర్ణ సదృశో భాను ర్హిరణ్యరేతా దివాకరః"**

ఇందులో ఆదిత్యుడు, సవిత, సూర్యుడు, ఖగుడు, పూష, గభస్తిమంతుడు, సువర్ణసదృశుడు, భానువు, హిరణ్య రేతసుడు, దివాకరుడు అని పది నామాలు ఉన్నాయి.

(గత సంచిక తరువాయి)

**5. పూషా :** సూర్యునికి పూషుడు అని ఒక నామం. సర్వప్రాణి కోటినీ పోషించువాడు అని అర్థం. ఇంతకుముందు చెప్పుకున్నాం. ఆదిత్యుని వలన వర్షము, వర్షము వలన అన్నము, అన్నము వలన ప్రాణము కలుగుతున్నాయి అని. కాబట్టి ఆదిత్యుడు అన్నప్రదాత అయి పోషణకార్యం నిర్వహిస్తున్నాడు.

**6. గభస్తిమాన్ :** గభస్తిమంతుడు – లెక్కకు అందని సంఖ్యల కిరణాలు కలవాడు. సృష్టిలో తెలియదగిన వస్తువుల, విషయముల సముదాయమంతా 'గోవు'. దానిని ప్రకాశింపజేయువాడు. గభస్తిమంతుడు. ప్రపంచాన్నీ, ఆత్మ ప్రపంచాన్నీ మానవులు తెలిసి కోవటానికి వీలయిన కిరణాలు అసంఖ్యాకంగా ఉన్నవాడని, ఈ పదానికి అర్థం. అందుకే సూర్యుణ్ణి 'జ్ఞానభాస్కరుడు' అంటాం.

**7. సువర్ణసదృశః :** సువర్ణమంటే బంగారం. మంచి, గొప్ప వన్నె కలది సువర్ణం. సువర్ణం వలె ఆకర్షణీయమైన వన్నెతో ప్రకాశించేవాడు. సువర్ణం ఒక అద్భుతమైన లోహం. దాని వస్తుగుణం కూడా తక్కిన లోహాలన్నింటికంటె విశిష్టమైనది. అటువంటి వన్నెతో ప్రకాశించేవాడు భాస్కరుడు. అంతేకాదు, ఆరాధించేవారికి అటువంటి విశిష్టతను ప్రసాదిస్తాడు. అది దేహారోగ్య రూపంలో, భావనాబల రూపంలో భక్తులు గొప్ప ప్రయోజనాన్ని కలిగిస్తుంది.


**8. భానుః :** భానుడు తనంత తాను ప్రకాశించువాడు. తక్కిన గ్రహాదులను కూడా ప్రకాశింపజేసేవాడు. విశ్వమంతటినీ కాంతిమంతం చేసేవాడని అర్థం. కాంతిమంతం చేయటమంటే చైతన్యం కలిగేదిగా చేయటమే.

**9. హిరణ్యరేతాః :** హిరణ్యరేతసుడు... హిరణ్యము రేతస్సుగా కలవాడు. రేతస్సు అనేది జీవోత్పాదకరసము.. దానిని శుక్లం అని కూడా అంటారు. అగ్ని రూపంతో వెలుగొందే ఆదిత్యునకు హిరణ్యమే – బంగారమే రేతస్సు. అంటే బంగారం అనే చాలా విలువ గల ద్రవ్యం అగ్నిలో నిక్షిప్తమైన ఆదిత్య తేజస్సుచేత ఏర్పడుతుందని భావం. తక్కిన అన్ని లోహాల కంటే అత్యధికంగా ప్రకాశించేది హిరణ్యం. అందువల్లనే దానికి విలువ చాలా ఎక్కువ. ఎటువంటి ఉత్తమ ద్రవ్యం భూమిలో ఖనిజంగా రూపొందడానికి సౌరశక్తి కారణమని తాత్పర్యం. (సశేషం)


(ఆచార్య శలాక రఘునాథ శర్మగారి 'ఆదిత్య హృదయం' నుండి

## సత్సంగం

### అలజడి లేని జీవితం



అలజడి అంటే ఒత్తిడి. నెరవేరని కోర్కె వల్లగానీ, కోర్కెల వల్లగానీ కలుగుతుంది. మనస్సు ఉండడం వల్లనే మానవుడయ్యాడు. ఈ మనసన్నది ఎప్పుడూ ఏదో ఒక దాని వెంట పరిగెత్తుతూనే ఉంటుంది. దేనినైనా సాధించాలన్నప్పుడు మనమెంతో శ్రమ పడతాం. లక్ష్యాన్ని సిద్ధించుకోవటంలో ఎన్నో ఆటంకాలను ఎదుర్కొంటాం. కోర్కె సిద్ధించదేమోనని భయపడతాం. ఆందోళన చెందుతాం. కోర్కెలు ఎక్కువైన కొద్దీ అలజడి కూడా ఎక్కువ అవుతుంది. కాబట్టి అలజడికి మూలకారణం కోర్కె మనస్సున్నంత వరకూ కోర్కెలని గాని, అలజడిని గాని వారించలేం. ఏ రకమైన అలజడీ లేనివారు, అయితే పిచ్చివారు లేకపోతే ఋషులూ అయి ఉంటారు. వాళ్ళకి సామాన్యులకుండే మనస్సు ఉండదు కాబట్టి, సామాన్యులకి ఎంతో బలీయమైన అహంకారముంటుంది. వాళ్ళెప్పుడూ తమ సంపద గురించో మాట్లాడుతూనే ఉంటారు. ఇతరులతో తమ స్థితిని పోల్చుకొని ఈర్ష్య చెందుతారు. ఈర్ష్య అలజడిని కలిగిస్తుంది.



ఈ అలజడిని తగ్గించుకోవడానికి మనుష్యులు ఏమి చేస్తుంటారో గమనిద్దాం. సినిమాకు వెళ్ళి అక్కడ మైమరచి పోతారు. లేదా బార్ కు వెళ్ళి అక్కడ త్రాగుడులో మైమరచి పోతారు. లేదా సంగీతం వింటూ మైమరచిపోతారు. ఈ సందర్భాలన్నింటిలోనూ మనిషి యొక్క అహంకారం తాత్కాలికంగా సమసిపోతుంది. మనిషి సంతుష్టుడవుతాడు. నిజానికి మనం నిద్రపోయేటప్పుడు జరిగేదిదే. అందువల్లనే అందరికీ నిద్ర అంటే అంత యిష్టం. గాఢనిద్రలో శరీరం గుర్తుండదు. సంపద గుర్తుండదు. కలలేని గాఢనిద్రలో మనస్సేలేదు. కాని మేల్కొనగానే, "మంచినిద్ర పట్టింది, ఇప్పుడు హాయిగా ఉంది", అంటాడు మనిషి. అంటే అహంకారం ఏ మాత్రమూ లేనప్పుడూ అంతటి ఆనందముంటుందన్న మాట.

ఎవరినైనా ప్రేమించినప్పుడు కూడా ఏ అరమరికలూ లేకుండా ఇంకొకరికి అర్పితమవుతాం. అట్లా అర్పితమవటంలో ఎంతో ఆనందముంది.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (21) హైదరాబాద్ మార్చి : 2025

# భారతీయ మహిళా వైభవం

డా. భిన్నూరి మనోహరి, ఫోన్ : 934 797 1177

**యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా: ।**
**యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రా ఫలాక్రియ: ॥**

ఎక్కడ స్త్రీలు పూజింపబడుతారో అక్కడ దేవతలు తిరుగుతుంటారు. ఎక్కడైతే స్త్రీలు పూజింపబడరో అక్కడ ఎటువంటి కార్యాలు ఫలించవని మనుస్మృతి తెల్పుతుంది.

ఏ దేశమైనా సరే మహిళలకు రక్షణ, సంరక్షణ, సమానత్వం, సమాదరణం, సమ్మానం కల్పిస్తుందో ఆ దేశం సుభిక్షంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా ఉన్నతస్థానంలో ఉంటుంది. అట్లా ప్రపంచ దేశాలన్నింటిలో స్త్రీకి అన్నిరంగాల్లో ఉన్నత స్థానాన్ని కల్పించిన ఏకైక దేశం మన భారతదేశం.

భారతదేశం వంటి దేశం, భారతీయ స్త్రీవంటి మహిళ న భూతో న భవిష్యతి. అట్లా ఉన్నతంగా చూడబడే స్త్రీ తన తల్లితండ్రులకు జన్మించాలి అంటే ఆడపిల్లలు కావాలని కోరుకునే వారికి బృహదారణ్యకోపనిషత్తులో భార్యాభర్తలు పాటించవలసిన ఆహార నియమాలను పేర్కొన్నది.

**“అథ య ఇచ్ఛేద్దుహితా మే పండితా జాయేత సర్వమాయు రియదితి,**

**తిలౌదనం పాచయిత్వా సర్పిష్మంతమశ్నీయితావ్ ఈశ్వరౌ జనయితవై” (బృహదారణ్యకోపనిషత్తు. 6.4.17)**

ఒక పండితురాలై, పూర్తి జీవితకాలం జీవించే కూతురు పుట్టాలని కోరుకునే వారు నువ్వులు కలిపిన వండిన అన్నం తినాలి. భార్యాభర్త లిరువురు శుద్ధం చేయబడిన వెన్నతో కలిపి ఆ అన్నం తిన్నట్టయితే వారు కోరుకున్న లక్షణాలతో కూడిన కూతురు కలుగుతుందని బృహదారణ్యకోపనిషత్తులో తెలుపబడింది.

నేటి కాలంలో ఆడపిల్లలైనా, మగపిల్లలైనా ఒకేవిధమైన పెంపకం జరుగుతుంది. ఒక 30, 40 ఏండ్ల క్రితం వరకు ఆడపిల్లలు పుడితే చాలా కుంగిపోయేవారు తల్లితండ్రులు. వేద, ఉపనిషత్తుల కాలంలో ఈవిధంగా లేదు. దేశ కాల పరిస్థితుల ప్రభావం కారణంగా ఆడపిల్లలకు స్వేచ్ఛ, సమానతలు తగ్గిపోయాయి. ఇది కొంత బాధించే అంశమైనప్పటికీ నేటి పరిస్థితి ఆవిధంగా లేదు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను కనబరుస్తూ, వృత్తి ఉద్యోగాలు, కుటుంబ వ్యవహారాలల్లో సమర్థవంతంగా పనిచేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఋగ్వేద సాహిత్యంలో అదితి, దితి, పృథ్వి, ద్యావా పృథివి, సీత, రాత్రి, సూర్య, ఇంద్రాణి, పురంధి, అసుమతి, సినీవాలి, శ్రద్ధ వంటి చాలామంది స్త్రీ దేవతల పేర్లు కనిపిస్తున్నాయి. ఋగ్వేదంలో స్త్రీలకు సంబంధించిన అనేక మంత్రాలు సమాజంలో, కుటుంబంలో స్త్రీ ప్రాతినిధ్యం స్పష్టంగా తెలియజేస్తున్నాయి. స్త్రీలు ధైర్యంగా ఉండాలి, నిపుణులుగా ఉండాలి, పండితులుగా ఉండాలి, సంపన్నులుగా ఉండాలి, రథాలపై పయనించాలి, జ్ఞానవంతులుగా, తెలివైనవారిగా ఉండాలి, కీర్తిని సంపాదించుకోవాలి, స్త్రీలు కుటుంబం మరియు సమాజాన్ని రక్షించేవారిగా ఉండాలి, ఆహారం, సంపద, శ్రేయస్సును అందించేవారిగా ఉండాలని ఋగ్వేద మంత్రాలు వివరిస్తున్నాయి.



అదేవిధంగా యజుర్వేదంలో మహిళా సైన్యం ఏర్పడాలని, మహిళలు యుద్ధంలో పాల్గొనేవిధంగా ప్రోత్సహించాలనే భావన కలిగిన మంత్రాలు కూడా కనబడుతున్నాయి. ఒక రాజు ఉంటే అతడి భార్య ఇతరులకు రాజనీతిని బోధించగలగాలి. రాజు తన కర్తవ్యం ఏవిధంగా నిర్వర్తిస్తాడో రాణి కూడా అతడి అడుగు జాడలలో పయనించాలి.

ఋగ్వేద కాలంలో ఆడపిల్లలకు పెండ్లిచేసి అత్తవారింటికి పంపే సమయంలో తల్లిదండ్రులు తన కుమార్తెకు మేధస్సును, జ్ఞానశక్తిని, జ్ఞానాన్ని కట్నంగా ఇవ్వాలనే మంత్రం మనకు ఋగ్వేదంలోని 10వ మండలంలో కనిపిస్తుంది.

ఈవిధంగా చెప్పుకుంటూ పోతే మన వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు అన్నీ కూడా స్త్రీల యొక్క ఔన్నత్యాన్ని, వారి అద్భుతమైన శక్తిని కొనియాడుతూ, వారి సామర్థ్యాన్ని సమాజానికి, కుటుంబానికి వినియోగించి ఉత్తమ సమాజ నిర్మాణానికి కారణం కావాలని బోధిస్తున్నాయి.

భారతీయ సనాతనధర్మం స్త్రీ యొక్క ఔన్నత్యాన్ని తెల్పిన విధంగా తర్వాతి కాలంలో ఆ పరంపరను కొనసాగించలేకపోయింది. అందుకు బాహ్యంగా, అంతర్గతంగా అనేక కారణాలు ఉన్నాయి. లింగపరమైన భేదాలు,

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (22) హైదరాబాద్ మార్చి : 2025

మత, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక విభేదాల వల్ల స్త్రీ తన సహజ ధైర్య లక్షణాన్ని, ప్రజ్ఞను అణచుకోవలసి వచ్చింది. ఇది ఆ కాలంలో జరిగిన పరిణామం క్రమంగా కొనసాగుతూ కొన్ని వందల సంవత్సరాలు గడిచినాయి.

భారతీయ ధర్మంలో, కుటుంబ వ్యవస్థలో, సమాజంలో అన్ని కార్యకలాపాలకు స్త్రీ నిర్వహణా దక్షత ఎంతో అవసరం. తన అనుభవంతో పండుగల నిర్వహణ కాని, కుటుంబ నిర్వహణ కాని, శుభకార్యాల్లో వారి ప్రాతినిధ్యం కాని ఇంకొకరికి సాధ్యం కాదు. ఇంట్లో అత్తమామలు, ఆడబిడ్డలు, కుటుంబ సభ్యులు, పిల్లలు, వారిని ఉత్తములుగా తీర్చిదిద్దే క్రమంలో స్త్రీ పాత్ర అగ్రగణ్యమైంది. ఆధునిక కాలంలో అటు ఇంటి బాధ్యతలు, ఇటు వృత్తి బాధ్యతలు నిర్వహిస్తూ రెండు పడవలపై పయనిస్తూ గమ్యం చేరే ప్రయత్నం చేస్తున్నారు స్త్రీలు. వృత్తి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్ళను అధిగమిస్తూ అత్యుత్తమ ఫలితాలను పొందుతున్నారు.

విద్యారంగంలో అన్ని శాఖల్లో అటు కళలు, ఇటు సైన్సు, ఇంజనీరింగ్, వైద్యవృత్తిలో విశేష ప్రతిభను కనబరుస్తున్నారు. సమాజంలో అన్నిరంగాల్లో, అన్ని ప్రాంతాల్లో, భూమి, ఆకాశం, నీరు, సైనిక రంగం ఒకటంటూ కాదు సర్వకాల సర్వావస్థల్లో ధైర్యంగా ముందుకు సాగిపోతున్నారు.

భారతీయ స్త్రీలు పురాతన కాలం నుండి రాజకీయ పరంగా రాణుల హోదాల్లో, మంత్రులు, సేనాధిపత్యం వహించిన వారుగా కూడా చరిత్రలో మనకు కనిపిస్తున్నారు. ముస్లిం రాజుల కాలంలో ఇల్‌టుట్‌మిష్ కూతురు రజియా సుల్తానా, రాజపుత్ర స్త్రీలు ఝాన్సీ లక్ష్మీబాయి, ఆ కాలపు చాలామంది స్త్రీలు, మన తెలుగు ప్రాంతంలో శాతవాహనుల కాలం నాటి దేవీ నాగానిక, విష్ణుకుండినుల మహాదేవి, వాకాటక మహాదేవి, రాణీ రుద్రమదేవి, ఎఱుకసాని, కామసాని, పల్నాటి నాయకురాలు నాగమ్మ, మైలాంబిక, ఇంకా పలువురు ఆడవారు రాజకీయరంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా తమ సేవలను అందించారు. యుద్ధరంగంలో ఎంతటి ధైర్యాన్ని ప్రదర్శించారో పరిపాలనా పరంగా ప్రజలకు అవసరమైన కార్యకాలాపాలు నిర్వహించడంలో అంతే శ్రద్ధను, నైపుణ్యాన్ని చూపినారు. ప్రజోపయోగ నిర్మాణాలతో పాటు ఆధ్యాత్మికంగా అనేక ఆలయాల నిర్మాణం, అన్న సత్రాలు, సాధుజనుల సంరక్షణ, ఆయా వర్గాలవారికి అవసరమైన దానాలు ఇతోధికంగా చేసారు. తమ స్త్రీ ధనం నుండి విరివిగా
<‘H\ T“ sÁç²¾# sÁm³ Te+{ ìdŸ<ŠÔÛ®, s E j ïT¿ØeTÔá @<Õ, ÔáTÅ£ÔÃ q eTÔ“ • nqTdŸ+º € eTÔ“ • €<Š+º , ÔâáÌ+‹ +<Š>TsÁeÚÅ£$XâŸkå¿£ «\ T¿£Î+# sÁ, ³ Te+{ ì ¿±sÁá£²bÍ\ T#û³&ƒýËy sÁme] |™Õ €<“sÁ|Á&ƒ¯ñŠkÍeÖq« dÓTÅ£&†ÔáTÅ£ÔÃ q dŸÔ Ø « T“ sÁç²¾# sÁ

s E\ ¿±+ b|sTT¢Ÿ² ¢Ÿ“ <Š ¿±+ H{ ¿ì <Ž nH«ç±Ôá¯®| ŸƒÈ] Ðq b|s ³ +ýËe+<Š²~ dÓTkÍÇÔáçÔá

సముపార్జనకు తమ ధన, ప్రాణాలను అర్పించారు. దేశ స్వాతంత్ర్యంతో పాటు సంస్కృతి సంప్రదాయాల సంరక్షణకు పోరాడవలసి వచ్చింది. ఆ క్రమంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఎక్కడా ధైర్యం వీడకుండా తమ అస్థిత్వాన్ని నిల్పుకున్నారు. స్వాతంత్ర్యానంతరం చాలామంది స్త్రీలు రాజకీయంగా ఉన్నత పదవులను చేపట్టి సమర్థంగా నిర్వహించారు.

కాలక్రమంలో ఆడవారి పట్ల కొంత అలసత్వ భావం ఏర్పడింది. పరిస్థితుల ప్రభావం వల్ల వారి విద్య కొంత కుంటుపడింది. అది రెండు, మూడు శతాబ్దాలు కొనసాగింది. ఆలోచనా విధానంలో మార్పు వల్ల తిరిగి ప్రజల్లో చైతన్యం ఏర్పడింది. ఆడపిల్లలు తిరిగి వేగం అందుకున్నారు. తమ సహజ ధైర్యాన్ని పునర్జీవింపచేసుకొన్నారు.

అయితే కొంత ఆధునిక పోకడల వల్ల పాశ్చాత్య సంస్కృతీ ప్రభావం వల్ల తమదైన భారతీయ జీవన విధానంలో ఉన్న ఉన్నత వ్యక్తిత్వాన్ని కోల్పోతున్నారు. పలు రకాలైన వేషధారణలు, విచిత్ర అలవాట్లు చేసుకొని పూర్వపు ఔన్నత్యాన్ని తగ్గించుకుంటున్నారు. మనదైన సంస్కృతిని వీడి పొరుగింటి పుంటికూర రుచిలాగా పాశ్చాత్య పోకడలను సొంతం చేసుకుంటున్నారు. దానివల్ల సమాజంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వాటిని అధిగమించడానికి ఉ ద్యమాలు చేస్తున్నారు. ఇవన్నీ ఒక మూసలో కొట్టుకుపోతున్న సమాజంలో సాధారణమైనాయి.

ఆధునిక కాలంలో ఉన్న ఆడపిల్లలు తమ సంస్కృతీ మూలాలను మరచిపోకుండా వాటిని తిరిగి అధ్యయనం చేసి, ఆ ఔన్నత్యాన్ని గుర్తించి వేదకాలంలో స్త్రీలు పొందిన గౌరవాన్ని తిరిగి పొందాలి. ఆధునిక భావజాలంతో సంస్కృతి వారధులుగా నిలవాలి. ఎంత ఎదిగినా మన మూలాలను మరచిపోకుండా భారతీయ స్త్రీ అంటే రెండు చేతులెత్తి నమస్కరించే విధంగా ఇతర దేశవాసులకు ఆదర్శంగా నిలబడాలి. ధైర్యంగా ముందుకు సాగాలి. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా కాదు వారిని అధిగమించి, వారిని స్త్రీలతో సమానంగా ముందుకు నడిపించాలి. భారతీయ స్త్రీ సర్వోత్కృష్టగా, అగ్రగామిగా నిలబడాలి. భారత భాగ్య విధాతగా పేరు పొందాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు మనమందరం మన సంస్కృతీ సంప్రదాయాలను విస్మరించకుండా స్త్రీజాతి కంతటికీ ఆదర్శంగా నిలబడాలి.

అనిబిసెంట్ అన్నట్లుగా భారతదేశంలో కనిపించే మాతృత్వపు ఛాయలు (మదర్‌హుడ్) మరే దేశంలో కనిపించవు. అది కేవలం సంతానాన్ని కనడం కాదు. అందరి పట్ల మాతభావనతో ఉంటే అదే మాతృత్వపు ఛాయ. భారతదేశం మాతృభూమి. అంటే కన్న తల్లి. కాబట్టి భారతీయ స్త్రీ మాతృమూర్తిగా ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలబడాలి.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (23) హైదరాబాద్ మార్చి : 2025

# మాతృభాష మనుగడ

**రాఘవ మాస్టారు కేదారి,** జాతీయ తెలుగు పరిరక్షణ సమితి అధ్యక్షులు. ఫోన్ : 6362973252

అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ సందర్భంగా అందరికీ ఒక మనవి. మనలో ఎంతమందికి మాతృభాష పై అభిమానం ఉన్నది. అసలు నేడు ఎంతమంది మాతృభాష గురించి ఆలోచిస్తున్నారు అనే అంశాన్ని చర్చించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. మనలో చాలామందికి తెలియని విషయం ఏమంటే ఏదైనా ఒక మాతృభాష మరుగునపడి నశించినట్లయితే, ఆ భాషను మాట్లాడే జాతి, వారి సంస్కృతి, వారి సాంప్రదాయాలు కూడా మరుగున పడిపోతాయి అనే విషయం చాలామందికి తెలియదు. అందుకే ఐక్యరాజ్యసమితి వారు ఎవరి మాతృభాషను వారే, కాపాడుకోవాలనే ఉద్దేశంతో, ఈ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం అని ప్రకటించారు ఈ ఒక్క రోజైనా మాతృభాష గురించి మనలో కొందరైనా ఆలోచిస్తారని, ఆవేశిస్తారని ఇలాంటి రోజులు జరుపుకోవాలని భాషావేత్తల అభిప్రాయం.

ఈ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరుపుకోవడానికి ముఖ్య కారణం తెలుసుకోవలసి ఉన్నది. అన్ని భాషలను పరిరక్షించుకోవాలని, బహుభాషా వైవిధ్యాన్ని కాపాడుకోవాలని, మరియు సాంస్కృతిక వైవిధ్యాన్ని, దానిపై అవగాహన పెంచుకోవాలని, బహుభాషా వాదాన్ని ప్రోత్సహించడానికి 1999 నవంబర్ 17న యునెస్కోలో ప్రకటించినారు. దీనికి ముఖ్యకారణం 1952లో అప్పటి బంగ్లాదేశ్ లో, తమ మాతృభాష బెంగాలీ బదులుగా ఉర్దూను తమపై బలవంతంగా రుద్దారని, విద్యార్థులు, బెంగాలీ భాష అభిమానులు పెద్ద ఎత్తున ఉద్యమాన్ని లేవనెత్తారు. ఆ ఉద్యమంలో ఐదుగురు విద్యార్థులు వీరమరణం పొందినారు. వారికి నివాళిగా ఈ మాతృ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని 2000 సంవత్సరము నుండి జరుపుకుంటున్నామని అందరికీ తెలిసినదే.

ఎవరి అమ్మవారికి గొప్ప అన్నట్లుగా, ఎవరి మాతృభాష వారికి గొప్పే కదా! కనుక ఎవరు అమ్మనుడిని వారు తప్పక రక్షించుకోవాలి. ఇంగ్లీష్ వారి వలసవాదం వలన, వారు కాలిడిన, ఏలిన సీమలలో అనేక భాషలు, అనేక సంస్కృతులు, ఇంగ్లీషు ప్రభావం వలన, వారి మత ప్రభావం వలన కనుమరుగైనవి. ఒక భాష నశిస్తే, ఆ భాషకు చెందిన జాతి, జాతి భావన, సంస్కృతి సంప్రదాయాలు కూడా నశిస్తాయి. ఇది చరిత్ర చెప్పిన, నిరూపించిన సత్యం. అంటే మన అమ్మనుడిని మనమే కాపాడుకోవాలి. ఎవరి భాషను వారే రక్షించుకోవాలి. రాబోయే తరాల కోసం భాషను పదిలపరుచుకోవాలి. పరిరక్షించుకోవాలి.




అందుకే ఇతర భాషల ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకొని, అమ్మనుడిని పరీక్షించుకోవాలనే తలంపుతోనే, ఆ భాష జాతి నైతిక బాధ్యతగా, ప్రతి మనిషి కర్తవ్యంగా, అమ్మనుడిని రక్షించుకోవాలంటూ గుర్తు చేయడానికే , ఈ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఏర్పాటు చేయడమైనది.


ప్రపంచంలో దాదాపు 6000 పైచిలుకు భాషలు ఉన్నాయి. వాటిలో సొంత లిపి ఉన్న భాషలు దాదాపు 400 లోపే. కొన్ని భాషలకు ఇప్పటికీ సొంత లిపిలు లేవు. కనుక అమ్మనుడిని (మాతృభాష) అందరూ కాపాడుకోవాలని, రేపటి జాతికి భాషను పునరంకితం చేయాలనే, ఉద్దేశంతో ఈ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకోవాలని ఆవశ్యకత ఎంతైనా ఉంది.

అయితే మనదేశంలో ఎక్కువగా తెలుగు ప్రాంతాలలో డాలర్ల మోజుతో, ఇంగ్లీషు డాబుసరితో మాతృభాషను విస్మరించి, ఆంగ్లమాధ్యమం వైపు తల్లిదండ్రులు పరిగెడుతున్నారు, పిల్లలను బలవంతంగా పరిగెత్తిస్తున్నారు.

పరభాషలు నేర్వడం తప్పుకాదు. ముందు కనీసం ప్రాథమిక విద్య అయిన అమ్మనుడిలో ఉండాలి. ఎందుకంటే అమ్మనుడిలో విద్యార్థికి పాఠము సులభంగా అర్థమవుతుంది. తన భాషలో చదివితే నేర్చుకునే విషయంపై ఎక్కువ అవగాహనతో వివరణ సులభతరం అవుతుంది.

మాతృభాష గొప్పతనాన్ని గురించి, చదువు మాతృభాషలో ఉంటే ఎంత ఉపయోగకరమో, విద్యార్థికి ఎంత వికాసవంతంగా ఉంటుందో, ప్రముఖులు గాంధీజీ, రవీంద్రనాథ్ ఠాగూర్, నేతాజీ, స్వామి వివేకానంద ఎందరో మహానుభావులు వివరించారు. మన దురదృష్టం అవన్నీ చెవిటి వాడి ముందు ఊదిన శంఖములా అయిపోయాయి. ఇప్పుడు చాలామంది ఇంగ్లీష్ మీడియం పిల్లలను పరిశీలిస్తే, అటు ఇంగ్లీషు రాదు, ఇటు తెలుగు రాదు. ఇప్పటి ప్రభుత్వాలు కూడా

ISSN 2457-0796

తెలుగు భాషను తమ ఓట్ల కోసం, రాజకీయం కోసం వాడుకుంటూ, అమ్మనుడికి వెన్నుపోటు పొడుస్తున్నారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. గత ప్రభుత్వాలు తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా తొలగించి మాతృభాషకు చాలా అన్యాయం చేశారు అనడంలో ఎలాంటి సందేహము లేదు.

ఇది ఇలాగే సాగితే ఐక్యరాజ్యసమితి వారు ఈ మధ్య ప్రకటించిన ఒక నివేదిక ప్రకారం రాబోయే 30 సంవత్సరాలలో మరుగయ్యే భాషలలో తెలుగు ఒకటనే మాట నిజం కాబోతుందేమోనని అనుమానంగా ఉంది. అవును నిజమే, ఇప్పటి పిల్లలలో 90% ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుతున్నారు ,వారికి తెలుగు రాయడం, చదవడం రాదు. ఇక తెలుగు అక్షరాలతో పనేముంది. ఇలాగే సాగితే ముందు తరాలు వారు తెలుగు అక్షరాలను మ్యూజియంలో చూడవలసి వస్తుంది.



అందుకే ఆంగ్ల ఉద్యోగి మెకాలే గొప్పదైన హిందూ సంస్కృతిని, జాతిని చూసి, వీరిని జయించడం చాలా కష్టమని భావించి, ఈ జాతిని నాశనం చేయాలంటే, మొదటగా వారి మాతృభాషను నాశనం చేస్తే చాలు అని చెప్పాడు. అందుకే ఇంగ్లీషును, వారి మతాన్ని జనంపై రుద్దారు. ఫలితం చూస్తూనే ఉన్నాము.

కనుక మనం మొదటగా అమ్మనుడిని కాపాడుకోవాలి, మాతృభాషను ప్రేమించాలి, పర భాషలను ఆదరించాలి, అవసరానికి పరభాషను నేర్చుకోవడంలో తప్పేమీ లేదు. మనం ఇతర భాషలకు వ్యతిరేకం కాదు. అలాగే ఏదైనా ఒక కొత్త మాట ఇతర భాషలు నుండి వస్తే దానికి మొదటగా మన అమ్మ నుడి నుండే కొత్త మాటను పుట్టించాలి. ఆ పనిని హిబ్రూ, చైనా, జపాన్, కొరియా, తమిళులు, కన్నడిగులు చేస్తున్నారు. అయితే మన తెలుగువారు ఇంగ్లీష్ మాటను సంస్కృతీకరణ చేస్తున్నారు. చక్కగా ఆలోచిస్తే అచ్చ తెలుగులో మాటలను పుట్టించవచ్చు.

ఈమధ్య తెలుగు భాషా పరిరక్షణకు, అనేక వేదికలు, సంస్థలు ముందుకు వచ్చి ఎంతో కొంత కృషి చేస్తున్నారు అయితే నిజానికి ఎవరూ ప్రజలతో మమేకమై, ప్రజా ఉద్యమాలకు బాసటగా నిలబడి ఉద్యమించడం లేదనీ, కేవలం తీర్మానాలు, ప్రసంగాలు, ప్రణాళికలు కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయని తెలుగు భాషావేత్తల అభిప్రాయం. ఏది ఏమైనా ఈ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా, మనందరం ఒకసారి మాతృభాష గురించి మీకు మాట్లాడుకోవడానికి అవకాశం వస్తుందని పరస్పర భావాలను ఒకరినొకరు పంచుకోవడానికి సహకరిస్తుందని అనడంలోఎలాంటి అనుమానం లేదు.

అయితే ఇప్పటికీ, కొన్ని దేశాలలో మొదలిడు చదువు (ఎల్కేజీ) నుండి పెనుపాటి చదువు (పీజీ) వరకు సాంకేతిక, వైద్య చదువులు అన్నీ కూడా వారి మాతృభాషలోనే జరుపుతున్నారు.

కనుక మనమంతా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ సందర్భంగా అమ్మనుడిని కాపాడుకోవాలి. అలాకాకుండా పరభాష వ్యామోహంలో పడితే, పరభాషను నేర్చి, దాని వెంట ప్రాకులాడితే, అనుకోకుండా ఆ భాషతో పాటు, ఆ భాష వారి సంస్కృతీ సంప్రదాయాలు మెల్లగా మనలోనికి ప్రవేశిస్తాయి. ఒకసారి చూస్తే మనకే అర్థమవుతుంది. ఇంగ్లీషు ప్రభావం వలన, వారి మతము, వారి తిండి, వారి కట్టుబొట్లు, వారి సంస్కృతీ సంప్రదాయాలు అన్ని వచ్చి మన సంస్కృతినీ పక్కకు నెట్టి, అవి ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి. నిజమా ! కాదా !?

కాబట్టి మన జాతి మన సంస్కృతి నిలవాలంటే, మన మాతృభాషలను నిలబెట్టుకోవాలి, మాతృభాష నిలబడాలి, కలబడాలి, కనబడాలి, వినబడాలి అప్పుడే ఆ భాష వలన జాతి, జాతి వలన దేశము ఒక విశిష్టమైన గౌరవాన్ని పొందుతాయానడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. కనుక ఈ అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ సందర్భంగా మనందరము విన్నపము ఏమనగా, ఇప్పటి ప్రభుత్వం వారు అయినా తప్పక పరిపాలన భాషగా, ప్రజల పలుకుబడి భాషగా తెలుగును కనబడేటట్లు, వినబడేటట్లు చేయగలరని ఆశిద్దాం.

జై తెలుగుతల్లి జై జై తెలుగు భాష

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (25) హైదరాబాద్ మార్చి : 2025

# వసు చరిత్ర – సంగీత శాస్త్ర విశ్లేషణ

**కె. పాతన్న**, పరిశోధకులు, తెలుగు భాష, అనువాద అధ్యయన శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం. ఫోన్ : 9494408896

**వ్యాససంగ్రహం**

సంగీత సాహిత్యముల మేళవింపుతో రామరాజభూషణుడు వసుచరిత్రను రచించాడు. తెలుగు పంచ మహాకావ్యాలలో కూడా సర్వోత్కృష్టమైన ఈ కావ్యానికి చోటు దక్కింది. శారదాదేవి స్తన ద్వయంగా వర్ణించిన సంగీత, సాహిత్యములను సమానంగా కడుపార త్రాగిన ఘనుడు ప్రబంధయుగంలో రామరాజభూషణుడి వలె మరొకరు కనపడరు. ఇతడికి సంగీత కళా రహస్యనిధిగా పేరు గాంచాడు. కాబట్టి వసుచరిత్రలోని సంగీతశాస్త్రం యొక్క తీరు తెన్నులను విశ్లేషించడమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశం.


వసుచరిత్రలో పేర్కొన్న హిందోళ, కలహంస, శ్రీ, సారంగ, కాంభోజీ, సింధుకన్యక (సైంధవి) రాగములను ఈ వ్యాసంలో చర్చించాను. మృదంగ వాద్య ధ్వనిలో ఉన్న పద్యంను, ధవళ గీతములు పాడిన సందర్భాన్ని తెలుపుతూ, వీణా సంబంధిత శబ్దాలను విశ్లేషించాను. భట్టుమూర్తి తెలిపిన బృంద గానములు, వాద్య బృందములను కూడా ప్రసంగించి ఈ వ్యాసంలో రామరాజభూషణుడి సంగీతశాస్త్ర పాండిత్యాన్ని పరమావధిగా తీసుకున్నాను. ఈ విధంగా కొన్ని భాగాలలో భట్టుమూర్తి యొక్క సంగీత ప్రజ్ఞను తెలిపాను. సాహిత్య విమర్శకునికి, పరిశోధకులకు మూడు రకాల జ్ఞానం ఉండాలంటారు. వాటిలో మొదటిది దృక్పథ జ్ఞానం, రెండవది శాస్త్ర జ్ఞానం, మూడవది కళాసాహిత్య జ్ఞానం. అయితే శాస్త్ర జ్ఞానంలో మరల రెండు రకాలుగా ఉంటే వాటిలో ఒకటి కళా సాహిత్య శాస్త్రాలు. కాబట్టి ఈ విధంగా సాంస్కృతిక అధ్యయన పద్ధతిని పరిశోధనా పద్ధతిగా తీసుకొని ఈ వ్యాసంలో విశ్లేషించాను. ఇప్పటి అత్యాధునిక కాలంలో కళలు, శాస్త్రాలు కొన్ని మరుగున పడుతున్నాయనే స్పృహతో రామరాజ భూషణుడి సంగీతపాండితిని ఈ వ్యాసంలో విశ్లేషించడానికి ప్రయత్నించాను.

**ముఖ్యమైన పదాలు :** హిందోళ రాగము, కాంభోజి రాగము, ధవళ గీతము, వీణ శబ్దాల రకాలు, బృందగానములు, వాద్య బృందములు.

## 1. ఉపోద్ఘాతం

ప్రబంధాకం అనే ఇంటిపేరు భట్టుమూర్తికి కలదు. ప్రబంధాకం అంటే ప్రబంధాల్ని గానం చేయడం వృత్తిగా కలవారని అర్థం. నన్నయ భారతం ఆదిపర్వంలోని ఉపరిచర వసువృత్తాంతంను ఆధారంగా తీసుకొని, శ్లేషాలంకార చమత్కృతిని కవితాగుణంగా పాటించి వసుచరిత్రమనే మహాప్రబంధాన్ని సృష్టించాడు. అందులో సరిగమల మధురిమలు చిలికించిన కవి రామరాజభూషణుడు. కనుక ఈ ప్రబంధంలోని సంగీత శాస్త్ర జ్ఞానాన్ని, వాటి శ్లేష పద్ధతుల్ని విశ్లేషణ చేయడమే ముఖ్యోద్దేశం. నదికి నారీత్వమును కల్పించి, మాతృత్వము సిద్ధించేటట్లు కథను కావించాడు.

అష్టదిగ్గజ కవుల ప్రబంధాలను కళలు, శాస్త్రాల దృక్కోణంలో పరిశోధించాలనే ఉత్సాహంతో పరిశోధన అంశంగా తీసుకున్నాను. అయితే ఈ వ్యాసంలో కేవలం వసుచరిత్రలోని సంగీతశాస్త్రంకు మాత్రమే పరిమితంగా భావించి విశ్లేషణ




చేయదలిచాను. ఇప్పటికే వసుచరిత్రను పరిశోధనాంశంగా తీసుకుని భిన్నకోణాల్లో శోధించారు. 1980లో నాగార్జున విశ్వవిద్యాలయం నుండి వసుచరిత్రలో సంగీతం అన్న అంశంపైనే ఎం.ఫిల్ పట్టా కూడా పొందారు. వసుచరిత్ర తర్వాత వచ్చిన దాదాపు రెండు శతాబ్దాల ప్రబంధాలపై వున్న ప్రభావాన్ని అంశంగా చేసుకుని ఉస్మానియా విశ్వ విద్యాలయంలో కూడా పరిశోధన జరిగింది. ఈ విధంగా పలుకోణాల్లో వసుచరిత్రను చూశారు. కనుక ఈ వ్యాసంలో నేను సంగీతశాస్త్ర తీరుతెన్నులను విశ్లేషణ చేయదలిచాను.

## 2. వసుచరిత్ర – సంగీతశాస్త్ర విశ్లేషణ

**"నను శ్రీరామ పదారవింద భజనానందున్ జగత్త్రాణ**

**నందన కారుణ్యకటాక్ష లబ్ధకవితాధారా సుధారాశి సం**

**జనితై కై కదిన ప్రబంధఘటనా సద్యశ్శ్రుత గ్రంథక**

**ల్పను సంగీతకళా రహస్యనిధిఁ బిల్వంబంచి పల్కెంగృపన్"**

**(వ.చ. మొ.ఆశ్వా.16ప)**

పై పద్యంలో రామరాజభూషణుడు తాను సంగీతకళా రహస్యములకు నిధియైనవాడని పేర్కొన్నాడు. వసుచరిత్ర పద్యములందున్న సాహిత్యపు విలువలు పండితులందరికి సుపరిచితమే. వసుచరిత్రలో ఒదిగిన సంగీత రాగములు, సంగీతపు విలువలు కూడా పండితులు గుర్తించారు. కవి సాహిత్యరూపమైన కావ్యమునకు వీణాలాపమును జతచేర్చి అమృతత్వమును ఆపాదించాడు. వసుచరిత్రలోని పద్యములు కొన్ని సంవత్సరముల క్రిందటి వరకు వీణపై వాయించే సంప్రదాయ ముండేదని, వసుచరిత్రలోని సీసములు, వృత్తములు సంగీతముతో పాడుకొనే గీతముల వలె సాగిపోయేవని పండితులు తెలిపారు.

**"లలనాజనాపాంగ వలనావసదనంగ తులనాభికాభంగ....",**

**"ఇమ్ములై మరుహజారమ్ములై పొదలుండఁ బూఁజ...." (వ.చ.మొ.ఆశ్వా.126.141ప)**

**"ఒకచాయ ననపాయ పికగేయ సముదాయ మొక.." (వ.చ. రెం.ఆశ్వా.7ప)**

**"తలిరుఁ బ్రాయమువాని వలరాజు నలరాజు నలరాజుఁ..." (వ.చ. మూ.ఆశ్వా.46ప)**

ఇలాంటి సంగీతపరమైన పద్యాలు వసుచరిత్రలో కోకొల్లలుగా ఉన్నాయి. శిష్టు కృష్ణమూర్తి గారు సంగీతప్రజ్ఞ కలవారు. అతను వసుచరిత్ర వ్యాఖ్యలో ఏయే పద్యాలు ఏ రాగంలో పాడవలెనో కూడా తెలిపాడట. అయితే ప్రస్తుతం ఆ వ్యాఖ్య అలభ్యం.

క్రీ.శ.18వ శతాబ్ది నాటినుండి భారతదేశములో సంగీతము రెండు శాఖలుగా అభివృద్ధి చెందింది. పర్షియను సంగీతప్రభావము వలన ఉత్తర భారతదేశమున హిందుస్థానీ సంగీతమనే పేరు స్థిర పడింది. 16వ శతాబ్దినాటికి ఒక ప్రత్యేకతను సంపాదించుకొని దక్షిణ హిందూదేశములో మరొక శాఖగా కర్ణాటక సంగీతముగా (కర్ణాటక సామ్రాజ్యము పేరు మీదుగా) స్థిరపడింది. ఈ కర్ణాటక సంగీతము కృష్ణదేవరాయల, రామరాయల కాలమున మిక్కిలి అభివృద్ధి చెందినది. సంగీతశాస్త్ర గ్రంథములు కూడా రచించబడ్డాయి.. రామయామాత్యుడు "స్వరమేళ కళానిధి" ని రచించాడు. ఇతడు రామరాజును ఆశ్రయించినవాడు. కావున రామరాజ భూషణునికి అతడు సుపరిచితుడై ఉండొచ్చు. కావ్యాలంకార సంగ్రహమున రామరాజభూషణుడు తన "సంగీత కళారహస్యనిధి" బిరుదును పేర్కొనక పోవుటచే అప్పటికి అతడు సంగీత రహస్యములను గ్రహించలేదని తెలుస్తుంది. తాను ఆశ్రయించిన రామరాయలు సంగీతాభిమాని కావడంతో రామరాజభూషణుడు రామయామాత్యుల వంటి సంగీతనిధుల స్నేహము వల్ల సంగీత కళా రహస్యములను తెలుసుకుని ఉంటాడని స్పష్టమవుతున్నది.

వసురాజు విదూషకునితో పాటు కోలాహల పర్వతం వద్దకు చేరాడు. అక్కడ వారు **"మాధురీధుర్య"**మైన గానముచేత ఆకర్షించ బడినట్లు వర్ణించి, ఆ గాన సహాయముతోనే నాయికా నాయక సమాగమమును కవి పొసగించాడు.

**"....జనవర! వల్లకీరవము సంగతిఁ బాడెదరె వ్వరోవినూ**
**తనగతి నిమ్మహాద్రిపయిఁ దన్ముదుపంచమ షడ్జశయ్య కొ**
**య్యన నెలుగిచ్చె వింటె ప్రమదాకుల కోకిల కేకిలోకముల్"**

**(వ.చ. రెం.ఆశ్వా.17ప)**

వల్లకీ రవము సంగతితో గిరిక గానం చేస్తుందన్నట్లు చిత్రించాడు. ఒక వినూత్న గతిలో కూడినదని సంగీతకళా నైపుణ్యం కలవాడు కాబట్టే చెప్పగలిగాడు.

సంగీతప్రియుడు, పండితుడైన హర్షదేవుడు తన నాగానంద నాటకములో నాయిక వీణాగానమును వర్ణించిన విధమే ఇక్కడ కూడా మనకు కనిపిస్తుంది. రామరాజభూషణుడు కూడా సంగీత ప్రియుడు, సంగీత కళారహస్యనిధి కావున అదే మార్గములో నడిచి నాయికా పరిచయాన్ని కావించాడు. నాయికను వెతుకుతూ విదూషకుడు మణిమందిరం దగ్గరికి సమీపించి **"వీణావాదన ప్రౌఢిచే జెలులన్ రంజిలఁజేయు"** (వ.చ. రెం.ఆశ్వా.26ప) గిరికను చూశాడు. రామరాజ భూషణుడు తన వీణావాదన ప్రౌఢిచేత సభ్యులను అనేకసార్లు రంజింపజేసియుండవచ్చు. వీణ వాయించుతున్న గిరికా వర్ణన రామరాజభూషణుడి వీణా పరిచితికి అద్దం పడుతుంది.

**"వలుదగుబ్బలు ప్రసేవకవృత్తిఁదగు గుబ్బ**
**కాయల కపరంజి చాయలొసఁగ**
**లలితాంగులీ దళంబులు సమేళములైన**
**సారెలపై రాగ సంపదలిడఁ**
**బాణికంకణరుతుల్ ప్రాణానుబంధంబు**
**గల తాళగతి కనుగ్రహము లీన**
**నాలాపభంగి యత్యక్త సంవాది స**
**మ స్వరంబులకు గ్రామంబులునుపఁ"**
**"బ్రచురతానామృతముల మూర్ఛనలచే న**
**చేతనంబులు చేతన రీతిఁదనరఁ**
**జేతనంబుల చేతనభాతి నొనర**
**వీణవాయించు నొక యలివేణిఁ గంటి" (వ.చ. రెం.ఆశ్వా.30ప)**

రామరాజ భూషణుడు పైపద్యములో వీణా సంబంధిత శబ్దాలను ప్రయోగించాడు. వీణ, ప్రసేవకము, గుబ్బకాయలు, సమేళములు, సారెలు, రాగము, ప్రాణము, తాళము, అనుగ్రహము, ఆలాపము, ఆత్యక్త, సంవాది, సమస్వరములు, గ్రామములు, తానము, మూర్ఛనలు మొదలైన వాటిని పేర్కొన్నాడు.

రామరాజ భూషణుడు గిరిక బాల్యమును వర్ణిస్తూ, ఆమె తల్లి శుక్తిమతి గిరికకు సంగీతవిద్యను చెప్పించెనని ఇలా తెలిపాడు.

**"......... వాణిఁదాల్చు సుకవిస్తోమంబు రప్పించి త**
**ద్ఘనవిద్యా మహిమల్కరామలక ముల్గావించె......"**
**(వ.చ. మూ.ఆశ్వా.32ప)**

**"అన్నగ శేఖరుండును మహామణికూట సమర్పణంబుచేఁ**
**గిన్నర కోటులన్నిలిపి గేయవిశారదఁ జేసెఁ గూతునుం**
**గిన్నరమీట వీణఁ బలికింపగ గీతములుం బ్రబంధము**
**ల్వన్నియఁ బాడఁజెప్ప ననివారిత చాతురి గల్గునట్లుగాన్"**
**(వ.చ. మూ.ఆశ్వా.33ప)**

ఆ కాలములో ధనవంతులు, రాజులు తమ కుమార్తెలను సంగీత సాహిత్యములలో నిష్ణాతులుగా చేసే ఆచారమును అనుసరించారు. కనుక తనకున్న సంగీత సాహిత్య ప్రీతిచేత కవి ఈ విధంగా చెప్పాడని ఊహించొచ్చు.

**"వీణావాదన వేళలన్ ఘుమఘుమావిర్భూతి నింపన్"** (వ.చ. మూ.ఆశ్వా.34ప) కోలాహలుడు తన కూతురైన గిరికకు వీణ వాయించ డానికే ప్రత్యేకంగా మణులతో గృహాన్ని నిర్మించి ఇచ్చాడని, ఆ గోడలకు పద్మరాగములు చెక్కినట్లు, ఆరిపోని దీపములున్నట్లు రామరాజభూషణుడు వర్ణించాడు. వీణశబ్దం ప్రతిధ్వనించేటట్లు ప్రత్యేక సభా భవనములు ఆ కాలంలో నిర్మించబడి వుండేవని పై పద్యం ద్వారా తెలుస్తుంది.


**"పగడపుఁజిట్టలన్ మనికి పట్టుగఁగట్టిన పట్టుజీనువుల్**
**జిగిబిగి మించుచంచువులఁ జించినచో రసపూరమారఁ జె**
**న్నగు రసదాడిగుంపులు పురాంతికసీమల శాలిపాలికా**
**జగదభినంద్య గానరస సంగతిఁగన్నుల నీరు గన్గతిన్"**
**(వ.చ. మొ.ఆశ్వా.114ప)**

అనే ఈ పద్యంలో పట్టుజీనువులనే తెల్లటి పక్షులు చంచువులతో (పక్షి ముక్కుతో) చెఱకు గడలను చీల్చగా కారుతున్న చెఱకురసము శాలిపాలికల (వరి చేలను కాపలాగావుండే యువతుల) పాటచేత స్రవించు ఆనంద బాష్పోదయము వలె ఉందని సంగీత హృదయుడైన రామరాజభూషణుడు ఉత్ప్రేక్షను సృష్టించాడు.

**"అకుటిల సౌమ్యమాననిల యస్ఫురణంబును నాతిమాత్ర తా**
**రక పరివర్తనంబు శుభరాగ మిళత్పద పల్లవాంక ము**
**ద్రికయును పెంపుమీఱ నిజదృష్టులఁ బోలిన సింధుకన్యకా**
**ప్రకట వివాహగీతికలు పాడిరి పుణ్యపురంధ్రికామణుల్"**
**(వ.చ. ఐ.ఆశ్వా.71ప)**

గిరిక, వసురాజుల పెళ్ళి సందర్భంలో పుణ్య పురంధ్రీమణులు సింధు కన్యకా వివాహగీతములను పాడినట్లు చిత్రించాడు. సంగీత జ్ఞానము గల కవి ఆ గీతములు నిర్వక్రమైన రమ్యమైన నిషాద స్వరలయయుక్తంగా ఉన్నాయని, రాగవిశేషములతో పదము, పల్లవులతో కూడినవని పేర్కొన్నాడు. వివాహముల సమయాల్లో ధవళములను (పెండ్లిపాటలు) పాడుట ఆచారము. వాటిని కవి ఐదవ ఆశ్వాసము 126వ పద్యము కందములో తెలిపాడు. బృంద గానములు, వాద్య బృందముల గురించి కూడ కవి క్రింది పద్యంలో ప్రసంగించాడు.

**"మనఘోషార్భటియున్ సమీరణముఖాఘూతాహితానాహత**
**స్వననానా సుషిరావళీ ఘుమఘుము వ్యాపారముం గిన్నరీ**
**నినదంబుం గలకంఠికా రవసుధా నిష్యూతియున్ ఝుర రౌ**



**ఘనినాదంబుననందుఁ గ్రందుకొనుచుం గప్పెంగ కుప్పాళికన్"**
**(వ.చ. ఐ.ఆశ్వా.47ప)**

మేఘంగర్జన– తాళకాది కాంస్యవాద్య ఘోషమని, గాలి– వంశాది వాద్య మలధ్వని అని, కిన్నర పక్షుల రావము– కిన్నర అనే వాద్యవిశేష నాదమని, కోకిలారావములు – అవ్యక్త మాధుర్యము గల స్త్రీల కంఠనాదములని, నదీప్రవాహ శబ్దము– డమరుల నినదమని, పర్వత సహజములగు పక్షి ప్రవాహాదుల నినదములను కవి పట్టణములోని వివిధ వాద్యాదుల ధ్వనులుగా సమర్థించాడు. రామరాజ భూషణుడు సంగీత కళానిధియై ఆయా వాద్య విశేషముల యొక్క ధ్వనుల స్వరూపములను తెలిసినవాడు. కాబట్టి ఇలాంటి కల్పనను కావించగలిగాడు. పై పద్యములో వివిధ వాద్యములతో కూడిన గాత్రగానము ప్రసంగించబడింది. ఇటువంటి వివిధ వాద్య సమ్మేళనము మరొక పద్యములో క్రింది విధంగా చెప్పబడినది.

**"వైణికవల్ల కీ శ్రేణి నిమ్ననమీటె**
**గాయక గాంధర్వ గమక రేఖ**
**గాంధర్వ గమక రేఖ బరాహతము చేసె**
**వాంశికవంశికా వైభవంబు**
**వాంశికవంశికా వైభవం బెగనూదెఁ**
**దాళికాధర కరతాళ గరిమ**
**కరతాళగరిమంబు కంచుమించుగనొ త్తె**
**నానద్ధచటుల తూర్యవ్రజంబు"**

**"చటులతూర్య వ్రజము నంటఁ జఱచెఁ బరిణ**
**యాగత దిగంత నృపతి నాగాశ్వరథ ప**
**దాతి కోలాహలంబు రోదసి నఖండ**
**మగుచు నాదాత్మక బ్రహ్మ మతిశయిల్ల" (వ.చ. ఐ.ఆశ్వా.69ప)**

ఇందులో వీణ, గీతము, వేణువు, తాళము, మృదంగాలు మొదలైన ధ్వనులు ఒకదానిని మరొకటి మించినదని ఉత్తరోత్తరాధిక్యమును కవి చూపాడు. నాదాత్మక బ్రహ్మోపాసకుడైన రామరాజభూషణుడికి సంగీతము సర్వవ్యాప్తమై గోచరించుటలో అతిశయోక్తి లేదు. అలాగే కోలాహల పర్వతముపై కోకిల, మయూర, శుకముల మధుర స్వరములు వనదేవతా గీతములు, అప్సర స్త్రీల వీణానాదములు, గోరువంకల భాషితములు, తుమ్మెదల కలగానములు ఇవి అన్నీ కలిసి బృందసంగీతము రీతిగా ఒప్పుచున్నాయని (రెం.ఆశ్వా. 7ప) కవి ఉత్ప్రేక్షించాడు.

రామరాజభూషణుడు తన సంగీత జ్ఞానమును ఆధారముగా చేసుకొని కొన్ని చమత్కార కల్పనలను సృష్టించాడు.

**"అరిగాఁబంచమ మేవగించి నవలాలవ్వేళ హిందోళ వై**
**ఖరిఁబూన్ బికజాత మాతృరవ భంగవ్యాకులంబై వనీ**
**ధర నాలంబిత పల్లవవ్రత విధుల్దాల్పం దదీయధ్వనిన్**
**సరిగాఁ గైకొనియెన్ వసంతము మహాసంపూర్ణ భావోన్నతిన్"**
**(వ.చ. మొ.ఆశ్వా.130ప)**

శిశిర వసంతముల సంధికాలములో హిందోళరాగము పాడదగిన దని, హిందోళ రాగము ఋషభపంచమ స్వరములు లేక ఐదు స్వరములతో కూడిన 'ఔడవ' రాగంగా తెలిపాడు. స్త్రీలు వసంత కాలారంభమున 'అరిగాన్' అనగా ఋషభ స్వరము లేని హిందోళమును పాడుటకు ఆరంభించారు. వసంత కాలారంభములో వచ్చే కోకిలలు తమ పంచమస్వరము భంగమైనదని విచారపడి చిగురుటాకులను మేసి వ్రతమొనర్చినట్లు కూర్చాడు. అపుడు స్త్రీలు కోకిలల పంచమస్వరమును గ్రహించి 'సరి గాన్' అనగా ఋషభ స్వరముతో కూడిన సరియైన సప్తస్వర సహితమైన సంపూర్ణమగు వసంతరాగమును ఆలపించారు. ఇందులో కవి 'అరిగాన్, సరిగాన్' అనే చోట శ్లేష చమత్కృతిని చూపి తన రాగ పరిచితిని ప్రదర్శించాడు. ఏ సమయములో ఏ రాగమును ప్రయోగించాలో కవి క్రింది విధంగా సూచించాడు.

**"ఆ జాబిల్లి వెలుంగు వెల్లికల దాయన్ లేక రాకానిశా**
**రాజశ్రీ సఖమైన మోమునఁ బటాగ్రంబొత్తి యెల్గెత్తి యా**
**రాజీవానన యెద్చెఁ గిన్నరవధూ రాజత్కరాంభోజకాం**
**భోజీమేళ విపంచికా రవసుధాపూరంబు తోరంబుగాన్"**
**(వ.చ. నా.ఆశ్వా.52ప)**

పెద్దన వరూధిని యేడ్చెఁ గల స్వనంబుతో అని మాత్రమే చెప్పాడు. కానీ సంగీతజ్ఞుడయిన రామరాజభూషణుడు గిరికను కాంభోజీ రాగములో ఏడిపించాడు. కాంభోజీరాగము కరుణ స్వరాన్వితము. కాబట్టి కరుణాత్మక వియోగ శృంగారమును ఇక్కడ వర్ణిస్తూ గిరిక ఆ స్వకీయములో ఏడ్చెనని చెప్పుట సమంజసముగా వున్నది. అలాగే వసురాజు గిరిక వున్న ప్రాంతంలోకి ప్రవేశించేటపుడు కవి **"నిల్చె నెదుటన్ సారంగరాగ భ్రమన్మద భృంగీరుతివంది మాగధ కథా మాధుర్యముం దెల్పగన్"** (వ.చ. మూ.ఆశ్వా.45ప) అని చెప్పెను.

రామరాజభూషణుడు ఆయా సందర్భాల్లో కొన్ని రాగాల పేర్లను పేర్కొన్నాడు.

హిందోళ రాగము (మొ.ఆశ్వా.130ప)

సారంగ రాగము (మూ.ఆశ్వా.45ప)

కలహంస, శ్రీరాగము (మూ.ఆశ్వా.59ప)

కాంభోజి రాగము (నా.ఆశ్వా.52ప)

సింధుకన్యక (సైంధవి) రాగము (ఐ.ఆశ్వా.71ప) మొదలైన రాగములను వసుచరిత్రలో సందర్భానుసారంగా కూర్చాడు.

**"హిందోళ రాగము - నటభైరవి యొక్క జన్యరాగము, సారంగ రాగము - మేచకళ్యాణి యొక్క జన్యరాగము, కలహంస రాగము - యాగప్రియ యొక్క జన్యరాగము, శ్రీ రాగము - ఖరప్రియ యొక్క జన్యరాగము, సైంధవి రాగము - ఖరప్రియ యొక్క జన్యరాగము"**

(సంగీత శబ్దార్థ చంద్రిక, పుటలు 511, 479, 84, 428, 498)

ఈ రాగములన్నింటికి గానకళా విశారదగా పేరొందిన అరిపిరాల సత్యనారాయణమూర్తి గారు సంగీత శబ్దార్థ చంద్రిక గ్రంథంలో వివరంగా జన్యరాగములు, అవరోహణము, ఆరోహణములను చక్కగా తెలిపాడు.

**"ఉద్ధతరిపు విద్ధతపన**
**పద్ధతి కరిభవనదవని పటదంబుధి సం**
**పద్ధరణ సముద్ధరణ స**
**మిద్ధరణ రజోవ్రజోద్యదిభమదసృతికిన్"** (వ.చ. మొ.ఆశ్వా.89ప)

అనే పద్యములో

**"తద్ధి తకిట, తద్ధితఝణు**
**తద్ధిరుతకు, తకిట దికిట తక తోంకిట, తాం**
**కుత్తఝణు, కకుంతఝణు కు**
**కూంత దిరు, తతోంత కూంత తకుత ధిగిణతోం"**

(వసుచరిత్ర - సంగీత సాహిత్యములు, పుట 22)

అను మృదంగ 'తత్కార' వాద్యధ్వని 'ఆదితాళ' ప్రధానముగ వ్యక్తమవుతున్నదని సంగీతజ్ఞుల విమర్శకుల అభిప్రాయము. వసుచరిత్రను సంగీతభరితముగా కావించినవన్నీ వసుచరిత్రకారుని సంగీతాభిరుచికి తార్కాణములు.

సాహిత్య సమరాంగణ సార్వభౌముడైన కృష్ణదేవరాయలు, నానా కళాపారీణుడైన రామరాయలు వీణావాద్యనిపుణులే అని మనకు అర్థం అవుతుంది. ఈ మర్యాదను అనుసరించి దక్షిణదేశమును పాలించిన రఘునాథాది ప్రభువులు కూడా సంగీత సాహిత్యములలో పాండిత్యమును సంపాదించి వాటిని సమానముగా ఆదరించారు. ఆనాటి కవులు, కవయిత్రులు సంగీత సాహిత్యములను సమానముగా అభ్యసించారు. కాబట్టి ఆ కాలములో సంగీతసాహిత్య ప్రధానములైన యక్షగానములు ఎక్కువగా రచించబడ్డాయి. ఇలాంటి సంగీత సాహిత్య యగళము(రెండింటి)లో పాండిత్యసిరులను ఆవిష్కరించుటలో రామరాజభూషణుడు ప్రసిద్ధి చెందాడు.

**3. ముగింపు :**

పాండితీ ప్రకర్షకు చిరునామా వసుచరిత్ర ప్రబంధం, తెలుగులో అత్యుత్తమమైన బహుళ ప్రచారం పొందిన ప్రౌఢప్రబంధము. ఈ ప్రబంధం మొత్తం మీద ఉపరిచర వసురాజు, గిరికల వివాహమే ఇందులోని ప్రధాన ఇతివృత్తం.

రామరాజభూషణుడు వసుచరిత్ర కంటే ముందు కావ్యాలంకార సంగ్రహం రచించినా అప్పటికి సంగీతకళా రహస్యనిధి బిరుదును పేర్కొనలేదు. కాబట్టి వసుచరిత్ర రచించే నాటికి సంగీత కళా రహస్యములను తెలుసుకున్నాడు.

వసుచరిత్ర మనుచరిత్రకు ప్రతిద్వందిగా వచ్చినప్పటికీ రామరాజభూషణుడు మనుచరిత్రను మించిన వర్ణనలు సృష్టించాడు.

రామరాజభూషణుడు వసుచరిత్రలో చూపిన తీరును బట్టి నాయక ప్రవేశ సమయంలో యక్షగానాల్లో సారంగ రాగాలాపన చేయడం ఆచారంగా ఉండేదేమో అని తెలుస్తుంది.

తెలుగు సాహిత్యంలో ప్రతిభావంతులు కావాలంటే ప్రతి వ్యక్తి తప్పక అభ్యసించవలసింది వసుచరిత్ర అని పరిశోధకులు తెలిపిన మాట.

తెలుగు పద్యానికి పాట నేర్పిందే కాక, దానిచే ఆటలాడించి మాధుర్యానికి మారుపేరుగా చలామణి అయ్యే పద్యాలకు రామరాజ భూషణుడి లేఖిని జలసూత్ర స్తంభం, పద్యాలను రచించడమే కాదు వాటిని చదవడం కూడా ఒక కళే అన్న సంగతి భట్టుమూర్తితో మొదలైందని ఆరుద్ర గారు అంటారు.

రామరాజభూషణుడు నిండు ముత్తైదువులచేత గిరిక, వసురాజుల పెళ్ళి సందర్భంలో ధవళ గీతములను పాడిస్తాడు. అలాగే ఈ సంప్రదాయపు పాటలను ఒక కందపద్యంలో తెలిపాడు.

పెద్దన, రామరాజభూషణుడి సంగీత జ్ఞానాన్ని పోల్చినప్పుడు నాయికల ఏడ్పును గురించి చెప్పినప్పుడే సులభంగా అర్థం చేసుకోవచ్చు. గిరిక ఏడుపును కూడా కాంభోజి రాగంలో చెప్పాడంటే అతనికి ఉన్న అమోఘమైన సంగీత శాస్త్ర జ్ఞానాన్ని మనం అంచనా వేయవచ్చు.



**4. ఉపయుక్త గ్రంథసూచి**



1. రామస్వామి శాస్త్రులు, వావిళ్ల. (1951). వసుచరిత్రము టీక, వావిళ్ల ప్రెస్, మద్రాసు.
2. సత్యనారాయణమూర్తి,అరిపిరాల. (1954). సంగీత శబ్దార్థచంద్రిక, ములుకోల ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ.
3. వెంకట రామనరసింహం, కాకర్ల. (1965). ఆంధ్ర ప్రబంధం అవతరణ వికాసములు, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం.
4. నారాయణాచార్యులు, పుట్టపర్తి. (1974). వసుచరిత్ర – సంగీత సాహిత్యములు, నాట్యకళ ప్రెస్, హైదరాబాదు.
5. జగన్నాథరావు, మంచాళ. (1975). ఆంధ్రుల సంగీతకళ, నాట్యకళ ప్రెస్, హైదరాబాదు.
6. బ్రహ్మయ్య శాస్త్రి, కాశీభట్ల. (1995). మను వసు ప్రకాశిక, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
7. వేంకట సింగరాచార్య, బొమ్మకంటి, నళినీ కాంతరావు, బాలాంత్రపు. (2009). వసుచరిత్రము, ఎమెస్కో బుక్స్, విజయవాడ.
8. దుర్గయ్య, పల్లా. (2012). ప్రబంధ వాఙ్మయ వికాసము, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
9. కమలాసనుడు. (2013). వసుచరిత్ర వచన రచన, జయంతి పబ్లికేషన్స్, విజయవాడ.
10. నాగయ్య, జి. (2021). తెలుగు సాహిత్య సమీక్ష రెండవ సంపుటం, నవ్య పరిశోధక ప్రచురణలు, హైదరాబాదు.
11. శ్రీదేవి, కిన్నెర. (2022). సాహిత్య వివేచన, సంహిత పబ్లికేషన్స్, హైదరాబాదు.


❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2025

# డా. కపిలవాయి లింగమూర్తి పీఠికలు – పరిశీలన

**డా. కసప నరేందర్,** సహాయ ఆచార్యులు, తెలుగు శాఖ, నిజాం కళాశాల. ఫోన్ : 9390 686 471




తన రచనలకు తానే అభిప్రాయాన్ని రాసుకోవడం లేదా ఇతరుల రచనలకు తాను రాసిన అభిప్రాయాన్ని **'ముందుమాట, ఆముఖం, తొలిపలుకులు, పీఠికలు'** అని అంటారు. డా. కపిలవాయి లింగమూర్తి గారు ఇతరకవుల రచనలకు ఔదార్యమైన అభిప్రాయాలను రాసారు. వాటినే ఆయన 'పీఠికలు' అని చెప్పుకున్నారు. ముందుమాట, అవతారిక, ఆముఖం, తొలిపలుకులు మొదలైన మాటలకంటే సాహిత్యలోకంలో 'పీఠికనే' ప్రాచుర్యం పొందిండి.

'Forword, Preface' అనే ఆంగ్లపదాలకు 'ముందుమాట, తొలపలుకులు, మున్నుడి' అనే అర్థాలున్నాయి. ఇదే అర్థం పీఠికలకు వర్తిస్తుంది. పీఠికకు పర్యాయంగా ఉపోద్ఘాతం, అవతారిక, భూమిక, ప్రస్తావన, ఆముఖం, అనే మాటలు వినియోగంలో ఉన్నాయి. చలం మాత్రం శ్రీశ్రీ మహాప్రస్థానం కావ్యానికి **'యోగ్యతా పత్రం'** అనే మాటను వాడారు. ఇది ప్రయోగమే. ఇలాంటి ప్రయోగం కపిలవాయి గారు చేసారు. కొందరు సాహిత్యకారులు ప్రస్తావన, ఉపోద్ఘాతం, భూమిక, పరిచయం అనే పదాలను వినియోగిస్తూ ముందుమాటలు రాసారు. ఈ మధ్య అభినందనలు, ఆశీస్సులు, శుభాకాంక్షలు అంటూ కూడా రాస్తున్నారు. తెలుగు పీఠికలపై పరిశోధన చేసిన డా. చంద్ర శేఖర్‌రెడ్డి పుస్తకానికి రాసిన ముందుమాటలలోని చాలా పదాలకు సాధికారికమైన ఉదాహరణలను తెలిపారు.

పీఠికలు ప్రధానంగా రెండురకాలు. 1. కవి తనకు తానుగా తన రచనా విశేషాలను రాయడం, 2. ఇతరుల రచనలను పరిశీలించి ఆ రచనా విశేషాంశాలను రాయడం.

పీఠికలు ప్రారంభంలో పద్యరచనలో ప్రారంభమై, వచనంలోకి, వ్యాసంలోకి మారాయి. అవి ఎన్ని పేజీలలో ఉండాలి? ఎంత నిడివి ఉండాలనే నియమం లేదు. ఇప్పుడంటే రెండు మూడు పేజిలలో రాస్తున్నారు.

**పీఠికలు – నేపథ్యం**

'పీఠిక' ప్రక్రియగా తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించడానికి పాశ్చాత్య సాహిత్య ప్రభావం ఉంది. ముద్రణకు రచనలు ఎప్పుడు నోచుకున్నాయో 'పీఠిక' కూడా ఆ సమయంలోనే ప్రారంభమైంది.

తెలుగు సాహిత్య గ్రంథాలను వెలికి తీసి, వాటిని పరిష్కరించి, ముందు మాటలను రాసి ముద్రించిన ఘనత సి.పి.బ్రౌన్‌కే దక్కుతుంది. ఈస్టిండియా కంపెని నుంచి ఉ ద్యోగిగా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి తెలుగు కావ్యాలను పరిష్కరించి ముద్రించడం ప్రవృత్తిగా చేసుకున్నాడు. రచనలకు ముద్రణా సంస్థలు 'పీఠికలు' రాయడం బహుశా సి.పి. బ్రౌన్ నుంచే ప్రారంభమైందేమో. ఆయన తెలుగులో వ్యాకరణ గ్రంథాలను, నిఘంటువులను, ప్రబంధాలను ఇంకా ఎన్నో సాహిత్య రచనలను ముద్రించాడు.

పీఠికలు కేవలం రచనకారుల ముఖస్తుతి చేయడానికో, నిందించ డానికో కాదు. లేదా ఎవరిరచనను వారు గొప్పగా చెప్పుకోవటానికో కాదు. 'పీఠిక' ఆ రచన విశేషాలను, సమకాలీన స్థితిగతులను, కవితా విశేషాలను తెలిపేదిగా ఉండాలి. అతియోశక్తిగా ఉ ండ కూడదు. ఆంగ్లంలో కూడా పీఠికలకు నిర్వచనాలు ఉన్నాయి.

కొందరు గొప్ప కవి పండితులు గొప్పకవుల, రచనలకే పీఠికలు రాస్తారు. దారినపోయే దానయ్యలకు రాయరు. పేలవమైన రచనలకు 'పీఠికలు' రాస్తే వారి ప్రతిభాపాటవాలకు విఘాతం కలుగుతుందనే భావన ఉంటుంది. మరికొందరు సంఖ్యా నియమానికి లోనయ్యి అడిగిన ప్రతిరచనాకారుడి రచనకు 'పీఠిక' రాసి తమ ఔదార్యం నిలుపుకుంటారు. ఇంకొందరు రచనాకారులను ప్రోత్సహిస్తూ పీఠికలు రాస్తారు.

**డా. కపిలవాయిలింగమూర్తిగారి పీఠికలు – పరిశీలన**

కపిలవాయి లింగమూర్తిగారు పాతకాలానికి, కొత్తకాలానికి పరిచయం ఉన్న కవి పండితుడు. అందుకే వర్తమాన కవులను ప్రోత్సహించాడు. ఎన్నోరకాలుగా సాహిత్య, పరిశోధక సందేహాలను చాలా ఓపికగా తీర్చుతూ ఉండేవారు. నాగర్ కర్నూల్ చుట్టు పక్కలనే కాకుండా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలలోని ప్రాంతాలనుండి వచ్చేసాహిత్యాభిలాషులకు సహాయం చేయడం ఆయనకు అలవాటుగా మారిపోయింది. అందువల్ల యువకవులను ప్రోత్సహిస్తూ పీఠికలను మొక్కుబడిగా కాకుండా రచనలలోని

విశేషాంశాలను ప్రత్యేకంగా పేర్కొన్నారు. కొందరి రచనలలో చారిత్రకవిశేషాలను వెలువరించారు.

కపిలవాయి లింగమూర్తి గారు పుస్తకాలకు రాసిన పీఠికలను జాగ్రత్తగా భద్రపరచి ఈ మధ్య కొన్నింటిని 'కపిలవాయి పీఠికలు' అనే శీర్షికతో ప్రచురించాడు వారి కుమారుడు సాహిత్య పిపాసి కపిలవాయి అశోక్‌బాబు. తండ్రి రచనలను సృష్టిస్తే కుమారుడు నిత్యచైతన్యుడై వాటిని ప్రచురించే కార్యక్రమాన్ని స్వీకరించాడు. అశోక్‌బాబు తండ్రిలాగే కవి అయితే ఆయన రచనల ధ్యాసే ఉండేది. కానీ, తండ్రిగారి రచనల ప్రచురణను తన బాధ్యతగా స్వీకరించారు కనుక అవి నిరాటంకంగా ప్రచురణకు నోచుకుంటున్నాయి.

కపిలవాయి లింగమూర్తి అశోక్ బాబుకు ఆర్థిక సంపద కంటే రచనా సంపదను కానుకగా ఇచ్చారు. కనుక అది అశోక్‌బాబు పర్యవేక్షణలో జాగ్రత్తగా ఉంటుంది. అదే ఆర్థిక సంపద అయితే తరిగిపోయేది. ఈ సందర్భంగా వారిని అభినందించాలి. 'కపిలవాయి పీఠికలు' పుస్తకంలో అరవైమూడు మందికవుల రచనలకు పీఠికలు ఉన్నాయి. వాటినే నేను పరిశోధనా వ్యాసానికి తీసుకున్నాను.

ఇందులో ఇమ్మిడిశెట్టి చంద్రయ్య రచించిన 'మృత్యుంజయ శతకానికి' కపిలవాయి లింగమూర్తి అనేక విశేషాలతో **'ఆముఖము'** శీర్షికతో రాసిన మాటలు మూలరచనకు ప్రౌఢతను కలుగ జేస్తున్నాయి. **'అసతోమా సద్గమయ – తమసోమా జ్యోతిర్గమయ –మృత్యోర్మా అమృతంగమయ'** ఈ శ్లోకాన్ని సందర్భానుసారంగా ఉదహరిస్తూ, జీవుడు, జీవునిగా ఉన్నంత వరకు మృత్యువు తప్పదు. అది తప్పినంత కాలము తద్భయము కూడా తప్పదు. అతనికి ఆ భయముకంటే మించిన భయంకర భావన మరియొకటి ఉండదు. అందువల్ల అతడు మరణ భయము నుండి విముక్తుడై అమృతత్వము నందవలసి ఉన్నది. అట్టి స్థితినే ముక్తి లేక మోక్షమని అందరు అన్నారు. చరమాంకంలో మనిషికి మరణభయము ఉంటుంది. మనిషి మరణాన్ని ఎలా జయించాలనేదే 'మృత్యుంజయ శతకము' వెల్లడిస్తుంది. అది దృష్టిలో పెట్టుకుని కపిలవాయిగారు శ్లోకం చెప్పారు. కవికి అద్వైతదృష్టి ఉండాలని, అది ఇమ్మడిజెట్టి చంద్రయ్యలో కనిపిస్తుందని చెప్పాడు. కవి ఉద్దేశాన్ని పసిగట్టి పీఠిక రాయడం గొప్పగా అనిపిస్తుంది.

'ఆఫీసు తత్త్వాలు' పెంటమరాజు నరసింగరావు రచించాడు. దీనికి కపిలవాయిగారు **'తత్త్వదర్శనం'** పేరులో ఆ రచనావిశేషాలను తెలిపాడు. 'తత్త్వం' అనే పదాన్ని నిర్వచిస్తూ తత్త్వం ఒక వస్తువు యొక్క నిజ స్వరూపం. తత్త్వం ఆధ్యాత్మిక పరిభాష. 'తత్' అంటే అది 'త్వం' అంటే నీవు తత్త్వమసి మహా వాక్య చతుష్టయంలో ఒకటి. దానిలో 'తత్' అంటే, పరబ్రహ్మ పదార్థానికి, 'త్వం' అంటే జీవునికి సంకేతం కాబట్టి 'ఒరే పిచ్చినాయినా! నీవు కేవలం జీవుడవు మాత్రమే



కావు, ఆ పరబ్రహ్మ స్వరూపుడివే సుమా! ఈ సత్యాన్ని తెలుసుకో అనేది తత్త్వమసి యొక్క తాత్పర్యం. అందుచేత సామన్యుడికి ఆ విషయాన్ని అవగాహన చేయటానికి వేదాంతంలో ఈ తత్త్వాలు ఆవిర్భవించినవి. ఈ తత్త్వవాఙ్మయానికి సాహిత్యంలో శ్రీకారం చుట్టినవాడు వేమన యోగి. దానికి సమగ్రమైన రూపం కల్పించింది పోతులూరి వీరబ్రహ్మంగారని కపిలవాయి గారు నిర్ధారించారు. 'చిల్లర రాళ్లకు మ్రొక్కుతు ఉంటె చిత్తము చెదునుర ఒరె ఒరే'. అనేది సామాన్యతత్త్వమైతే. "ఊదే తిత్తుల పైగా నుండే ఉన్నవి తెలియర ఓరన్నా" అనేది మార్మికత్వమని, తత్త్వాన్ని రెండు శాఖలుగా పేర్కొని, నరసింగరావు ఆఫీసు తత్త్వాలు మొదటి కోవకు చెందుతాయని చెప్పాడు. **"ఉత్తరం ముట్టిన దానికి చాలదు బలం – దక్షిణ ముడితే తప్పు కదలదు అక్కడి కలం"** అని రాసి కవి పద్యానికి ఇది ఈనాటి కార్యాలయాల పరిస్థితి. అందుచేత వాటిని **'కార్యలయాలు తప్పు కార్యాలయాలు'** అనలేము. ఆఫీసులనే రథాలకు ఈనాడు క్లర్కులు ముందు చక్రాలు ఆఫీసర్లు వెనక చక్రాలు ముందు చక్రాలు తిరగకుంటే వెనక చక్రాలు తిరిగినా లాభముండదు కదా! అంటూ కవి అంతరంగాన్ని పీఠికలో ఆవిష్కృతం చేసాడు లింగమూర్తిగారు.

ప్రభుత్వ ఆఫీసులంటే ఒకరకమైన భావన సమాజంలో నాటుకు పోయింది. దాన్ని కవి వర్ణిస్తే ఆ ఉద్దేశాన్ని పీఠికలో నిలబెట్టారు. 'తూర్పు కనులెర్ర చేస్తే' కవితా సంపుటికి **'శుక్రతార'** శీర్షికతో తన అభిప్రాయాన్ని రాసారు డా. కపిలవాయి లింగమూర్తిగారు 'శీర్షికనే' చాలా విలక్షణంగా పెట్టారు సమయస్ఫూర్తితో వ్యవహరించే సాహితీవేత్త. అందులో ఆయన భాష గురించి ఇలా చెప్పారు. భాష అనేది భావానికి దుస్తుల వంటిది. దుస్తులు సంప్రదాయ సిద్ధంగా ఉన్నప్పుడే ఎవరికైనా ఆ వ్యక్తి హూందాగా, గౌరవప్రదంగాను కనిపిస్తాడు. ప్రాచీన కవికి కవిత్వంలో మొదటి వరసలో ప్రతిభా, వ్యుత్పత్తి అభ్యాసాలని రెండవ వరుసలో యతి గణ ప్రాసలని, మూడవ వరుసలో రసధ్వని అలంకారాలని ఎన్నో నియమాలుండేవి. కాని ఈనాడు వీటన్నింటికి మినహాయింపులున్నా ఇప్పటి కవులు మాత్రం తమ భావానికి బిగువు దుస్తులో, బికినీ దుస్తులో జిప్సీదుస్తులో,

జీరాడే దుస్తులో వేస్తున్నారు. కాని సామాన్యమైన సంప్రదాయ దుస్తులు గూడా సరిగా వేయలేకపోతున్నారు.

ఈ తరంలో మన జిల్లాలో యువకవి రంగినేని సుబ్రహ్మణ్యం మాత్రం పై విషయానికి ఆపవాదుగా కనిపిస్తున్నాడు అంటాడు.

లింగమూర్తిగారు సంప్రదాయకవి. వారి రచనలలో భక్తి విశ్వాసం, దేవాలయాల ప్రస్తావన పుష్కలంగా కనిపిస్తుంది. ప్రస్తుతం సమాజం పోకడలు సంప్రదాయవాదులకు గిట్టవు. మనుషులు వేషం, భాష మార్చి జీవిస్తున్నారు. వర్తమానకవులు అలాగే ఉన్నారు. భాష వినియోగం, భావ వినిమయం పలుచగా ఉంటుంది. ఇప్పటి కవిత్వంలో ఛందస్సు కనిపించదు. నానీల లాంటి పనికిరానివి 'కవిత్వం' పరువు తీస్తున్నాయి.

కవి రంగినేని సుబ్రహ్మణ్యం గురించి మాత్రం చాలా గొప్పగా రాసారు లింగమూర్తిగారు. సుబ్రహ్మణ్యం యొక్క హృదయం భావసంపద దాన్ని వెలయించటంలో భాషా ప్రజ్ఞ ఆటుపోటులతో హద్దులు మీరకుండా మైదానంలో పారుతున్న నదివలె శైలిలో ప్రసన్నత ఉన్నవి అని ప్రోత్సాహకంగా 'పీఠిక' రాయడం లింగమూర్తి గారి ఔదార్యాన్ని తెల్పుతుంది. మొక్కుబడిగా రాయకుండా కవిని అతని కవితా శక్తిని అంచనావేస్తు 'పీఠిక' రాయడం అంత సులువు కాదు.

పీఠిక రాసేవారికి సాహిత్యజ్ఞానం మాత్రమేకాక పూర్వగ్రంథ పరిశీలన ఉండాలి. అంటే వేదాలు, పురాణాలు, భారత రామాయణ భాగవతాలను అధ్యయనం చేసి వుంటే 'పీఠికలు' ఉన్నత స్థాయిని పొందుతాయి.

కపిలవాయి లింగమూర్తి గారు 'మాతృశతకానికి' చాలా గొప్పగా పీఠిక రాసారు. దీనిని దేవకాటమరాజు నరసింహులు రచించారు. మాతృ శతకములో 'మాతృ' అనే పదం ఉన్నందుకు లింగమూర్తిగారు. 'మాతృ' శబ్దానికి ఉన్న ప్రాశస్త్యాన్ని స్పృశించారు.

**"భూప్రదక్షిణ షట్కేనా -కాశీయాత్రాయుతాయచ**

**సేతుస్నాన శతైర్వచ్చ- తత్ఫలం మాతృ వందనం"**

తల్లికి - తండ్రి, ఆచార్య, అతిథులకంటే వేదశాస్త్రాల్లో గౌరవం ఉందని చెప్పాడు. ఆరు సార్లు భూప్రదక్షిణం, వందసార్లు సేతుస్నానం, వేయిసార్లు కాశిని దర్శించినంతఫలం ఒక్కసారి భక్తితో వందనం చేస్తే కలుగుతుంట. అంటూ నేటి కాలంలో తల్లిదండ్రులను పిల్లలు గౌరవిస్తున్న తీరును దుయ్యబట్టారు. ఈనాటి తలిదండ్రులను తలచుకున్నప్పుడు మాత్రం వారెంత పాపం చేసి ఈ పుత్రులను కన్నారో అన్నంత ఆవేదన కూడా అప్పుడపుడు కలుగక మానదు. కనుక పేటిక చిన్నదైనా దీనిలో చిరంజీవి కాటమరాజు అనంతమైన అమ్మ మహిమను అల్పాక్షరాలతో తన శక్తి మేరకు కూర్చే ప్రయత్నం చేసాడు అని పీఠిక రాసాడు.

కపిలవాయి లింగమూర్తి గారు రాసిన మరో పీఠిక 'పాలమూరు జిల్లా సంకీర్తనా సాహిత్యం'. ఇది పరిశోధన గ్రంథం. పాలమూరు జిల్లాలో విస్మరణకు గురయిన సంకీర్తనకారులను గుర్తించినదీ గ్రంథం. దీనికి రాసిన పీఠికలో చారిత్రక అంశాలను స్పృశించారు. అంతేకాదు సంకీర్తనల వినియోగాన్ని కూడా గొప్పగా చెప్పారు. రచయిత గురించి ఇప్పటికే భాస్కర్ సేకరించింది. రాకమచర్ల వెంకటదాసు గారి కాలం తరువాతదే గాని, అంతకంటే మొదలు భజన సమాజాలు లేవా? మరి ఆనాటి సాహిత్యమేది? దాని ఆనవాలు కూడా తెలియడం లేదు. కనుక ఈ భాస్కరయోగిని ప్రేరణగా తీసుకుని భావి పరిశోధకులు ఇంకా కొంత వెనకకు వెళ్లవలసి ఉంది. సాహిత్య పరిశోధన అనంతమైనది. తవ్వే కొద్దీ కొత్త విషయాలు బయటపడుతుంటాయి.

'ముంగిలి' తెలంగాణా పరిశోధన గ్రంథం, అలాగే తెలంగాణ అలాగే సాహిత్య చరిత్రగా కూడా చూడాలి. ఈగ్రంథంలో తెలంగాణాలో విస్మరణకు గురయిన సాహిత్యకారుల, సంకీర్తన కారుల వివరాలు ఉన్నాయి. డా. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి ఎంతో శ్రమకోర్చి కూర్చిన గ్రంథం. ఇప్పటివారికి ఇదే ప్రామాణిక గ్రంథంగా నిలిచింది.

'నాగర్ కర్నూల్ జిల్లా గ్రామాల చరిత్ర' దీనిని కపిలవాయి కిశోర్ బాబు రచించారు. ఇది ఎం.ఫిల్ సిద్ధాంత గ్రంథం. భారతదేశంలో కైఫీయతులు సేకరించిన మెకంజీ ప్రభావం వల్ల కపిలవాయి లింగమూర్తిగారికి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక, చరిత్రలు తెలుసుకోవాలన్న ఆసక్తి కలిగిందంట. ఈ పీఠికలో ఆయనే చెప్పుకున్నారు. అందువల్ల దానిని సఫలీకృతం చేయడానికే కిషోర్ బాబుకి 'నాగర్ కర్నూల్ జిల్లా గ్రామనామాలు' అనే అంశాన్ని ఎంఫిల్ డిగ్రీకోసం సూచించారు కపిలవాయి లింగమూర్తి గారు. కిషోర్ బాబు పరిశోధన చేసి సిద్ధాంత వ్యాసాన్ని ఉస్మానియా యూనివర్సిటీకి సమర్పించారు. వీరికి పరిశోధనాగ్రేసరులు కీ.శే. ఆచార్య బిరుదురాజు రామరాజు గారు పర్యవేక్షకులు. 'నాగర్ కర్నూల్ జిల్లా గ్రామ నామాలు' ఉన్నతమైన పరిశోధనా గ్రంథం. వారి సలహాలు, సూచనలతో సిద్ధాంత వ్యాసాన్ని తీర్చి విశ్వవిద్యాలయానికి సమర్పించి ఎంఫిల్ డిగ్రీని అందుకున్నారు అశోక్‌బాబు.

'నువ్వుల వాన' రచయిత్రి శ్రీమతి పద్మాలయ ఆచార్య. ఈమె వృత్తి రీత్యా ఉపాధ్యాయురాలు. ప్రవృత్తిరీత్యా హరికథా కారిణి. తండ్రి ద్వారా సంక్రమించిన సాంస్కృతిక వాసనను బిగిసిపట్టి పాటలు, పద్యాలు పాడుతూ ఉంటారు. ఆమె కళాకారిణికూడా.

ఆమె రాసిన 'నవ్వుల వాన' పుస్తకానికి **'హాసవికాసం'** అనే పీఠికను రాస్తూ నవ్వు అంటే ఏమిటి? దాని ప్రయోజనాన్ని గొప్పగా చెప్పారు కపిలవాయి లింగ మూర్తిగారు. **'నవ్వు నాలుగందాల చేటు'** అని సామెత ఉన్నా **'నవ్వు మనో మాలిన్యాలను తొలగించే పువ్వు'** అనే సూక్తి ఉంది. అందరూ నవ్వలేరు, నవ్వించలేరు. ఈ నవ్వులో

తాను నవ్వకుండా ఇతరులను నవ్వించగలవాడు దిట్ట అని లింగమూర్తి గారు అన్నారు.

ఈ మనిషికి వేషగత హాస్యం, చేష్టాగత హాస్యం, వాగ్గతహాస్యం అనే మూడు విధాలుగా నవ్వు ఉంటుందని కూడా చెప్పారు.

నవ్వు రానురాను 'ప్రహసనంగా' మారి ప్రక్రియగా తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించిందని కూడా చెప్పారు. ఈ పీఠికలో రచయిత్రి హాస్యకుడిని గొప్పగా చెప్పారు. అలాగే సాహిత్యంలో హాస్య కవుల రచయితలను స్పృశించారు. చిలకమర్తి, పానుగంటి, భమిడిపాటి, మణిమాణిక్యం, కందుకూరి లాంటి వారి 'హాస్య' సృష్టిని గుర్తు చేసారు. కపిలవాయి లింగమూర్తిగారు చారిత్రక సాహిత్యకారులు కనుక పూర్వ పరిశీలన గావించినవారు కనుక వారు సునాయసంగా ఏ కవి, రచయిత గురించైనా సమయస్ఫూర్తితో ఆవిష్కరించగలరు.

'సఖుడా! వివరించనా' సందాపురం బిచ్చయ్య రచించారు. ఈ శతక రచనకు **'అభిప్రాయం'** అనే శీర్షికతో పీఠిక రాసారు డా. లింగమూర్తి గారు. ఇందులో 'కవి' కర్తవ్యాన్ని గుర్తు చేస్తూ ఎన్నో విశేషాలు స్పృశించారు. ఈనాటిదంతా ఆకలి కవిత్వమే అంటే సమాజంలోని అశాంతికి, దుర్మార్గానికి విప్లవానికి మూలమంతా 'ఆకలి' అనియే ఆధునికుల విశ్వాసం మరియు నినాదం అంటూ ఆధునిక కవుల బాధ్యతను, పోరాటాల రచనల ఉద్దేశాన్ని వెల్లడించారు. సందాపురం బిచ్చయ్య గృహంలో భార్యనే గొప్పది ఎప్పుడు ఆమె ఆనందంగా ఉంటే ఆ గృహం స్వర్గంలా ఉంటుందన్న అభిప్రాయాన్ని కపిలవాయి లింగమూర్తి గారు అంగీకరించారు. ఈ మాటల నుంచే **'సఖుడా! వివరించనా'** శతకం ఆవిర్భవించిందని అన్నారు.

పీఠికలలో ఎవరూ పాటించని సమీక్షించని విషయాలు డా. కపిలవాయిగారు పాటించారు. అదేమిటంటే ఒక పదం దొరికినా, వాక్యం కనిపించినా, పేరు కనిపించినా దాని పుట్టు పూర్వోత్తరాలను స్పృశించనిదే మరోమాట మాట్లాడరు ఆయన. వనపట్ల సుబ్బయ్య రచించిన **'మశాలు'** కవితా సంపుటి పీఠికకు **'సమాలోచనం'** అని శీర్షికపెట్టి.. కవికి ఇంటి పేరు వనపట్ల ఎలా వచ్చిందో చెప్పారు. అంతేకాదు ఆ పదానికి ఉన్న చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. **'ఎం.ఏ. చేసినా కులవృత్తికి సాటిరాదు గువ్వల చెన్న'** అనే నానుడితో వనపట్ల తన కులవృత్తిని ఎంచుకుని జీవిస్తున్నాడని చెప్పారు. 'మశాలు' అనే పదాన్ని వేదం వెంకటరాయశాస్త్రి ప్రతాపరుద్రీయ నాటకంలో – **'నీకు చంద్రుడు మశాలు'** అని వినియోగించారని తెలిపారు. ఎంత సాహిత్యజ్ఞానం ఉంటే ఇలా సందర్భానుసారంగా చెప్పే జ్ఞానం అలవడుతుంది. అందుకే కపిలవాయి లింగమూర్తిగారిని ఒక విజ్ఞాన గ్రంథంగా ఒక సాహిత్య నిఘంటువుగా చెప్పాలి.

వేదార్థం మధుసూధన శర్మ **'సమాలోకనం'** పుస్తకానికి **'అంతరావలోకనం'** అనే శీర్షికతో పీఠిక రాసి వారి సాహిత్య అంతరంగాన్ని ఆవిష్కరించారు లింగమూర్తిగారు. ఈ రచనలో



ఉన్న అనేక చారిత్రక సాహిత్య విశేషాలను సందర్భానుసారంగా పీఠికలో స్పృశించారు.

**'పక్షి గీత'** వచన కవితాసంపుటి. దీనిని మైనా వెంకటేశ్ అనే వర్తమాన కవి రచించాడు.. దీనికి **'పక్షి గీత – ఒక దర్శనం'** అనే శీర్షికతో పీఠిక రాస్తూ ఇది ఒక సామాన్యమైన పక్షిజాతి ఆత్మకథగా ఉంది. పాలపిట్ట జాతీయపక్షియై తమ జాతికంతా గూడా ప్రతినిధిగా నిలిచిందన్నారు.

కేవలం పాలపిట్టను ఆధారంగా చేసుకున్న ఈ కవితా సంపుటి గురించి చర్చిస్తూ అనేకమైన విజ్ఞాన విషయాలను వెల్లడించారు. అంతేకాదు **'ఆత్మ–పరమాత్మల'** గురించి పీఠికలో రాయడం వల్ల కపిలవాయి గారి విజ్ఞాన, జ్ఞాన పాండిత్యం వెల్లడవుతుంది. రో బో 2.0 సినిమా అంతా కూడా 'పావురాల' జీవితం చుట్టూ తిరుగుతుంది. అంతరించిపోతున్న పావురాల జాతిని కాపాడటం కోసం ఒక వృద్ధుడు చేసిన పోరాటం ఆ సినిమాలో కనిపిస్తుంది. ఈ కవితా సంపుటి పక్షుల భవితవ్యం కోసం ఆరాట పడిందని తెలుస్తుంది.

**ముగింపు**

డా.కపిలవాయి లింగమూర్తి ఎంతో ఔదార్యం ఉన్న కవి, పరిశోధకుడు, చారిత్రక సాహిత్యానువేక్షణను సాగించి వాటి వెలికితీత కోసం పరితపించాడు. పరిశోధననే ఊపిరిగా, శ్వాసగా, మలచు కున్నాడు. ఒక తెల్ల పేపర్ కనిపిస్తే రాయడం, ఒక పదం కనిపిస్తే దాని వ్యుత్పత్తిని చెప్పడం, ఒక ప్రాంతం కనిపిస్తే దాని పుట్టు పూర్వోత్తరాలను తెలుసుకోవం వంటి అంశాలన్నీ వారి పరిశీలన, పరిశోధనాతత్త్వాన్ని తెలియజేస్తాయి. వృద్ధాప్యంలో ఉన్నా వయసు పరిశోధకుడిలా అంటే యువ పరిశోధకుడిలా ప్రవర్తించడం వారి పరిశోధన తపనకు నిదర్శనం.

ముఖ్యంగా నా ఈ పరిశోధనా వ్యాసంలో కపిలవాయి లింగమూర్తి గారి 'పీఠికల' రచననే తెలపడం. ఆయన పీఠికలను రాసేటప్పుడు చాలా విలక్షణంగా శీర్షికలు పెట్టి, రచయితల రచనాంతరంగాన్ని పరిశోధనాతత్త్వంతో ఆవిష్కరించడమేగాక, సమయానుకూలంగా

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2025

చారిత్రక, భౌగోళిక అంశాలను వెల్లడించడం కపిలవాయిగారి జ్ఞానానికి నిదర్శనం. చారిత్రక, సాహిత్య అంశాలను వేద పురాణ కాలంనుండి గ్రహించి ఆ అంశాలు కవుల రచనాంశాలకు సమన్వయించడం వారికే చెల్లింది.

పీఠిక రాయడమంటే కేవలం రచనాకర్తల ముఖస్తుతి, అభినందనలే కాదు అనే సత్యం లింగమూర్తి పీఠికల వల్ల తెలుస్తుంది.

పీఠికలనేవి రచనాకారుడి సాహిత్య విశేషాలను రచనా విశేషాలను తెలుపుతాయి. అంటే పాఠకుడికి రచనను సంక్షిప్తంగా పరిచయం చేస్తాయి. దానివల్ల పాఠకుడికి పుస్తకాన్ని చదివేముందు ఒక అవగాహన కలుగుతుంది. పుస్తక రచయితను అతను అర్థం చేసుకుంటాడు. అలాగే పీఠిక రాసిన వ్యక్తి ప్రదర్శించిన తీరును పాఠకుడు అర్థం చేసుకుంటాడు.

ఒక్కోసారి రచయిత పాఠకుడికి పరిచయం లేకపోయినా పీఠిక రాసిన వ్యక్తి వల్ల ఆ పుస్తకాన్ని చదవడానికి ఆసక్తి చూపుతాడు. అంటే గొప్ప సాహితీవేత్త ఈ పుస్తకానికి పీఠిక రాసాడు అంటే ఆ రచన ఎంతగొప్పదో అనేస్థాయిలో పాఠకుడు ఉంటాడు. కనుక పీఠికలు పాఠకుడికి స్నేహితుడిగా ఉంటాయి. రచనను చదివి అర్థం చేసుకోవడానికి 'పీఠిక' పాఠకుడికి చిన్న కరదీపిక.

తెలుగు సాహిత్యంలో 'పీఠికలు' గొప్ప స్థానాన్ని పొందాయి. డా. కపిలవాయి పీఠికలు కూడా గొప్ప స్థానాన్ని నిలబెట్టుకున్నాయి.

**ఉపయుక్త గ్రంథాలు**

1. కపిలవాయి లింగమూర్తి రచనలు. సం. కపిలవాయి అశోక్‌బాబు
2. కపిలవాయి పీఠికలు (డిసెంబర్, 2018) – సం. కపిలవాయి అశోక్‌బాబు, వాణి ప్రచురణలు, నాగర్ కర్నూల్
3. తెలుగు పీఠిక (1990) – డా. చంద్రశేఖర రెడ్డి – ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాద్
4. వేటూరి ప్రభాకర శాస్త్రి పీఠికలు (2012) – శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయ పీఠం, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
5. ఆన్‌లైన్ కేంబ్రిడ్జ్ డిక్షనరీ
6. మహాప్రస్థానం – శ్రీశ్రీ – నవచేతన పబ్లిషింగ్‌హౌజ్, హైద్రాబాద్ – 1950, 2020
7. భీమేశ్వరపురాణం – డా. గుండవరపు లక్ష్మీనారాయణ – ఫాలాక్ష ప్రచురణ, గుంటూరు.
8. కళాపూర్ణోదయం – మల్లాది సూర్యనారాయణశాస్త్రి – 1999, భువన విజయము పబ్లికేషన్స్, విజయవాడ–2004

**(మార్చి 31 జన్మదినం సందర్భంగా వ్యాస నివాళులు)**

❖ ❖ ❖ ❖ ❖

# మా నాయిన !

**బాలాజీ పోతుల**, నారాయణఖేడం, ఫోన్ : 817 928 3830

మా జీవితానికి పట్టుకొమ్మయ్యిందు మా నాయిన,
దిగులు దివిటీలార్పేసి దివ్యంగ బతికిందు మా నాయిన.
సత్తువ ఉడిగించిన రోగంతోటి,
సగం జీవితాన్నే ఈదొచ్చిందు మా నాయిన.

ఎవరికీ దోక చేయని మా నాయినకి,
ఆ దేవుడెట్లా ఈ రోగం దెచ్చెనో?
రోగమొచ్చి రోడ్డు మీద పడి,
బొక్కలన్నీ తుక్కు తుక్కు అయ్యి,
పానంల పానం లేకుంట అయితుందు మా నాయిన.

ఒకసారి తిట్టీ, మల్ల మెచ్చుకోవాలనంటే,
తన మనుసుని కొడవలితోని కోసినట్టనిపిస్తదనో ఏమో,
నేలని చూస్తూ, నింగిని మెచ్చుకుంటడు మా నాయిన.

పుట్టినింటికి అక్కజెల్లెళ్లొస్తే,
ఆళ్ళ కంట్లల్ల కంటితడి అయితడు మా నాయిన.
అయిషిల ధ్వజస్తంభం లెక్కుండే మా నాయిన,
ఈరోజు ఎండిన తొగరి కట్టె అయ్యిండంటే,
నా మనుసు గడ్డపార గాట్లతోని కోసినట్టయితుంది.

దారెంట ఇశపు నాగులు పన్నయన్నా సరే,
ఆ తొవ్వల్నే నడుసుకుంట పోయే తత్వం మా నాయనది.
సావుకు భయపడని మా నాయినని చూస్తే,
మళ్ళ సచ్చి మా నాయినకే పుట్టాలన్పిస్తది.

న్యూస్ పేపర్లు కొన్కచ్చి,
నా నెత్తిల సదువయ్యిందు మా నాయిన.
నా చేతి రాతయ్యిందు మా నాయిన!
నా నోటి కూతయ్యిందు మా నాయిన!
అన్నీ అయిన మా నాయిన,
రోగం లేకుంట అయితే ఎంత బాగుండో!


ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (35) హైదరాబాద్ మార్చి : 2025

# తెలంగాణ సాహిత్య చరిత్రలు – పరిచయం

**కావలి రాఘవేందర్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 97040 88716

**పరిచయం**

కవులు, రచయితలు రాసిన సాహిత్యాన్ని ఆయా కాలాలలోని క్రమ పరిణామాలను 'సాహిత్య చరిత్రలు' తెలియజేస్తున్నాయి. తెలుగు సాహిత్య చరిత్రలు మూడు శతాబ్దాలకు పైగా చరిత్రను కలిగి ఉన్నాయి. అందులో దాదాపు 1000 సంవత్సరాల కాలానికి పైగా సాహిత్యాంశాలు పొందుపరచబడి ఉన్నాయి. ఆయా సాహిత్య చరిత్రలలో అన్ని అంశాలను పొందుపరచలేదు. కొందరు కొన్ని అంశాలకు ప్రాధాన్యతను ఇస్తే, మరికొందరు మరికొన్ని అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. తెలుగు సాహిత్య చరిత్ర నిర్మాణం 19వ శతాబ్దం నుండి ప్రారంభం అయింది. మొట్టమొదట తెలుగు కవులను ఆంగ్ల భాషలో రచించిన **"దక్కన్ కవుల చరిత్ర"** అనే గ్రంథంలో కావలి వెంకట రామస్వామి పరిచయం చేశారు. తెలుగు భాషలో వెలువడిన మొట్టమొదటి సాహిత్య చరిత్ర **'కవిజీవితములు'.** దీనిని గురజాడ శ్రీరామమూర్తి రచించారు. 'కవి జీవితములు' గ్రంథంలో తెలుగు కవులను పరిచయం చేశారు.




ఈ మూడు శతాబ్దాలలో తెలుగు సాహిత్యంలో దాదాపు 42కి పైగా సాహిత్య చరిత్రలు వెలువడ్డాయి. ఈ సాహిత్య చరిత్రలలో తెలంగాణ కవులకు సంబంధించిన సమాచారాన్ని కొందరు స్వల్పంగా వివరిస్తే, కొందరు విస్మరించిన సందర్భాలు ఉన్నాయి. ఆంధ్ర ప్రాంతంలో పునరుజ్జీవన యుగంలో చరిత్ర, సాహిత్య చరిత్రలో కవులు, కావ్యాల గురించి ఎంతో కృషి జరిగింది. మరచిపోయిన, మరుగునపడ్డ సాహిత్య చరిత్రను, కవులను, సాహిత్యాన్ని పరిశోధించి వెలికి తీశారు. చర్చలు జరిపి వ్యాసాలు, గ్రంథాలు రాశారు. పునరుజ్జీవన కాలంలో తెలంగాణలో ఉన్నటువంటి సంస్కృతిని, సాహిత్యాన్ని, కవులను పట్టించుకోలేదు. తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రాచీన తెలంగాణ కవులను పట్టించుకోకుండా కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు చెందినవారిని కవులుగా ప్రకటించుకున్నారు.





ఈ అణిచివేత, నిర్లక్ష్యాన్ని ధిక్కరించిన తెలంగాణ సమాజం తన సాహిత్య చరిత్రను తానే నిర్మాణం చేసుకునే ఒరవడిని ప్రారంభించింది. అందులో భాగంగా అనేక సదస్సులు, సమావేశాలు నిర్వహించి అనేక వ్యాసాలు, గ్రంథాల రూపంలో సాహిత్య చరిత్రను లిఖించుకుంది. ఇప్పటివరకు 16కు పైగా తెలంగాణ సాహిత్య చరిత్ర గ్రంథాలు వెలువడ్డాయి. ఇవన్నీ సాహిత్య చరిత్ర, వ్యాస సంపుటి, వ్యాస సంకలనాలు, జిల్లా సాహిత్య చరిత్రలు, సంస్థానాల సాహిత్య చరిత్ర పేర్లతో వెలువడ్డాయి.

**తెలంగాణ సాహిత్య చరిత్రలు**

**1. శ్రీ విశ్వేశ్వర తరంగిణి – వరంగల్ – 2008–2010**

'శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ మరియు పి.జి. కళాశాల' వరంగల్ వారు 2008, 2009, 2010 సంవత్సరాలలో ఆచార్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, సాహిత్యకారులతో రాష్ట్రస్థాయి సదస్సులు నిర్వహించారు. 2008 సెప్టెంబర్ 17న నిర్వహించిన సదస్సులోని పత్రాలను **'తెలంగాణ ప్రాచీన సాహిత్యం (1900 వరకు)'** అనే శీర్షికతో 2009లో ముద్రించారు. 2009 సెప్టెంబర్ 9న నిర్వహించిన సదస్సులోని పత్రాలను **'తెలంగాణ ఆధునిక సాహిత్యం (1900–1956 వరకు)'** శీర్షికతో 2010లో ముద్రించారు. 2010 సెప్టెంబర్ 25న నిర్వహించిన సదస్సులోని పత్రాలను **'తెలంగాణ సమకాలీన సాహిత్యం(1956–2010)'** శీర్షికతో 2011లో ముద్రించారు. ఈ సాహిత్య చరిత్ర గ్రంథాలు అన్నీ యల్లంభట్ల నాగయ్య సంపాదకత్వంలో వెలువడ్డాయి. వీటిలో 2010 కాలం నాటికి ఉన్న తెలంగాణ 10 జిల్లాలను కేంద్రంగా ఎంచుకున్నారు. ఆయా జిల్లాలలో



ఉన్న ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యం, సమకాలీన సాహిత్య కాలాలలో ఉన్న సాహిత్య అంశాలను ఆయా జిల్లాల పేర్లతో మూడు వ్యాస సంకలనాలుగా తెలంగాణ సాహిత్య చరిత్రను ప్రచురించారు.

**2. ముంగిలి (తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్ర)-2009**

ఈ సాహిత్య చరిత్ర గ్రంథాన్ని సుంకిరెడ్డి నారాయణరెడ్డి రచించారు. ఈ గ్రంథం 2009వ సంవత్సరంలో తొలిసారిగా ముద్రించబడింది. అనంతరం తెలుగు అకాడమీ, హైదరాబాద్ వారు 2016వ సంవత్సరంలో ముద్రించారు. ఇందులో తెలుగు సాహిత్య చరిత్రలో కనుమరుగైన తెలంగాణ కవులందరి వివరాలు పొందుపరచబడ్డాయి. "ముంగిలి" గ్రంథంలో 486 మంది కవులను, రచయితలను గురించి వివరించారు. ఈ గ్రంథాన్ని ఎనిమిది అధ్యాయాలుగా రాజవంశాల పేర్లతో విభజించారు. ఈ గ్రంథాన్ని తెలంగాణ కవుల విషయ సూచికగా చెప్పవచ్చు. ఈ సాహత్య చరిత్ర గ్రంథాన్ని ఆదిమయుగం, శాతవాహనయుగం, శాతవాహన అనంతర యుగం – విష్ణుకుండినులు, చాళుక్య యుగం (బాదామి చాళుక్యులు, రాష్ట్రకూటులు – వేములవాడ చాళుక్యులు – కల్యాణీ చాళుక్యులు), కాకతీయ యుగం, పద్మనాయక యుగం, కుతుబ్‌షాహీ యుగం, అసఫ్‌జాహీలు – సంస్థానాల యుగంగా విభజించారు. ఆయా యుగాలలోని కవుల రచనలు, కాలం, ప్రాంతం వంటి వివరాలతో పాటు కొన్ని గ్రంథాలలోని పద్యాలను కూడా పొందుపరిచారు పొందుపరిచారు.

**3. తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర – 2015**

తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథాన్ని ముదిగంటి సుజాతారెడ్డి రచించారు. దీనిని తెలంగాణ సారస్వత పరిషత్తు వారు 2005లో ముద్రించారు. ఇందులో తెలంగాణ సాహిత్యచరిత్ర ఆరంభ, వికాసాలను, ఆధునిక కాలం వరకు వచ్చినటువంటి సాహిత్య చరిత్రలోని ప్రముఖ అంశాలను పరిచయం చేశారు. ఆరంభం, వేములవాడ చాళుక్యయుగం, కాకతీయుల యుగం, రాచకొండ పద్మనాయకుల యుగం, కుతుబ్‌షాహీల యుగం, అసఫ్‌జాహీల యుగం, విశాలాంధ్ర యుగంగా విభజించారు. ఆయా యుగాలలోని తెలంగాణ చరిత్ర, సాహిత్యానికి చెందిన ప్రముఖ అంశాలను పొందుపరిచారు. ఈ అంశాలతో పాటు తెలంగాణ కథ, నవల, సాహిత్య విమర్శ, తెలంగాణ జానపద సాహిత్యం వంటి ప్రక్రియల గురించి చర్చించారు.

**6. తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర – 2015**

ఈ గ్రంథాన్ని ఉన్నం వెంకటేశ్వర్లు, పడాల జగన్నాథరావు నియోగి ఆధ్వర్యంలో 2015లో ఉన్నం బ్రదర్స్ పబ్లికేషన్స్ ప్రచురించింది. దీనిలో తెలంగాణ ఉద్యమం, తెలంగాణ విద్య అనే శీర్షిక క్రింద సమగ్రంగా తెలంగాణ సామాజిక, రాజకీయాంశాలను పేర్కొన్నారు. 'ప్రాచీన కవులు' అనే శీర్షికతో తెలుగు సాహిత్యంలో గల తెలంగాణ ప్రాచీన కవుల గురించి చర్చించారు. ఆధునిక కవులలో అగ్రగణ్యులైన సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ, దాశరథి వంటివారితో మొదలుకొని చెరివిరాల బాగయ్య వరకు 76 మంది కవులను పేర్కొన్నారు.

**7. తెలంగాణ సాహిత్య వికాసం (ఆధునికత వైపు సొంత అడుగులు 1900–1940) – 2015**

ఈ గ్రంథాన్ని కె. శ్రీనివాస్ రచించారు. దీనిని 2015లో తెలంగాణ ప్రచురణలు అనే సంస్థ ప్రచురించింది. ఈ గ్రంథంలో సాహిత్యం కన్న తెలంగాణ ప్రాంతం రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంఘిక అంశాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వబడింది. ఈ గ్రంథాన్ని రచయిత ఏడు అధ్యాయాలుగా విభజించారు. తెలంగాణ ప్రాథమికాంశాలు, హైదరాబాద్ రాజ్యం, ఆధునిక తెలంగాణ – తొలి అడుగులు, సమకాలీన బ్రిటిష్ ఆంధ్ర వికాసోద్యమాలు సాహిత్యం, ఆత్మాభిమాన ప్రకటన – గోలకొండ కవుల సంచిక, వికాసం నుంచి విజృంభణ భాగాలలో తెలంగాణ చరిత్ర, రాజకీయ, సాహిత్య అంశాలను ఈ గ్రంథంలో చర్చించారు.


**8. తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం – 2015**

ఈ గ్రంథాన్ని ఎస్.వి.రామారావు రచించారు. 2015లో తెలంగాణ సాహిత్య పరిశోధన కేంద్రం దీనిని ప్రచురించింది. ఈ రచనను మొత్తం 19 భాగాలుగా విభజించారు. మొదటినుండి 12వ అధ్యాయం వరకు శతాబ్దాల వారిగా సాహిత్యాన్ని, కవుల రచనలను పేర్కొన్నారు. సమకాలీన సాహిత్యం పేరుతో కవిత్వం, కథానిక, నవల, నాటకం, బాలసాహిత్యం, పరిశోధన – విమర్శ, వచన సాహిత్యం అనే ప్రక్రియల గురించి, రచనలు, రచయితల గురించి వివరించారు. 'అనుబంధం' అనే శీర్షికలో వివిధ శాసనాలను గురించి వివరాలను జతచేశారు. 'సూచికలు' అనే విభాగంలో ప్రాచీన కవుల నుండి ఆధునిక రచయితల, రచయిత్రుల అకారాది క్రమాన్ని, వారు పొందిన పురస్కారాలను పేర్కొన్నారు. ఈ గ్రంథంతో పాటు వనపర్తి జిల్లా సాహిత్య చరిత్ర గ్రంథాన్ని 2015లో రచించారు.

**9. తెలంగాణ ఆధునిక సాహిత్యచరిత్ర – 2016**

రవ్వా శ్రీహరి సంపాదకత్వంలో సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కాశీం, కాసుల ప్రతాపరెడ్డి, యాకూబ్, సంగిశెట్టి శ్రీనివాస్ వంటి రచయితలతో తెలుగు అకాడమీ 2016లో **"తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర"** అనే వ్యాస సంపుటిని పుస్తకాన్ని వెలువరించింది. దీనిలో ఏడు వ్యాసాలున్నాయి. తెలంగాణ ఆధునిక కవిత్వం – ప్రారంభం – వికాసం, తెలంగాణ కథ, తెలంగాణ నవల, తెలంగాణ నాటకం, తెలంగాణ పాట, తెలంగాణ సాహిత్య విమర్శ, తెలంగాణ భాష అంశాలపై వ్యాసాలు ఉన్నాయి. ఇప్పటివరకు వచ్చిన తెలుగు సాహిత్య చరిత్రలలో తెలంగాణ ప్రాంత సాహిత్యానికి, కవులకు తగినంత గుర్తింపు, ప్రాధాన్యం లభించలేదు. ఆ అభిప్రాయం నుంచి తెలుగు

సాహిత్యాన్ని కొత్తగా చూపించే ప్రయత్నం ఈ గ్రంథం ద్వారా జరిగింది. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చిన కవులను, కావ్యాలను ప్రత్యేకంగా వేరుచేసి, వాటి ఔన్నత్యాన్ని ఈ గ్రంథంలో తెలియజేసారు.





**11. సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర – 2017**

ఎస్. వి రామారావు తెలుగు సాహిత్యాన్ని, కాలక్రమ పద్ధతిలో, శతాబ్దాల వారీగా, ప్రాంతీయ విభాగంగా విడదీస్తూ 'సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర' అనే గ్రంథాన్ని రచించారు. ఇది 2017లో ముద్రింప బడింది. ఇందులో ప్రాంతీయవిభాగం పేరుతో తెలంగాణ సాహిత్యాన్ని, తెలుగు సాహిత్యాన్ని వేరు వేరుగా రాశారు. సాహిత్య చరిత్ర రచనలో ఇది నూతన విధానం అని చెప్పవచ్చు. ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకు తెలంగాణ, తెలుగు సాహిత్య అంశాలను పేర్కొన్నారు. అంతే కాకుండా కవయిత్రుల, కవుల సూచికలను ప్రత్యేకంగా పొందుపరిచారు.




**12. మన తెలుగు సాహిత్య చరిత్ర – 2018**

"మన తెలుగు సాహిత్య చరిత్ర" గ్రంథాన్ని ముదిగంటిసుజాతారెడ్డి చారిత్రక, సామాజిక నేపథ్యంలో రచించారు. వీరు మొదట 'ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్ర'ను – 1989లో రచించారు. తర్వాత కొన్ని మార్పులతో ఈ గ్రంథాన్ని 2018లో మన తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథంగా తీసుకవచ్చారు. వివిధ విశ్వవిద్యాలయాలలో డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల పాఠ్య గ్రంథాల తయారీ ప్రణాళికలో భాగంగా ఈ గ్రంథాన్ని తెలుగు అకాడమీ ప్రచురించింది. "మన తెలుగు సాహిత్య చరిత్ర" గ్రంథాన్ని ముదిగంటి సుజాతారెడ్డి 19 భాగాలుగా వర్గీకరించారు. ఈ వర్గీకరణ మొత్తం చారిత్రక, సామాజిక నేపథ్యాల ఆధారంగా చేయబడింది. ఇందులో సంస్కృత కవులకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఈ రచనను తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం, ఆరంభం, పూర్వయుగం, జైనకవుల యుగం, నన్నయ యుగం, శివకవుల యుగం, తిక్కన యుగం, ఎర్రన యుగం, శ్రీనాథ యుగం, శ్రీకృష్ణదేవరాయల యుగం, కుతుబ్ షాహీల యుగం, రఘునాథ నాయక యుగం, వీరేశలింగం యుగం, కృష్ణశాస్త్రి యుగం, శ్రీశ్రీ యుగం, అభ్యుదయానంతర ధోరణులు–వాదాలు, విప్లవ వాదం, విప్లవానంతర ధోరణులు– అస్తిత్వ వాదాలు, ప్రపంచీకరణం – వ్యాపార యుగం – అత్యాధునిక ధోరణులుగా విభజించి ఆయా కాలాలలోని సాహిత్య అంశాలను వివరించారు. ఈ "మన తెలుగు సాహిత్య చరిత్ర"లో కవుల పేర్లతో యుగ విభజన చేశారు.





**13. సాహిత్య తెలంగాణ – 2020**

సాహిత్య తెలంగాణ శీర్షికతో ద్వాదశి నాగేశ్వర శాస్త్రి 2020లో గ్రంథాన్ని వెలువరించారు. ఇందులో తెలంగాణ సాహిత్యానికి చెందిన 37 వ్యాసాలు పొందుపరచబడి ఉన్నాయి.

**14. తెలంగాణ సాహిత్య అకాడమీ**

తెలంగాణ సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురావడంలో తెలంగాణ సాహిత్య అకాడమీ గణనీయమైన కృషిని అందిస్తుంది. తెలుగు సాహిత్యంలోని అన్నీ ప్రక్రియలను నూతనంగా ముద్రణలోకి తెచ్చే ప్రయత్నం చేస్తుంది. అదే బాటలో మరుగునపడిపోయిన తెలంగాణ సాహిత్య చరిత్రను పునర్నిర్మాణం చేసే ప్రయత్నాన్ని ప్రారంభించింది. అందులో భాగంగా **'తెలంగాణ తేజోమూర్తులు' (2017), 'శాతవాహ నుల నుండి కాకతీయుల వరకు తెలంగాణ' (2017) చరిత్ర,** సంస్కృతి, భాష, సాహిత్యం, **'కాకతీయుల నుండి అసఫ్‌జాహీల వరకు తెలంగాణ' (2018)** చరిత్ర, సంస్కృతి, భాష, సాహిత్యం అనే పేర్లతో జి. అరుణకుమారి, మల్లెగోడ గంగాప్రసాద్ సంపాదకత్వంలో సాహిత్య చరిత్ర గ్రంథాలను వెలువరించారు. తెలంగాణలో ఉన్న 33 జిల్లాల సాహిత్య చరిత్రను ప్రత్యేకంగా ముద్రించే క్రమంలో అన్ని జిల్లాల సాహిత్య చరిత్ర గ్రంథాలను వెలువరించారు. **'తెలంగాణ సమగ్ర సాహిత్యచరిత్ర'** పేరుతో జూలూరు గౌరీ శంకర్ సంపాదకత్వం లో 2022లో గ్రంథాన్ని వెలువరించారు. ఈ గ్రంథంలో ప్రాచీన సాహిత్యం శీర్షికతో 19వ్యాసాలు, ఆధునిక సాహిత్యం శీర్షికతో 30 వ్యాసాలు ముద్రించబడ్డాయి.



**15. తెలంగాణ సారస్వత పరిషత్తు**

తెలంగాణ సాహిత్యానికి, సాహిత్య చరిత్ర నిర్మాణానికి విశేషమైన కృషిని అందిస్తున్న సంస్థ తెలంగాణ సారస్వత పరిషత్తు. ఈ సంస్థ **'తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర'(2015)** గ్రంథాన్ని ముదిగంటి సుజాతారెడ్డి సంపాదకత్వంలో వెలువరించింది. **'తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం'(2013)** వంటి సాహిత్య చరిత్ర గ్రంథాలను ముద్రించింది. తెలంగాణ సాహిత్యానికి చెందిన అనేక గ్రంథాలను ఈ సంస్థ ప్రచురించి వెలుగులోకి తెచ్చింది. సారస్వత పరిషత్తు తెలంగాణ రాష్ట్రంలోని 20 జిల్లాల సాహిత్య చరిత్రలను వెలుగులోకి తెచ్చింది. ప్రస్తుతం మిగిలిన జిల్లాల సాహిత్య చరిత్రలను ముద్రించే పనిలో నిమగ్నమై ఉంది.

**16. నీల్ కమల్ ప్రచురణ సంస్థ**

నీల్ కమల్ ప్రచురణ సంస్థవారు **'తెలంగాణ వైతాళికులు', 'అక్షర మూర్తులు'** అనే సంకలనాలలో తెలంగాణ రచయితల పరిచయ వ్యాసాలను ముద్రించారు. అదే విధంగా **'తెలంగాణ సాహిత్య చరిత్ర'** పేరుతో సంప్రదాయ సాహిత్యం, ఆధునిక సాహిత్యం, వివిధ సాహిత్య ప్రక్రియలు అను మూడు వ్యాస సంపుటాలను ప్రచురించారు.

**ముగింపు**

ఈ సాహిత్య చరిత్ర గ్రంథాలు మాత్రమే కాకుండా అనేక వ్యాసాలు, సంస్థాన సాహిత్యచరిత్ర గ్రంథాలు వెలువడ్డాయి. 1985లో వెలువడిన **'చరిత్రకెక్కని చరితార్థులు'** గ్రంథంలో 22 మంది తెలుగు కవులను, 12 మంది సంస్కృత కవులను పరిచయం చేశారు. 1992లో వెలువడిన **'తెలుగు సాహిత్యోద్ధారకులు'** అనే గ్రంథంలో ఆరుగురు పరిశోధకుల సమగ్ర చరిత్రను అందించారు. 19వ శతాబ్ద కాలాన్ని **'నవోదయము'**గా భావిస్తూ బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి 1962లో లఘు గ్రంథాన్ని ప్రచురించారు.

మల్యాల దేవీప్రసాద్ 1969లో **'మెదకు మండల సాహిత్య చరిత్ర'**ను ముద్రించారు. కోవెల సంపత్కుమారాచార్య 1970లో **'మన పండితులు-కవులు-రచయితలు'** అనే పేరుతో వరంగల్ ప్రాంతానికి చెందిన 25 మంది కవుల సమగ్ర చరిత్రను వెలుగులోకి తెచ్చారు. కేశవ పంతుల నరసింహశాస్త్రి 1975లో రచించిన **'సంస్థానాలు - సాహిత్య పోషణ'** అనే గ్రంథంలో సంస్థానాల సాహిత్యసేవను వివరించారు. శ్రీరంగాచార్య 1994లో ప్రకటించిన **'నల్లగొండ జిల్లా కవులు - పండితులు'** అనే గ్రంథంలో ప్రాచీన, ఆధునిక యుగాలకు చెందిన 374మంది నల్లగొండ జిల్లా రచయితల వివరాలు పొందు పరచబడ్డాయి. వరంగల్ జిల్లా రచయితల వాఙ్మయ జీవిత సూచికను టి. శ్రీరంగస్వామి రూపొందించారు. ఎస్.వి. రామారావు 2010లో వెలువరించిన **'పాలమూరు సాహితీ వైభవము'** అనే గ్రంథం ప్రాచీన కవులచరిత్రను వివరిస్తుంది. 2012లో **'పాలమూరు ఆధునిక యుగకవుల చరిత్ర'**ను వెలువరించారు. బి.ఎన్ శాస్త్రి రచించిన **మహబూబ్ నగర్, నల్గొండ, ఆదిలాబాద్ జిల్లాల సాహిత్య చరిత్ర** గ్రంథాలు 2017లో ముద్రించబడి మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాస పత్రిక ద్వారా వెలుగులోకి వచ్చాయి.

**ఆధార గ్రంథాలు**

1. అరుణ కుమారి, జి., గంగాప్రసాద్, మల్లెగోడ (సం). 2016. ప్రాచీన తెలుగు సాహిత్యం పరిణామ వికాసం. హైదరాబాద్: సెంటర్ ఫర్ క్లాసికల్ లాంగ్వేజెస్ - తెలుగు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్.
2. కాశీం. 2015. తెలంగాణ సాహిత్యం. హైదరాబాద్: సూర్య గ్రాఫిక్స్.
3. తెలంగాణ సాహిత్య అకాడమి. 2022. తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర. హైదరాబాద్.
4. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. 2022 (రెండవ ముద్రణ). 'ముంగిలి' తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్ర. హైదరాబాద్: తెలుగు అకాడమి.
5. ప్రతాపరెడ్డి, సురవరం. 2021. ఆంధ్రుల సాంఘిక చరిత్ర. విజయవాడ: పల్లవి పబ్లికేషన్స్.
6. రాఘవరెడ్డి, గార్లపాటి. 1936. రాఘవరెడ్డి రచనలు. వరంగల్.
7. రామరాజు, బి. 1985. చరిత్రకెక్కని చరితార్థులు (విస్మృత కవులు - కృతులు). హైదరాబాద్: పుష్పా ప్రింటర్స్.
8. రామారావు, ఎస్వీ. 2017. సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర. హైదరాబాద్: ఎస్. స్వయం ప్రభ పబ్లిషర్స్.
9. రామారావు, ఎస్వీ. 2018. 20 వ శతాబ్ది తెలుగు సాహిత్య చరిత్ర. హైదరాబాద్: ఎస్. స్వయం ప్రభ పబ్లిషర్స్.
10. శ్రీనివాస్, సంగిశెట్టి. 2018. దుర్బిణి. హైదరాబాద్: తెలుగు అకాడమి.
11. సత్యనారాయణ రెడ్డి, ఎ. (ప్ర. సంపా.). 2018. మన తెలుగు సాహిత్య చరిత్ర. హైదరాబాద్: తెలుగు అకాడమి.
12. సిధారెడ్డి, నందిని. 2018. కాకతీయుల నుండి అసఫ్ జాహిల వరకు తెలంగాణ (చరిత్ర, సంస్కృతి, భాష, సాహిత్యం). హైదరాబాద్: తెలంగాణ సాహిత్య అకాడమి.
13. సుజాతారెడ్డి, ముదిగంటి. 2015. తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర. హైదరాబాద్: సాయి లిఖిత ప్రింటర్స్.



# జైలు సాహిత్యంలో వ్యక్తి వ్యవస్థ

**కొల్లూరి నాగరాజు,** పరిశోధక విద్యార్థి, తెలుగు విశ్వవిద్యాలయం. ఫోన్ : 86885 31403

**"ఎందుకయ్యా వుంచినావు బందిఖానలో రామయ్య, రామయ్య"** అనే పాట భావన బాహ్యంలో హాస్యంగా అనిపించినా! అంతరంగికంగా పరిశీలిస్తే మనఃసంఘర్షణ, మనిషి తనకు తాను విధించుకున్న ఒంటరితనానికి తన ఊరు, తన వారు అందరికీ దూరంగా చావలేక బ్రతుకే నరకం. మరో మాటలో చెప్పాలంటే చావు కోసం ఎదురు చూస్తూ అనుభవించే నరకం. ఇలా చెప్పుకుంటూ పోతే బలవంతుడు, భగవంతుడు భూమిపై కారాగారంలో జన్మించాడు. అదే దశావతారాలలో కృష్ణావతారంలో అంటే జన్మించిన స్థానం ఏదైనా అది జన్మంతా భగవంతుడైన దాని ప్రభావం ఉంటుందనటానికి ఈనాటికీ ప్రాచుర్యంలో ఉన్న మాట శ్రీకృష్ణ జన్మస్థానం అని కారాగారానికి పెట్టుకున్న పేరు.

మానవ సమాజంలో వ్యక్తుల ప్రవర్తన నైతిక, అనైతికల మధ్య నలుగుతున్నప్పుడు నైతికత, గౌరవానికి కీర్తికి ప్రాతినిధ్యం వహిస్తుంది. అనైతిక నేరాలకు దగ్గర చేస్తుంది. నేరాన్ని విశ్లేషిస్తూ సామాజికవేత్త "మై కేవర్" గారు **"మంచి చెడుల మేలు కలయిక సమాజం"** అంటూనే నేరం చేసిన ప్రవృత్తిని లోతుకంటా పరిశీలిస్తూ A criminal was not form he was made by the society అంటాడు. అలాగే సమాజ ప్రభావం పరిస్థితులు వ్యక్తిగత ఆవేశపూరిత భావాలు, బలహీనతలు మొదలైనవి మనిషిని నేరస్తునిగా మార్చగలవనటానికి అనేక సాక్షాలు కోకొల్లలుగా కనిపిస్తాయి. మనిషి నైజం ఇడ్, అహం, ఆగ్రహంల మధ్య కొట్టుమిట్టాడుతుంది. మనిషి అంతరంగాన్ని మరింత సంక్షోభానికి గురిచేస్తాయి. ఈ కారణంగా మనిషిలో బలహీనతలు బయటికి వస్తాయి. సరిగ్గా అప్పుడే వ్యసనాలకు మనిషి బానిస అవుతాడు. సామాన్యంగా కుటుంబంలో ప్రేమలకు దూరమైన వారిలో అణగారి ఉన్న వారిలో మనోభావన వారిని ఒంటరిని చేసినప్పుడు, వారిలో క్రోధం పెరుగుతుంది. దానితోపాటు తనకు దక్కనిది ఇతరులకెవ్వరికీ దక్కకూడదన్న భావనలు క్రమంగా ప్రేమ, అనుబంధ ఆప్యాయతలకు దూరమైన వారిని నేరాలకు దగ్గర చేస్తాయి.

ప్రాథమికంగా వ్యక్తి సమాజంలో పుట్టినప్పుడే ప్రాథమిక స్వభావాన్ని పొందుతాడు. గౌరవం కష్టపడే తత్త్వం చిన్నప్పటినుండి అలవర్చుకుంటే ఆర్జిత అంతస్తు ద్వారా ఉన్నత స్థితిని చేరుకుంటాడు.

ఆ లెక్కకొస్తే కారాగారంలో జన్మించిన శ్రీకృష్ణుడు గీతాచార్యుడయ్యాడు. అంటే కాసేపు అసమాన్య అవతారునిగా, మన మధ్య ఉన్నవానిగా భావించి అధ్యయనం చేస్తే సామాన్య తత్త్వంలో **"శ్రీకృష్ణుడు అడుగడుగున గండాలైన ఎదురీదే బతికాడు"** అన్నది కవి వాక్కు.






అతడు గీతాచార్యుడుగా దర్శనీయం కావటానికి తోడ్పడిన హేతువులను దర్శింప చేస్తుంది. దాశరథి గారన్నట్లు **"శ్రీకృష్ణుడు కంసుని చెరసాలలో ఖైదీవై పుట్టావు. కాంతల కౌగిళ్ళలో ఖైదీవై నిలిచావు కడకు రాతి గుళ్ళల్లో ఖైదీవై వెలిచావు"** అన్న మాటలు శ్రీకృష్ణుని ఆజన్మ ఖైదీగా నిలబెడతాయి.

ఇక సామాజిక నేపథ్యంలో ఆలోచిస్తే కారాగార శిక్ష నేరస్తులకు పరివర్తన కోసం మాత్రమే సంచితమైంది. అలా కాకుంటే అతగాడు ఎక్కడున్నా ఒక్కటే.

ఇక సాహిత్య పరంగా పరిశీలించినప్పుడు జైలు సాహిత్యం అంటూ ప్రత్యేకంగా లేదు కానీ, ఆ దిశగా పరిశోధన చేసి ఫలితాలందించిన లభ్యసమాచారం గమనిస్తే, నేరస్తుల అంతరంగ సంఘర్షణ వెలుగులోకి వస్తే ఏ ప్రక్రియలోనైనా చోటు చేసుకుంటే దాన్ని సాహిత్యం అనక తప్పదు. ఎందుకంటే జైలులో శిక్ష అనుభవించేవారు సైతం తన సృజనకు ప్రాధాన్యమిస్తారు.

సాధారణంగా సాహిత్య సృజనకారులు రెండు విధాలను అనుసరిస్తారు. అవి : 1.స్వానుభవం 2. పరానుభవం. స్వానుభవం అంటే నేరాలు కానీ కారాగారవాస స్థితి ఏర్పడినప్పుడు ఆ కారాగారాల స్థితి ఖైదీల ఘర్షణ ప్రధానంగా వారి ప్రక్రియ సృజనకు వస్తువు అవుతుంది.

జైలు సంబంధ సాహిత్యం ప్రధానంగా స్వీయ పర అనుభవాలు కథలవుతాయి. నవలలవుతాయి. వ్యాసాలవుతాయి. అయితే కవిత్వం పరంగా రావాల్సిన అంత సాహిత్యం రాలేదు. ఈ నేపథ్యంలో వట్టికోట ఆళ్వార్ స్వామి **'జైలు లోపల కథలు'** పేరుతో రాసిన కథా సంకలనం 2015లో ప్రథమ ముద్రణ పొందింది (ఆళ్వారు స్వామి

మరణాంతరం). ఇందులో ఆరు కథలు చోటు చేసుకున్నాయి. నిజానికి ఈ కథలను ఆళ్వార్ స్వామి 1946 – 51 మధ్యకాలంలో జైలులో రచించాడు. ముఖ్యంగా ఈ కథలు వారు జైలు శిక్ష అనుభవించే కాలంలో తోటి ఖైదీల జీవితాలను వారికి పడిన శిక్షలను చూసి చలించిపోయి వారి జీవితాలను వస్తువుగా తీసుకొని కథలు రాశారు. నెహ్రూ అన్నట్లు **"మన దేశంలో జైళ్ళలో శిక్ష అనుభవిస్తున్న వారిలో నూటికి 85% నేరప్రవృత్తి కలవారు కాదు. మిగిలిన 15% స్వభావతః నేరకాంఢ్రు కాదు. పరిస్థితులే వారిని నేరస్తులుగా మార్చాయి"** నిజంగా వారి (నెహ్రూ గారి)పై మాటలు ప్రపంచ సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని చెప్పినట్లు అనిపిస్తాయి.

జైలు సాహిత్యంలో ఏ ప్రక్రియ అయినా ఖైదీల మనస్తత్వాన్ని తరచి చూసినట్లుగా అనిపిస్తుంది. ఇందులో ప్రధానంగా రెండు పార్శ్వాలు కనిపిస్తాయి. అవి ఒకటి అనుభవ కోణం, రెండవది వారు బ్రతుకుతున్న కోణం. ఈ రెండు కోణాలు గత వర్తమానాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. ప్రధానంగా జైళ్ళలో ఖైదీల పరిస్థితి ఒకరకమైతే మరొక దిశలో వారి పూర్వస్థితి అనుబంధాల ఆలోచనలు ఆ ఖైదీలను స్థిమితం లేకుండా చేస్తాయి. బయట సమాజంలో ఉన్న సాటివారి ఛీత్కారాలు, అవహేళనలు, ఎత్తిపొడుపులు, పెత్తనంతో కూడిన అధికారం.

కుల వివక్షతలన్నీ కూడా చోటు చేసుకుంటాయి. ఖైదీలలో ఎక్కువ శాతం అరకోర చదువు చదివినవారైతే మిగిలిన వారు చదివిన జ్ఞానం ఒంట పట్టించుకొని ఏ ఎండకు ఆ గొడుగు పట్టేవారు ఉండటం ద్వారా దురదృష్టవశాత్తు మంచితనం ఉన్నవారు పైన పేర్కొన్న వారి ద్వారా అక్కడ ఉండే జైల్లో సైతం నరకం అనుభవించే వారు కనిపిస్తారు. (క్రీ॥శే॥ వేదగిరి రాంబాబు గారి మిత్రుల ద్వారా ఈ విషయం తెలుసుకోవడం జరిగింది).

ఇక సాహిత్య నేపథ్యంలో ఆళ్వారు స్వామి **'జైలు లోపల'** కథల సంపుటిలోని ఇందూరు జైలులో దాశరథి గారితో ఉన్న రోజుల్లో 1943–46 మధ్యకాలంలో (సంధికాలంగా) చెప్పవచ్చు. తోటి ఖైదీలతో పంచుకున్న మాటలకు కథాకృతి కలిగించారు. ఈ కథలు చదువుతుంటే జైలులలో ఖైదీల మనస్తత్వాలు కళ్ళకు కట్టినట్టు ఉంటాయి. సంభాషణలలో నాటకీయత, కథల్లో కథనం అన్ని ఏ కాలానివైనా పట్టితులను ఆకట్టుకుంటాయి. ఆ ఆరు కథల్లో జైల్లో ఉన్న ఖైదీల ఆవేదనలు, పూర్వ సంఘటనలు ఆ కథలు చేసే జ్ఞాపకాలు చదివిన పాఠకుడిని కంటతడి పెట్టిస్తాయి. మొత్తం ఆరు కథలకు వస్తువుల్లో స్వల్ప భేదాలున్న సంఘటనలు అన్నీ నేరానికి దారి తీసిన పరిస్థితులనే తెలియజేస్తాయి. ఏదేమైనా తెలుగు సాహిత్యంలో జైలు సాహిత్యం అంటూ ప్రత్యేకంగా ఏదీ లేదు. మనిషి ఆవేశ వర్తన దాని తాలూకు ఫలితాలు శిక్షకు గురిచేసినప్పుడు అతడు ఒంటరితనంలో తోటి ఖైదీలతో ఇమడలేక వాళ్ల గుర్తులు బాధిస్తుంటే వారు పడే వెతలు కథలవుతాయి. రాస్తే కావ్యాలవుతాయి. కవిత్వాలు అవుతాయి. ఇతరులు తెలుసుకొని తనకు తాను రాస్తే వ్యక్తిగతం, ఆ వ్యక్తి తాలూకు గతమే వర్తమానంలో ప్రక్రియాత్మక సాహిత్యం అవుతుంది.

**"ఇదే మనిషి మంచిగా మసలుకుంటే మమతానుబంధాల ప్రపంచం, నేరం చేసి శిక్ష అనుభవిస్తే అది చీకటి ప్రపంచం"** అని సినీకవి ఆచార్య ఆత్రేయ మాటలలో చెప్పాడు.

అదేవిధంగా ఈ మధ్య అంతర్జాల (జూమ్. 16.11.2024, శనివారం) సెమినార్లు జరిగినప్పుడు నిర్వహణ చేసిన తెలంగాణ సాహిత్య అకాడమీ వారు మరియు తెలుగు భాష చైతన్య సమితి సంయుక్తంగా కలిసి **"దాశరథి సాహిత్యం సమాలోచన"** డా. నందిని సిధారెడ్డి వక్తగా ప్రసంగిస్తూ దాశరథి కవిత్వం అతను జైలులో అనుభవించిన పరిస్థితులను దాశరథి చెప్పిన అగ్నిధారలో చోటు చేసుకున్న అంశాలను ప్రస్తావిస్తూ దాశరథి జైలులో ప్రవేశించేటప్పుడు అతని వయస్సు 20 ఏళ్ల యవ్వనం. అప్పుడు దాశరథి ఆకాశంలోకి తలెత్తి చూస్తే మేఘాలు అందమైన అమ్మాయిలుగా అవతరించి నన్ను కవ్వించేవి. తలదించి కిందికి చూస్తే జైలు బ్యారక్ ముందు తళతళ మెరుస్తూ కనిపిస్తూ మెరుస్తున్న ఖడ్గం తుపాకీ చెక్కి కవాతు చేస్తున్న భటుడు కనిపిస్తున్నాడు. వాణ్ణి భటున్ని నరికేసి లేదా వానిచే నరకబడి ఆకాశంలో కనిపించే మేఘ భామినులను చేరుకోవాలనిపించేది అని దాశరథి జైలు సాహిత్యం గురించి అభివర్ణించారు.

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సంఘటనలు మనిషి జీవితంతో ముడిపడి ఉంటాయి. ఏదేమైనా వ్యక్తి వ్యవస్థలో జీవించేప్పుడు సంయమనం పాటిస్తూ వివేకంతో విచక్షణతో మంచిని అనుసరిస్తూ నెగెటివ్ విషయాలకు దూరంగా ఉంటే నేరాలకు శిక్షలకు ప్రాధాన్యం ఉండదు. ఇది గుర్తించమని ప్రబోధం చేసేదే జైలు సాహిత్యం. ఇది మనిషి జీవితం చుట్టూ ఆవరించుకున్న దృక్కోణం.

**ఉపయుక్త గ్రంథాలు**

1. రాంబాబు, వేదగిరి. జైలు వ్యాసాలు (పరిశోధన), స్వీయ ప్రచురణ, హైదరాబాదు.
2. స్వామి రామానంద తీర్థ. హైదరాబాద్ రాష్ట్రంలో స్వాతంత్రోద్యమం
3. ఆళ్వార్ స్వామి, వట్టికోట. జైలు లోపల, నవచేతన ప్రచురణలు, హైదరాబాదు.
4. యోజన మాసపత్రిక ఆగస్టు 2024 సంచిక (స్వాతంత్ర్య ఉషోదయం), హైదరాబాదు.
5. మేరీ టేలర్. భారతదేశంలో నా జైలు–జీవితం, అనుప ప్రచురణ, హైదరాబాదు.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2025

# నీతి శాస్త్రము – తాళిపత్ర గ్రంథము

డా. గండ్ర లక్ష్మణ రావు, విశ్రాంతాచార్యులు ఫోన్ : 98493 28036

(గత సంచిక తరువాయి)

**ఆయుర్వేద కృతాభ్యాసో సర్వజ్ఞో ప్రియ దర్శినః**
**ఆయుశ్శీల గుణోపేత శైత్యం విధిష్యత –61**

(ఆయుర్వేద కృతాభ్యాసః సర్వేషాం ప్రియదర్శినః ఆర్యశీల గుణోపేత ఏషో వైద్యో విధీయతః).... అనే పాఠాంతరం కూడా ఉంది.

**పద్యానువాదం :**

**వైద్యశాస్త్రము నభ్యాస విధము నెరిగి**
**శాస్త్రవేత్తల పెద్దల సముఖమందు**
**వినయమును గౌరవమ్మును ప్రేమజూచు**
**ఆతడామృత హస్తుడై ఖ్యాతి నొందు**

అర్థం : కృతయుగం నుంచి అశ్వినీ దేవతలు అభ్యసించిన వైద్యశాస్త్రం యెవరైన అభ్యసించి వారి గుణం సకల గ్రంథాల సూక్ష్మం తెలిసి ఆయుష్షున్ను తత్వం తెలిసిన దేవ గురు పెద్దలను ప్రియంగా చూస్తూ ఆచారం కలవాడై అమృతహస్తం గలవాడు వైద్యుడనిన రీతి.

**పదవ పత్రము :**

**అపకారద్వితయోన శత్రూణాం శతృముద్ధరేత్**
**పాదలగ్న కరస్తేనాం కంటకేనైవ కంటక్ష – 62**

**పద్యానువాదం :**

**ఒకరు శత్రువైన నతని నోడ జేయ**
**అతని శత్రువు నొక్కని యండజేరు**
**పాదమందున ముల్లును పదిలముగను**
**పెరికి తీయగ వాడరే మరొక ముల్లు**


అర్థం : తనకు యెవ్వరు పగవారైనప్పుడు వొకతన్ని వశం జేసుకొని వీని చేత వాణ్ణి ఛేదించేది యట్లంటే తన కాలిముల్లు తనచేత మరియొక ముల్లున తీసినట్లేనని తెలిశేది.

**ప్రాజ్ఞో నియుజ్యతేకమాత్యానంతుసక్తారాజ్ఞో త్రయోగుణాః**
**యేన స్వర్గ నివాసశ్చ పుష్కలశ్చ ధనాగమః – 63**

పద్యానువాదం :

**ప్రతిభ గలవానికిని మంత్రి పదవి యివ్వ**
**మూడువిధముల రాజు సమ్ముదితుడగును**
**కలుగు సత్కీర్తి ధనధాన్యములను వృద్ధి**
**రాజు కాలాంతరమునయందు రాలిపోవ**
**నాకలోకము ప్రాప్తించు నదియు నిజము**

అర్థం : ప్రజ్ఞగలవాణ్ణి బుద్ధిమంతుడని ప్రధానిని చేసిన రాజు మూడు గుణాలచేత సంతుష్టుడు. కీర్తిని, ధనధాన్యమున్ను కాలాంతమున స్వర్గం సిద్ధించుననిన రీతి.



**శకటం పంచ హస్తేన దశహస్తేన వాజినం**
**హస్తి హస్తేషు దుర్జనో దూరవర్జయేత్ – 64**

(హస్తినం శతహస్తేన దేశత్యాగేన దుర్జనమ్ – చాణక్యనీతిలో ఉన్నది.

పద్యానువాదం :

**ఎడ్లబండి కైదగు చేతులెడము వలయు**
**అశ్వములకును పదిచేతులంత నెడము**
**మదకరికి వేయిచేతుల పిదప నుండు**
**దుర్జనుల కెప్పుడును బహు దూరముండు**

అర్థం : బండికి ఐదు చేతుల దూరం తొలగేది, గుర్రాలకు పది చేతులు తొలగేది, మదించిన ఏనుగుకు వేయి చేతులు కావలెనని తెలిసేది. చండాలుడైన దుర్బలులను దూరంగాను వర్జించేది.

**నదినాంచ నదీనాంచ శృంగీనాం శస్త్రపాణినాం**
**విశ్వాసో నోపపత్యం స్త్రీషు రాజకులేషుచ – 65**

( నదినాం శస్త్రపాణినాం నఖినాం శృంగినాం తథా
విశ్వాసో నైవ కర్తవ్యం స్త్రీషు, రాజకులేషుచ .. అనే పాఠాంతరమున్నది.)

పద్యానువాదం :

**పొంగిపొర్లెడు నదులను, పొడవు కొమ్ముల**
**లున్న జంతువులను, శస్త్రములున్న వాని**
**పెద్ద గోళ్ళ జీవుల, సిగ్గు విడిచినట్టి**
**స్త్రీల, రాజుల నమ్మగా మేలుగాదు**

అర్థం : వడిగబారే గంగాది నదులను, భగవద్భక్తి గల యోగులను, పొడవు కొమ్ములు గల జంతువులను, దీర్ఘమైన గోళ్ళు గల జంతువులను ఆయుధాలు పట్టినవాడినిన్ని, లజ్జ విడిచిన స్త్రీలను, రాజులను నమ్మ వలదనిన రీతి.

**ఆపదే వ్యసన ప్రాప్తే దుర్భిక్షే శతృనిగ్రహే**
**రాజద్వార శ్మశానేన యత్వేసతి బాంధవః - 66**

పద్యానువాదం :

**ఆపదలయందు, అలవాటులందు, ఉన్న**
**ఊరను కరువుల, పగఆకోడినపుడు**
**రాజద్వారములందున, ప్రాణముడుగు**
**సంత్యమున నాదుకొనువాడె యాత్మ బంధు.**

అర్థం : తనకు ఆపద వచ్చినపుడున్ను, వ్యసనమైనపుడున్ను, తన దేశమున కరువైనపుడునున్న, తనను శత్రువులు నిగ్రహించినపుడు రాజుల వల్లనే కాని యితరుల వల్లనే కాని ప్రాణావసాన కాలమునను తనను ఆదరించినవాడే బంధువన్నరీతి.

**పక్షిణాం కాకః చండాలః మృగ ఛండాలి గార్దభం**
**యతీనాం కో2పి ఛండాలి సర్వ ఛండాలి దూషకః - 67**

( పక్షిణాం కాకశ్చండాలః పశూనాంచైవ కుక్కుటః
మునీనాం కోపః చండాలః సర్వేషాంచైవ నిందకః ..... అని చాణక్య నీతిలో ఉన్నది.)

పద్యానువాదం :

**పక్షులందున నీచము వాయసమ్ము**
**జంతువులయందు గాడిద, సాధువులకు**
**కోపి యగువాడు , పెద్దల గురుతులేక**
**నిందజేసెడు వారలు నీచులనుట**

అర్థరా పక్షులలో కాకి చండాలి, మృగాలలో గాడిద చండాలి, యతీశ్వరులలో కోపి చండాలుడు, మనుష్యులలో చిన్నా పెద్దల గురుతు తెలియక చూపించేవాడు అధమాధముడు, సర్వ చండాలుడనిన రీతి.

**దేవనింద భవే శ్వాన, శృతినిందాచ గార్దభం**
**సదానింద భవేత్కాకి, గురునింద కులక్షయం - 68**

పద్యానువాదం :

**దైవము నిందజేసినను తప్పక కల్గును కుక్కజన్మమున్**
**కేవల వేదభావముల కించమొనర్చిన గార్ధభంబగున్**
**రేవగలెల్ల తిట్టినను రెండవ జన్మము వాయసంబగున్**
**దేవ సమానులం గురుల తిట్టిన వంశము నాశనంబగున్**

అర్థం : సకల బ్రహ్మాండ నాయకుడైన దేవుని నిందవల్ల కుక్క జన్మ వచ్చును, భాగవత జ్ఞానము నింద జేస్తే గాడిద జన్మం వచ్చును, సత్యనింద వలన కాకి జన్మం, గురునింద వలన కులక్షయం కలుగును.

**మధుబిందు యథా భృంగం పుష్పం తుష్టాంతరం త్యజేత్**
**జ్ఞాన యజ్ఞ యథా శిష్యాన్ గురుమంత్రమను త్యజేత్ - 69**

పద్యానువాదం :

**పూల చెరపక తుమ్మెద గ్రోలు మధువు**
**అట్టి నైపుణ్య మెరుగని అజ్ఞులగుచు**
**గురుని జ్ఞానమ్ము మంత్రమ్ము నరయ లేక**
**శిష్యులే గురులను నింద సేతురంత**

అర్థం : తుమ్మెద మకరందం వున్న కమలములు మొదలుకొని పుష్పం రేకుల శృంగారం వీడి మకరందం అనుభవించిన రీతి, జ్ఞాన లుబ్ధులైన శిష్యులు ఆత్మజ్ఞానము లేక తుమ్మెదలను నల్లని పుర్వులు మకరందమును తెలియునట్లు గురుమంత్రం విడిచి గురునింద చేయుదురనిన రీతి.

**ఘటం పర్ణం జలం కాష్టం తండులం క్రమేవచ**
**సూపమాద్యోదనం యుక్తం లవణ నవ ముచ్యతే - 70**

పద్యానువాదం :

**పాత్ర పత్రముల్ జలములు వంటచెరకు**
**ప్రాలు పెరుగును నేయియు పప్పు కూర**
**లవణ మివి తొమ్మిదే గేస్తులకును నిత్య**
**దేవ నైవేద్యమిడుటకు దినుసులగును.**

అర్థం : గృహస్థ క్రమానకు కుండలు, ఆకులు, నీళ్ళు, కట్టెలు, బియ్యం, పెరుగు, నెయ్యి, పప్పు, లవణం యీ తొమ్మిది దేవతా నైవేద్యాలనిన రీతి.

**వస్తు ముఖ్యస్త్వలంకారః ప్రియ ముఖ్యంతు భోజనం**
**గుణోముఖ్యంతు నారీణాం వేద విద్యాస్తు బ్రాహ్మణః - 71**

(విద్యాస్తు పూరుషః .. అనే పాఠాంతరమున్నది. )

పద్యానువాదం :

**వన్నె పెంచగ వలయును వస్త్రములును**
**భోజనము వేళ చూపంగ వలయు ప్రేమ**
**సుగుణములు పతివ్రత యౌట సుదతులకును**
**వేద విద్యల నరయుట విప్రులకును**

అర్థం : అలంకార శృంగారమునకు వస్త్రములు ముఖ్యం, భోజనానికి ప్రియం జేసేది ముఖ్యం. స్త్రీలకు పతివ్రత మంచి గుణం ముఖ్యం. ఋగ్వేద యజుర్వేద సామవేదములు చదివిన బ్రాహ్మణులు ముఖ్యమనినరీతి.

**పక్షిణాం బలమాకాశం మత్స్యానాం ముదకం బలం**
**దుర్బలస్య రాజా బాలానం రోదనం బలం - 72**

పద్యానువాదం :

**అరయ పక్షులకును బలమాకసమ్ము**
**మత్స్యములకును జలములే మంచి బలము**
**పేద వారికి ప్రభువులే పెద్ద బలము**
**చంటి పిల్లల కేడ్పులే చాల బలము**

అర్థం : పక్షులకు ఆకాశమే బలం. చేపలకు ఉదకమే బలం, దాసులైన పేదలకు రాజే బలం, పిల్లలకు ఏడుపే బలం.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (43) హైదరాబాద్ మార్చి : 2025

# దళిత సాంస్కృతిక సరోవరం – నాగప్పగారి సుందరరాజు కథలు

**ప్రొఫెసర్ కె. శ్రీదేవి,** తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం,

**పి. శివశంకర,** పరిశోధక విద్యార్థి, ద్రావిడ విశ్వవిద్యాలయం, ఫోన్ : 9441 40 40 80

1980ల తర్వాత తెలుగు సాహిత్య ప్రపంచంలోకి చాలా ఉద్యుతితో దూసుకొచ్చిన దళిత ఉద్యమం. తెలుగు సమాజంలో దళితవాదం మార్క్సిజాన్ని సంశయిస్తూ మార్క్సిస్టుల్ని, కమ్యూనిస్టుల్ని మౌలిక ప్రశ్నలతో నిలదీస్తూ మొదలైంది. ఒకరకంగా తెలుగు సమాజంలో దళిత రాజకీయోద్యమంగా కంటే సాహిత్యోద్యమంగా ఎక్కువ ప్రచారమైంది. దళిత రాజకీయోద్యమకారులు చేయలేని పని దళిత కవులు చేశారు. సామాజిక జీవితంలో దళితుల మీద నిరంతరం పెరిగిపోతున్న భౌతికదాడుల నేపథ్యంలో దళిత సాహిత్యోద్యమం విస్తరించింది.

దళిత ఉద్యమం, దళిత సాహిత్య చేతన తెలుగునాట దళితవాదం తాత్కాలికంగా రూపుదిద్దుకోవడంలో కె.జి.సత్యమూర్తి, కత్తి పద్మారావు, బి.ఎస్.రాములు, సాంబశివరావు, కె.శ్రీనివాస్, సురేంద్రరాజు, సాహు, లక్షీనరసయ్యల కృషి చాలా వుంది. దళిత సాహిత్యం మీద, దళిత రాజకీయాల మీద కమ్యూనిష్టులు చేసిన విమర్శలకు సమాధానాలు ఇచ్చి దళితవాదాన్ని తాత్వికంగా నిలబెట్టారు.

దళిత సాహిత్యం విస్తరించే క్రమంలో ఉమ్మడి వాదంలో కూడా అనిర్దిష్టత, అమూర్థత ఉన్నాయి. దళిత సామాజిక బృందాల మధ్య కూడా విపరీతమైన అంతరాలున్నాయి. సరిగ్గా మాలలకి, మదిగలకి మధ్య నున్న అంతరాన్ని బహిర్గతం చేస్తూ ముందుకు వచ్చిన ఉద్యమం "మాదిగ దండోర" ఒక సామాజిక సందర్భంలో అధికారాన్ని అమలు చేయడానికి అలవాటుపడ్డ బృందం. సమాజంలో కొన్ని రంగాలలోనైనా యథాతథ స్థితి కొనసాగడంవల్ల లబ్ధి పొందే బృందం ఆ అధికారాన్ని వదులుకోవాల్సిన చారిత్రక అవసరాన్ని గుర్తించింది. ఈ భావజాలాన్ని వ్యతిరేకించే లేదా సమస్యాత్మకం చేసి, చర్చకు పెట్టే బృందాలతో ఘర్షించడానికి కూడా దళిత సామాజిక బృందం వెనుకాడలేదు. సరిగ్గా ఈ విషయాన్ని రుజువు చేస్తూ వచ్చిన ఉద్యమం మాల మహానాడు. కలేకూరి ప్రసాద్ మాటల్లో చెప్పాలంటే, **"మాల మహానాడు పుట్టుకే దళిత చైతన్యానికి వక్రీకరణ".** అధికార మనేది దళితుల, స్త్రీల, మైనార్టీల గుర్తింపుల్ని నిర్దేశించే విధంగా వుంటుంది. అధికారం అనేది మొత్తం, సాంఘిక, సాంస్కృతిక రంగాల్ని ఇంకా మన ఆలోచనా విధానాన్ని అనుసరించి వుంటుంది. అందువల్ల అధికార కేంద్రాలు బహుళంగా ఉంటాయి. వ్యక్తుల సామాజిక గుర్తింపుల్ని ఈ కేంద్రాలే నిర్వచిస్తూ వుంటారు. ఈ ప్రక్రియ ఫలితంగా వ్యక్తులు నిరంతరం ఒకే గుర్తింపులో వుండరు. దళితులకు




కూడా అది వర్తిస్తుంది. గుర్తింపు మారినప్పుడల్లా అధికార సంబంధాల స్థితి కూడా మారుతూ ఉంటుంది. ఒక స్థితిలో అధికారానికి గురయిన వారు వేరొక స్థితిలో అధికార ప్రయోగం చేస్తూ వుంటారు. ఇక్కడ చెకోవ్ ఆధిపత్య భావన తాత్వికతకు సంబంధించి అన్న మాటల్ని గుర్తు చేసుకోవచ్చు.

చిన్నవాళ్ళూ, పిచ్చి వాళ్ళూ తప్ప సమాజంలో అధికార ప్రయోగం చేయని వాళ్ళెవ్వరు వుండరంటారు. కాబట్టి బహుజన ఉద్యమంగా ప్రారంభమైన దళిత వాదాల్లో దళితుల్లోని శ్రేణి కారణాల ప్రస్తావన రాగానే అధికార లబ్ధిని, ప్రయోగాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేని బృందాలు అడ్డం తిరిగాయి. ఈ బృందాల మధ్య స్పర్థలు పొడచూపాయి. ఆ స్పర్థలు దళిత ఉద్యమాన్ని బలోపేతం చేయాల్సింది పోయి దళిత ఉద్యమరూపాలైన సంఘర్షణను సంఘటనలను పోరాట రూపంలోకి మలచడంలో పొందిన పరాజయాల్ని నాగప్పగారి సుందర్రాజు ఒక దళితునిగా దళిత హక్కుల కోసం నిరంతరం సంఘర్షించి దళిత ఉద్యమాలను దళిత నాయకులు ఎలా తాకట్టు పెడుతున్నారో ఆ క్రమాన్ని కూడా 'మాదిగోడు' కథా సంపుటంలో నాగప్పగారి సుందర్రాజు ఉపేక్షించలేదు. దళితులుగా తాము జరుపుతున్న పోరాటాల స్ఫూర్తిని ప్రజలకు అందించడంలోనే కాదు ఆ పోరాటాలను తమ స్వార్థంతో నిర్వీర్యం చేసే నాయకుల ఆధిపత్య రాజకీయాలను కూడా వ్యతిరేకించడం భావి దళిత ఉద్యమ స్వభావంలోని నిజాయితీని ప్రకటించడం. దీన్ని దళితులలో లోపించిన నిజాయితీకి ప్రతీకగా గ్రహించటం కంటే దళిత ఉద్యమ

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2025

నిర్మాణంలో ఎదగాల్సిన ఆవశ్యకతనే గుర్తుచేస్తుంది. అయితే ఈ సందర్భాన్ని వక్రీకరించే వాళ్ళు తమ అవగాహనా లోపాన్ని ప్రదర్శించడం తప్ప మరేం కాదని చెప్పనక్కర లేదనుకుంటాను.

బ్రాహ్మణవాద భావజాలాన్ని, అది రూపొందించి అమలుచేస్తున్న అధికారాన్ని, అధికార సంబంధాల్ని నిరాకరించడంలో, దానికి వ్యతిరేకంగా ఉద్యమించడంలో గొప్ప ఐక్యతని ప్రదర్శించిన బృందాలు ఆ తరువాత తమ మధ్య అంతరాల ప్రస్తావన వచ్చినప్పుడు అంతర్గత విభేదాల్లో చిక్కుకున్నాయి. ఈ విభేదాలకు ఒకానొక సంస్థాగత రూపం మాల మహానాడు మధ్య మనస్పర్థలు పొడచూపాయి. ఆ స్పర్థలు దళిత ఉద్యమాన్ని బలోపేతం చేయాల్సింది పోయి, దళిత ఉద్యమ రూపాలైన సంఘర్షణలను, సంఘటనలను పోరాట రూపంలోకి మలచడంలో పొందిన విజయాలను, పరాజయాలను కూడా నాగప్ప గారి సుందర్రాజు **'మద్దికేరి మార్తమ్మ కథ ఎంత మందికి తెలుసప్ప'** అనే కథలో రికార్డు చేయగలిగారు.

ఇతను దళితుడిగా దళిత హక్కుల కోసం నిరంతరం సంఘర్షిస్తూ ఉద్యమంలోని నాయకులే దళితుల జీవితాలను ఎలా తాకట్టు పెట్టడం జరిగిందో కూడా ఈ కథలో చెప్పగలిగారు. అయితే దళితులై వుండి బలైపోయిన దళితులపట్ల వారు నిర్వర్తించే బాధ్యతలో ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారు? అన్న ప్రశ్న వేసుకోగలిగితే వారలా ప్రవర్తించడానికి వెనుక గల రాజకీయాలని అర్థం చేసుకోగలిగితే దాన్ని ఎదుర్కోనే బలమైన సజాతీయ రాజకీయాలను నడపగలిగే దళితనాయకులు పొందగలరు. మద్యానికి, డబ్బుకు, అధికార దాహానికి వ్యామోహాలకు లొంగని దళిత ఉద్యమ నిర్మాణం జరగాల్సిన అవసరాన్ని ఈ కథలో నిర్ద్వంద్వంగా చర్చించడం జరిగింది. తాము జరుపుతున్న పోరాటాలను తామే స్వార్థంతో నిర్వీర్యం చేసే నాయకుల ఆధిపత్య రాజకీయాలను కూడా వ్యతిరేకించడం భావి దళిత ఉద్యమ నిజాయితీని ప్రకటించడమే తప్ప చిన్నబుచ్చేవి కాదని చెప్పనక్కరలేదు. ఒక సామాజిక బృందపు ఉపాంతీకరణ క్రమాన్ని అర్థం చేసుకోవడనికి, ఆవిష్కరించడానికి కవిత్వం కంటే వచనం గొప్ప సాధనం అనే వాస్తవాన్ని నాగప్పగారి సుందర్రాజు కథలు శక్తివంతంగా రుజువు చేశాయి.

నాగప్పగారి సుందర్రాజు **'మాదిగోడు'** కథాసంకలనం దళితవాద ఉద్యమంలో ఎన్నదగిన రచన. ఒక నిర్దిష్ట సామాజిక బృందం అంతే నిర్దిష్టమైన కులం అనే ఒక కేంద్రం నుంచి మార్జినల్ సెక్షన్లోకి నెట్టివేయబడడంలో వున్న హింసని ధ్వనించడం ద్వార అవి గొప్ప రచనలయ్యాయి. ఒక సామాజిక బృందం రూపాంతరీకరణ క్రమాన్ని అర్థం చేసుకోడానికి, ఆవిష్కరించడానికి కవిత్వం కన్న వచనం గొప్ప సాధనం అనడానికి చిలుకూరి దేవపుత్ర నవల **'పంచమం'** నాగప్పగారి సుందర్రాజు **'మాదిగోడు'** రచనలు దోహదపడ్డాయి.

ఆధునిక కథల్లో ఎక్కువ భాగం లేక సంఘటనల క్రమం (sequence of events) అనేది అచేతనంలో కూడా రచయిత మరచి పోవడం లేదా ప్రస్తావించకపోవడం జరగదు. కానీ సుందర్రాజు కథల్లో ఈ క్రమాన్ని అతిక్రమించటం జరిగింది. ఈ అధిగమనం వలన రూప సంబంధమైన అడ్డంకి నుంచి కథ ఎత్తుగడ విడిపోవడం లేదా ప్రస్తావించడం జరగదు. కానీ సుందర్రాజు కథల్లో ఈ క్రమాన్ని అతిక్రమించడం జరిగింది. ఈ తరహ కథల్లో సంఘటనలు ఒక క్రమంలో కాక శకలాలు శకలాలుగా పాఠకుణ్ణి తాకడం జరిగింది. అంతకు ముందు కవిత్వంలో వున్న ఈ ధోరణి ఈ మధ్య కాలంలో కథల్లోకి కూడా విస్తరించింది. అందుకు రాయలసీమ కథాసాహిత్య కారుల major contribution వుంది అని గర్వంగా చెప్పడానికి అటు **"మిట్టలాదేవి"** కథల ద్వారా నామిని **"మాదిగోడు"** కథల ద్వారా నాగప్పగారి సుందర్రాజు వస్తు శిల్ప సమన్వయంలో రెండంచుల వరకు విస్తరించారు.

ఒక రకంగా కథలోని సంఘటనలు ఒక క్రమంలో కాక శకలాలు శకలాలుగా పాఠకులను ఇబ్బంది పెట్టినప్పటికీ శకలాలు శకలాలుగా చిత్రీకరించిన సంఘటనలల్లో గొప్ప గాఢతను తీసుకురావడం ద్వారా సుందర్రాజు పాఠకున్ని కదిలించ గలుగుతాడు. ఈ తరహా శైలికి ఉదాహరణగా **'నడిమింటి బోడెక్క బసివిరాలయ్యేదా?'** అనే కథను చెప్పొచ్చు.

ప్రథమ పురుషలో (first person) కొనసాగిన సుందర్రాజు కథలు ఎక్కువ భాగం కథకుడికి మిగతా పాఠకుడికి మధ్య ఉండే సంబంధాన్ని చెరిపివేశాయి. కథకుడితో పాటు పాత్రలు తమంతకు తాము తమ గురించి ఆవిష్కరించు కోకపోయిన కథకుడి (narrator) ఉదాహరణకు కథకుడి నాన్న, అమ్మ, మస్తానమ్మ, గుండేలక్క, బోడెక్క, జాఫర్ సాహెబ్, అతని కోడలు, రాచెక్క ద్వారానే పూర్తి స్థాయిలో పరిచయమవుతారు. అలాంటి పాత్రలకు ఇన్ని పాత్రలు కూడా కథకుడిని 'నేను' పాత్ర ద్వారానే పరిచయమవటం వలన స్వయంగా కథల్లో కల్పించుకొని మాట్లాడక పోవడం వలన కథను అర్థం చేసుకోవటంలో తగినంత స్పష్టతకు అవకాశం కల్పించ గలిగాడు రచయిత. చాలా వరకు పాఠకున్ని Expectancyని విచ్ఛిన్నం చేస్తూ ఉంటాయి. లేక రచయిత వాటిని విచ్ఛిన్నం చేస్తూ ఉండటం వల్ల ఒక గందరగోళంలో పడటం జరుగుతుంది. ఇందుకు స్పష్టమైన ఉదాహరణగా **"జోరాసావు కథ"** నిలిస్తుంది.

సుందర్రాజు **"మాదిగోడు"** కథలు సంఘటనలు ప్రధానంగా నడిచే కథలు కాదు. ఎక్కువ భాగం కథకులు కథల్లో సంఘటనల్ని ఉన్నట్టుగా కనిపించిన అవి కథలో నేపథ్యానికి సంబంధించినవిగానే వుంటాయి. గత సంఘటనలోని పాత్రల విధిని నిర్దేశిస్తూ ఉంటాయి. జ్ఞాపకాల్ని ట్రాముల్లాగా భావిస్తూ ఉంటాయి. ఎక్కడో ఆత్మిక ప్రపంచపు లోతుల్లో ఏదో అదృష్టమైన వేదనని అనుభవిస్తూ,

మోస్తూంటాయి. సంవేదనల సంక్లిష్టతలు సంచరిస్తూ ఉంటాయి. అందుకు ఉదాహరణగా **'జోరాసావు', 'నడిమింటి బోడెక్క', 'మద్దికేరి మార్తమ్మ'** పాత్రల్ని లోతుగా గమనిస్తే, అవి ఎదో ఒక అసాధారణ చైతన్యానికి బాధితులైనట్లు అనిపిస్తుంది. ప్రతి పాత్రకు సంబంధించిన గతం, వాటి వర్తమాన జీవితాన్ని నిర్దేశించడమే కాకుండ తీవ్ర కల్లోలానికి కూడా గురిచేసే "మాదిగోడు" సంకలనంలోని కథలన్నీ మాదిగ దండోరా రాక ముందు నుండి కొనసాగిన వాతావరణం ఆ తర్వాత దండోరా నేపథ్యం నుండి బయట పడడానికి సుందర్రాజు లాంటి నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి దండోరా దాక నిలిచిన ఉద్యమాల గురించి ప్రస్తావిస్తాయి.

రాయలసీమలో దళిత రచయిత నాగప్పగారి సుందర్రాజు "మాదిగోడు" కథా సంకలనం ద్వారా మాదిగ సంస్కృతిలోని జీవన సౌందర్యాన్ని పరిచయం చేయటమే కాకుండా దళిత ఉద్యమ చైతన్యాన్ని అందించారు. కుల ఆధిపత్యం నుంచీ కులవివక్ష నుంచీ దళితులను విముక్తి చేసేందుకు, ఒక రాడికల్ పోరాటానికి కర్నూలు జిల్లాలోని "మద్దికెర" దళితవాడలో జరిగిన అత్యాచార సంఘటనతో నాంది పలికింది. ఆ క్రమంలో దళితులు అనేక రచనలు చేశారు. దళిత రచనల వెల్లువ వారి సైద్ధాంతిక ప్రతిఘటననే కాక సాంస్కృతిక తిరుగుబాటును కూడా వ్యక్తీకరించింది.

ఆ సాహిత్యం ప్రధాన లక్ష్యం హిందూమత అగ్రవర్ణాల సామాజిక, సాంస్కృతిక ఆధిపత్యాన్ని ప్రతిఘటించడం, దళిత మేధావులు ముందుకు తెచ్చిన సాంస్కృతికఉద్యమం అజెండా తెలుగు సాహిత్యం లో గుర్తింపును దళిత దృక్పథాన్ని, దళిత సాంస్కృతిక సైద్ధాంతిక ప్రత్యేకతను చాటి చెప్పింది. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం నాగప్పగారి సుందర్రాజు కథ "మద్దికేరి మార్తమ్మ కత ఎంతమందికి తెలుసప్పా'! దళిత ఉద్యమాలు వచ్చిన తరువాత దళితులలో పెరుగుతూ వచ్చిన చైతన్యమే ఈ తిరుగుబాటు ప్రతిఘటనా సాహిత్యానికి పూర్తిగా నిలిచిన కథగా దీన్ని చెప్పవచ్చు.

దళిత రచనల్లో ప్రధాన వస్తువు కుల అణచివేత, కుల వివక్ష వ్యతిరేక పోరాటమే. సామాజిక సమానత్వం గురించి దళిత సంఘాలు విస్తృతంగా ప్రచారం చేశాయి. అగ్రవర్ణాలు దళితుల మీద భౌతిక దాడులు జరపడం, వారి ఆస్తులను ధ్వంసం చేయడం వంటి పనులకు తెగించాయి. రాయలసీమలోని గ్రామీణ ప్రాంతాలలో దళితుల మీద అరాచక, అణచివేత, హింసాత్మక సంఘటనలు, అకృత్యాలు ఎన్నో జరిగాయి. అయితే ఆనాటి ఏ వార్తా పత్రికా ఏ సాహిత్య పత్రికా ఆ సంఘటనల్ని ఎక్కడా ప్రస్తావించక పోవడం ఆశ్చర్యం. దళితులు తమ హక్కుల కోసం నినదించినప్పుడల్లా వారిపైన హింసాత్మక సంఘటనలు జరిగాయి. దళితులలో పెరుగుతున్న చైతన్యానికీ సమానత్వం కోసం, ఆత్మగౌరవం కోసం వారు చేస్తున్న పోరాటాలకు మధ్య అవినాభావ సంబంధం వుంది.

ఆనాటి సంఘటనలు కొన్ని విశ్లేషిస్తే తప్ప ఆ విషయం మనకు స్పష్టపడదు. కడప జిల్లా కోడూరు మండలం తిప్పిరెడ్డి పల్లె వాసులు తమ ఓటు హక్కు కోసం కలెక్టరుకు రాసుకున్న అర్జీని గురించి తెలిసిన అగ్రవర్ణాలు తమ గ్రామ పొలిమేరల్లో చెప్పులు వేలాడదీసిన సంఘటనలు, దళితుల పిల్లలు అగ్రవర్ణాల వాళ్ళ పిల్లలతో కలిసి బోర్డు స్కూల్లో చదవుకోనేందుకు, ముందుకు వస్తున్నందుకు అగ్రవర్ణాల వాళ్ళు ఆగ్రహించి ఆ దళితులపై చేసిన దాడులు, వేంపెంటలో దళితుల ఇళ్ళను తగులబెట్టి వాళ్ళపై హత్యానేరాలు మోపి, వాళ్ళంతా ఊరొదిలి పారిపోయేట్లు చేసిన సంఘటనలు, చింతకొమ్మదిన్నె మండలంలో జరిగిన అరాచక సంఘటనలు మద్దికేరి మండలం మాదిగవాడలో జరిగిన మార్తమ్మ అత్యాచారం, హత్య లాంటి సంఘటనలు ఎన్నో జరిగాయి. అగ్రకులాల వాళ్ళు తమ ఆధిక్యతను నిలుపుకునేందుకు హిందూ అగ్రకులాల అహంకారులు దళితుల్లో చాలా మందిలో వస్తున్న మార్పుపట్ల తమకు గల అసంతృప్తిని వ్యక్తం చేసేందుకు ఈ దాడులను ఉపయోగించారు. ఆ దాడులే దళిత రచనలకు దిశానిర్దేశం చేశాయి. దళిత సాహిత్యానికి వస్తువులయ్యాయి.

నాగప్పగారి సుందర్రాజు కథ. "మద్దికేరి మార్తమ్మ ఎంతమందికి తెలుసప్పా"!లో దళితులు సామాజిక న్యాయం కోసం చేస్తున్న పోరాటాన్ని, ఆ పోరాటాన్ని అణచి వేసేందుకు దళితేతర కులాలన్నీ ఐక్యమయి దళితుల్ని ఊచకోత కోసిన సంఘటనలను చిత్రించారు. దళిత అస్తిత్వ చైతన్యం ఒకవైపు పెల్లుబుకుతున్నా, దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. కారంచేడు, చుండూరు, పదిరి కుప్పం సంఘటనల తర్వాత దళితులపై జరిగిన ఈ దాడుల్ని చేసిన వారెవరూ శిక్షింపబడలేదు. వాళ్ళు అగ్రవర్ణ కులాధిపత్యం ఇచ్చిన మద్దతుతోనే యథేచ్ఛగా తిరగగలుగుతున్నారని, పూర్వ గాయాలను కూడా ఈ కథలో రచయిత తడమ గలిగారు. తద్వారా ఈ కథకు మంచి ఉ ద్వేగాన్ని కల్పించగలిగారు. ఆనాటి దళితులపై దాడుల వారసత్వం మద్దికేరి మార్తమ్మ అత్యాచార మారణకాండ వరకు పరిణమించిన తీరును ప్రస్తావించడమే కాక అందుకుగల కారణాల్ని కూడా ఈ కథలో చర్చించగలిగారు. ఒకవైపు అగ్రకులాలు తమతో పాటు బి.సి. కులాలను కూడా ఏ విధంగా దళితులకు వ్యతిరేకంగా కూడగట్టారో ఈ క్రింది మాటల్లో వ్యక్తమైన క్రమాన్ని గమనించవచ్చు.

**".....వూర్లో వుండే రెడ్డోళ్ళు, కమ్మొళ్ళు, కాపోళ్ళు, బాయొళ్ళు, గొల్లలు, కురుమోళ్ళు, సాకలోల్లు, మంగలోళ్ళు.. ఇలా అన్ని కులాలోల్లు యేకుమయ్యి పారాటిడిస్తే, వుపన్యాసాలు ఇచ్చేకొచ్చిన నాయకులు, వూరేగింపు కొచ్చిన ఆడారు యాండ్లు యెనక్కి తిరిగి సూడకుండా గుంతకంటి తుక్కు సచ్చేసావుకి పారి పోతుండారు"** అని అంటారు.

దళిత పోరాటాల్ని నీరు కార్చేందుకు అగ్రకులాల వాళ్ళ తమ ఎత్తుగడలో భాగంగానే దళిత నాయకులు పారిపోతున్నారు. ఒకవైపు అంటూ మరోవైపు స్వార్థ పూరితులైన దళితులు ధైర్యంగా నిలబడలేదని కూడా దళిత సంఘాల నేతలను ఈ కథలో ఆక్షేపించారు. ఈ రెండూ అంశాలు కూడా వాస్తవమే. కానీ దళిత సంఘాల వాళ్ళు అగ్రకులాల ఎత్తుగడలకు భయపడితే, దళితులపైన దాడులు పునరావృతమవు తూనే ఉంటాయన్న ఆవేదన కూడా రచయిత వ్యక్తం చేస్తారు. తాను దళిత సంఘాల నేతల్లో కొరవడిన పోరాట తత్త్వాన్ని ఈ కథలో దుయ్యబట్టారు. పదవులకు, డబ్బుకు, ఉద్యోగాలకు దళిత ఉద్యమ నాయకులు ఏవిధంగా అమ్ముడుపోతున్నారో తమ సొంత పరపతులను ఎలా పెంచుకొంటున్నారో విశదీకరిస్తారు. ఈ కథలో జానపదులు చెప్పే కవిత్వాన్ని నాగప్పగారి సుందర్రాజు మెటఫర్ రూపంలో ఇలా బట్టబయలు చేశారు.

**"కోతులు బుట్టిందెందుకు / కొమ్ములిరిసేటందుకు**
**కొమ్ము లిరిసేదెందుకు / రతుము సేసేటందుకు**
**రతుము సేసేదెందుకు / రాముడెక్కేటందుకు**
**రాముడెక్కేదెందుకు / రాజ్జమేలేటందుకు"** అన్నట్లు మనదేశంలోని పాలితపాలక వర్గాలతీరును విశదీకరి స్తారు. ఇది దళిత పోరాట సంకల్ప కథ అంటారు. ఈ అంత్య పద జానపద గేయంలో ఆధిపత్య నాయకుల విద్రోహ స్వభావాన్ని బహిర్గతం చేసే ప్రయత్నం చేశారు. అంతేకాదు ఈ క్రింది మాటల్ని గమనిస్తే,

**"కారముసేడులో పశువుల్ని గొంతు కోసినట్లుగా మగాళ్ళందరిని గొంతులు కోసి సంపితే, దాని మింద వుద్దెమము సేసి వొగాయప్ప నాయకుడు అయ్యి కూసునిడిస గాని, సంపిన్నా కొడుకులికి సరయిన సిచ్చ పడిందే లేదు."** ఈ కథ రాసే సమయానికి, చుండూరు కారంచేడు అత్యాచార సంఘటనలు జరిగి 20 సంవత్సరాలైనా, కోర్టు కేసు తెగలేదు. ఇంక శిక్షల మాట చెప్పాల్సిన పనే లేదు. **"సుందూర్లే మాలోల్లని సంపిడిస్తే, ఇంగెవురు వుద్దుమము సేసేకి లేదు. ఇక్కడంతా మా సంఘమే సూసుకుంటాదంటానాని, సచ్చిన సవాల్ని ముందు బెట్టుకొని మగా నాయకుడయ్యి కుసినీ నాయప్ప డిల్లీలో పొయ్యి ప్రధాన మంత్రితో దుడ్లు సంచులు తెచ్చుకొని వుద్దెమం మొత్తాన్ని నీరు గార్చిడిస"** దళిత నాయకుల ప్రవర్తన పట్ల తన అభిప్రాయాన్ని తీవ్రస్వరంతో రచయిత నిరసిస్తాడు.


**"దినానికో వూర్లో మావోల్లు మాదిగోళ్ళు మిందఅత్తెలు జరుగు తాండాయి. అంతో ఇంతో వుద్దేమము అంటనాని కొంతమంది ముందుకొచ్చిడిస్తారు. ముందుకొచ్చి మాట్లాడినోడల్లా నాయకుడయ్యి డిస్తాడు. నాయకుడు అయిపొయ్యే తలకాల యాదో ఒక రాజకీయ పార్టీలో సేరిపొయ్యి యెమ్మెల్లే అయిపోవల్లని, మంత్రి అయిపోవల్లని, దుడ్లు సంపాదిచ్చుకునేకి, కార్లు కొనుకునేకి, మ్యాడీలు కట్టిచ్చుకునేకి సూస్తొంటారే గాని వొగు నీతి వుందాదా? నాయుము వుందాదా? సత్తెదరుమము వుందాదా? నిజ్జంగా జాతికి సేవ సేద్దామనే గాడిద నా కొడుకు కనపన్నే కపడ్డు"** అంటూ దళిత ఉద్యమాలలో లోపిం చిన నాయకత్వ లక్షణాలను ఈ కథలో తూర్పారబట్టడం ద్వారా, దళిత నాయకులలో పెరగాల్సిన ఉద్యమ నిబద్ధత గురించి తన ఆవేదనను, ఉద్యమ నిమగ్నతను తన రచనల్లో సుందర్రాజు శక్తివంతంగా వ్యక్తం చేయగలిగారు.

ఇంతవరకు వచ్చిన దళిత సాహిత్యంలో ఇలాంటి ఆక్షేపణ పూర్వక సాహిత్య సృజన జరగలేదనే చెప్పవచ్చు. స్వతహాగా దళిత ఉద్యమాలలో పనిచేస్తూ చాలా దగ్గరగా ఉద్యమాన్ని, ఉద్యమ కార్యకర్తల్ని పరిశీలించడం ద్వారానే సుందర్రాజుకు ఈ అవగాహన కలిగి వుంటుంది. చాలా స్పష్టంగా దళిత ఉద్యమ చోదక శక్తిగా ఉద్యమ కార్యకర్తల్ని తీర్చిదిద్దాలనుకున్న రచయితే తన రచనల ద్వారా, అందులో వ్యక్తమయ్యే నిబద్ధత ఉన్నపుడే ఈ విధమైన ఆర్తిని ఆవిష్కరించగలుగుతారు.

దళితులకు అన్యాయం జరగకుండా వుండాలంటే దళిత రాజ్య స్థాపనే ప్రత్యామ్నాయ మార్గంగా భావించిన దళిత నాయకుల గురించి వ్యక్తం చేసిన అభిప్రాయాలలో నాగప్పగారి సుందర్రాజు కథలలోని దళిత రాజకీయ దృక్పథం ఆయన రచనల్లో స్పష్టమవు తుంది. దళితుల ఐక్యత గురించి, దళితులు ప్రతిఘటన ఉద్యమం చేయడం ద్వారా దళితుల హక్కుల్ని ఏ విధంగా పరిరక్షించుకోగలరనే వాస్తవాన్ని ఇలా వివరిస్తారు.

**"నాను యన్నిసార్లు సెప్పుతాంటాను. మద్దికేరి మాదిగనా కొడుకులికి. యేమంట్లే ...ఆ సందేళి మాదిగోళ్ళు నన్నే సూసి బుద్ధి తెచ్చుకోండ్లే. వాళ్ళవి వుండేది పందిండ్లు గూడలేవు. యేదు ఊర్లు మందిని తరిమి తరిమి కొట్టి, పన్నెండు మందిని సంపేసి ఈ పొద్దు పత్తికొండ తాలూకాలోనే కాకుండా కర్నూలు జిల్లాలోనే సందోళి మాదిగోళ్ళు అంటే మొగోళ్ళు. మాదిగోళ్ళు అయిగూడ యెవునికి బయపడకుండా తిరగతాండారు. పాలేగాండ్ల లక్క అట్లా మీరు కూడా తిరగుబడండి''** అంటూ కర్నూలుజిల్లాలో జరిగిన రెండు అత్యాచారాలను తారతమ్యీకరించారు. అంతేకాదు. మద్దికెరి మార్తమ్మ అత్యాచార సంఘటనలో దళిత మద్దతు బృందాలు కానీ, దళిత నాయకత్వ బృందాలు ప్రతిస్పందించిన తీరును సమస్యాత్మకం చేశారు. తిరగబడితీరందే దళితులపై దాడులు ఆగవని, దళితోద్యమ స్ఫూర్తిని, దళిత కార్యకర్తలకు ఆత్మస్థైర్యాన్ని ఈ కథలో ప్రబోధించారు.

మద్దికెరి మార్తమ్మను ముగ్గురు దళితేతర కులాల మగాళ్ళు అత్యాచారం జరిపిన అఘాయిత్యాన్ని కోత పశువుతో సమానంగా చూశారని ఇలా వర్ణించారు. **"కిసి మీసు పండక్కి మాదిగోళ్ళు కొట్టాల్లో బేడెద్దుని కాళ్ళు కట్లేసి కోసినట్లు మార్తమ్మని ఆ నా కొడుకులు సెడుపుతుండారు"** అని చెప్పడంలో కోతపశువు కదలకుండా వుండడానికి పశువు కాళ్ళుకట్టేసి చంపుతారు. దానికి దళిత స్త్రీ




మార్తమ్మపై జరిగిన అత్యాచారానికి ఏ మాత్రం వ్యత్యాసం లేదని చెప్పడం ద్వారా దళిత స్త్రీలను అగ్రవర్ణ సమాజం ఏ దృష్టితో చూస్తుందో ఈ కథలో స్పష్టంగా చెప్పగలిగారు.

మార్తమ్మ చావును కూడా పురుషులు ఎలా ఉపయోగించు కున్నారో చెబుతూ, “మార్తమ్మ కేసుని” అడ్డము పెట్టుకొని వొగుడు నాయికుడయ్యిడిస. వొగుడు గోర్మింటు వుద్దేగుము తెచ్చుకునిడిస. ఇంగొగుని కేమో భూమిచ్చిడిసిరి. రోంతుమందికోమో ఇండ్లు కట్టిచ్చిడిసిరి. సానా మందికేమో లోండ్లు కింద దుడ్లు ఇచ్చిడిసిరి. ఇంగొగుడేమో కాంట్రాక్టు పన్లు తెచ్చుకొను, తెచ్చుకొని బతుకు తాండాడు. సచ్చిపోయిన పిల్ల సచ్చిపొయ్యింటే, ఆ సచ్చిపోయిన పిల్లని అడ్డెము పెట్టుకొని యంత మంది బతకతాండారనీ, ఆ పిల్ల పున్నిమా అంటాని తింటే తినేర. ఆ పిల్ల కేసు పట్టించుకోమంటే మాట్లాడేవోడు ల్యాకుండా పొయ్యేడన్నా, సరిగ్గా సొముచ్చురుముయ్యేద ఇంగా **“సార్జుసీటు దాకులు సెయ్యనే లేదు”** అంటూ మద్దికేరి దళితుడు ప్రభాకరు ప్రకటించిన ఆర్తి పాఠకుల గుండెల్ని పిండేస్తుంది.

దళిత స్త్రీలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభాకరు పాత్ర ద్వారా రచయిత ఎత్తి చూపారు. దళిత సంఘాలలో పెరగాల్సిన స్త్రీల ప్రాతినిథ్యాన్ని ఈ కథ గుర్తు చేస్తుంది. అట్టడుగు వర్గాల స్త్రీలే దళిత ఉద్యమ నాయకత్వాన్ని స్వీకరించగలిగితే, దళిత నాయకుల లౌల్యాన్ని స్వార్థాన్ని కొంతవరకు నియంత్రించ వచ్చనే భావం అంతర్గతంగా ఈ కథలో కనిపిస్తుంది. ఎందుకంటే, మార్తమ్మ మరణించినపుడు దళిత సంఘలతో పాటు మహిళా సంఘాల వాళ్ళు కూడా, వచ్చారు. వాళ్ళ వేషభాషలు, జుట్టు, మద్యపానాన్ని టార్గెట్ చేస్తూ పరోక్షంగా స్త్రీవాద సంఘాల్ని కూడా ఈ కథలో విమర్శిస్తాడు. అంటే స్త్రీవాద ఉద్యమ సంఘాలు, కమ్యూనిస్టు సంఘాల కంటే గూడా దళిత స్త్రీ ప్రాధాన్యత గల దళిత సంఘాల పైనే సుందర్రాజుకు విశ్వాసం వుందన్న వాస్తవం అర్థమవుతుంది.

ఈ కథలో చర్చించినట్లు దళిత ప్రతిఘటన ప్రధానంగా, వ్యక్తమయ్యింది కుల ఆధిపత్య, అధికార సిద్ధాంతాలు వాటి ఆచరణ మీదనే. ఆ ప్రతిఘటన కొంతమేరకు అగ్రవర్ణ సమాజానికి భిన్నమైన రీతిలో సాగింది. దళిత స్త్రీల అత్యాచారాలకు వ్యతిరేకంగా గళం విప్పినా దానిని ఈ సమాజం కావాలనే పట్టించుకోలేదు అన్న వాస్తవం గడియారపు అలారం లాగా మాదిగ స్త్రీల అణచివేత క్రమాన్ని ఈ కథ హెచ్చరిస్తుంది. కొనసాగుతున్న అగ్రవర్ణాల శత్రువైఖరిని చిత్రించడం ద్వారా దళితులను ఐక్యం చేసేందుకు, వారి ప్రతిఘటన శక్తి పెరిగేందుకు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యంగా దోపిడీ, అణచివేత, పేదరికం, అంటరానితనం మొదలైన వాటిని సమగ్రంగా విశ్లేషించుకునేందుకు ఈ కథ దోహదం చేస్తుంది. పెత్తందారీ అగ్రవర్ణ సమాజంలో దళితుల హోదాలో మార్పు తెచ్చేందుకు ఇటు అంతర్గత చైతన్యం నుంచీ అటు కుల ప్రాతిపదికతతో కూడిన తిరుగుబాటులనుంచీ ప్రతిఘటనోద్యమం రూపుదిద్దుకోవాలి. దళితులు తమ ఆత్మగౌరవం కోసం హక్కుల కోసం పోరాడేందుకు కావలసిన సైద్ధాంతికతనూ, స్ఫూర్తినీ దళిత మేధావులు, దళిత రచయితలు అందిస్తూనే వుండాలన్న వాస్తవాన్ని ఈ కథారచనలో నాగప్పగారి సుందర్రాజు ఆకాంక్షించారు.

నాగప్పగారి సుందర్రాజు ఒక విశిష్టమైన శైలిని అతని “మాదిగోడు” కథా సంకలనంలో సాధించారు. ఆయనది **‘మౌఖిక కథాశిల్పం’.** కవిత్వంలోని శ్రవ్య సంప్రదాయాన్ని వచన సాహిత్యం లోకి తెచ్చిన రచయితలు ముందు తరాలలో వున్నా అవి పాక్షిక ప్రమాణ ప్రాతినిధ్యంతోనే కొనసాగాయి. తెలంగాణా రచయితలలో అల్లం రాజయ్య అయితే, రాయలసీమ కథకులలో సుందర్రాజు ఈ శైలిలోనే వర్తమాన సందర్భంలో నడుస్తున్న దళితుల సాంస్కృతిక చిత్రపటాన్ని వచన సాహిత్యంలో అందించగలిగారు. ఈ శ్రవ్య కథల ప్రతిపాదనను కథాసాహిత్య విమర్శకులు వైరుధ్యంగా భావించి ఎగతాళి చేశారు. కానీ రాల్ఫ్ఫాక్స్ రా సిన **“నావల్ అండ్ పీపుల్”** (నవల– ప్రజలు) ప్రామాణిక నవలా సాహిత్య విమర్శ అయ్యింది. ఫ్యూడల్ సాహిత్య రూపమైన మౌఖిక లక్షణం, శ్రవ్య శిల్పం, రాజకీయార్థిక అవగాహనను సాహిత్యానికి అన్వయం చేసుకోకపోతే ఇలాంటి వెర్రిమొర్రి ప్రేలాపనలే వస్తాయి.

మనం ఫ్యూడల్ రూపాలు అనుకుంటున్నవి వాస్తవానికి జానపద రూపాలు. వర్గ సమాజంలో జానపదుల కష్టాన్ని, వనరులను ఆక్రమించుకొన్నట్లు గానే వాళ్ళ భాషా, సాహిత్య సంస్కృతులను పాలకులు ఆక్రమించుకుంటున్నారు. ప్రజలు పోరాటాల ద్వారా తమ శ్రమను, సాధనాలను విముక్తం చేసుకొని స్వాధీనం చేసుకున్నట్లు గానే, భాషా, సాహిత్య సంస్కృతులను స్వాధీనం చేసుకుంటారు. మౌఖిక దృశ్య కళా సాహిత్య రూపాలు ప్రజా కళా రూపాలుగా ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యం లో నడిచిన తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ప్రజల పరమయ్యాయి. ఆ తరువాత ఈ శ్రవ్య సంప్రదా యాన్ని తెలంగాణ రచయితలు అందిపుచ్చుకున్నారు. అదే ఒరవడిలో రాయలసీమ నుండి దళిత సాహిత్య సృజన కళాకారుడు నాగప్పగారి సుందర్రాజు తన కథల్లో నిక్షిప్తం చేసుకున్నాడు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2025

ఈ కథలలో మాదిగ జన జీవన సౌందర్యాన్ని పట్టిచ్చే అనేక వర్ణనలు పాఠకుల్ని మాదిగ వాడ లోని వీధి వీధి తిప్పి అబ్బా! ఎంత జీవన సౌందర్యం అని అబ్బురపడేలా చేస్తాయి అని అనడం అతిశయోక్తి కాదు.

మనుస్మృతి భావజాలంతో సమాజం దళిత జాతిని సాంఘికంగా, సాంస్కృతికంగా హత్య చేశాయి. ఆనాటి నిషేధ సంస్కృతిని ఈనాటి వరకు కొనసాగుతూ మనుషుల నర, నరాన జీర్ణించుకొని ఉందన్న నగ్న సత్యాన్ని ఈ కథ చాటి చెప్పింది.

దళిత సంస్కృతిలో భాగంగా వారిపై రుద్దిన ఆచారాలు, కట్టుబాట్లు వాళ్లను ఎంత హీనత్వానికి గురిచేస్తున్నాయో ఈనాటి తరానికి చెందిన బోడెక్క తన వ్యతిరేకతను చాలా స్పష్టంగా చెప్పినప్పటికి ఆమె అభీష్టాన్ని తీర్చే స్పందన, స్పృహ మస్తానమ్మ వంటి పాత్రలకు కూడా ఆ చైతన్యాన్ని అందివ్వలేకపోవడం కొంత కొరతగానే ఉంది. సుందరరాజు మాదిగ దండోరా ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ కూడా ఈ ఆచారాన్ని అడ్డుకొన్న పాత్రను చిత్రించడంలో మాత్రం ఎందుకో నిర్లక్ష్యం చేశారని పిస్తుంది.

మాదిగ స్త్రీల మౌన రోదనలకు ప్రాతినిధ్యం వహించిన బోడెక్కను బసివిరాలు కాకుండా అడ్డుకోలేనితనం ఊరి పెద్దలని ఎదిరించలేని తనం ఇప్పటికి రాయలసీమలో అందులోను కర్నూలు జిల్లాలో నెలకొన్న ఫ్యూడల్ సంస్కృతిలో లేవన్న వాస్తవాన్ని కూడా రచయిత ప్రాంతీయ స్పృహను, చైతన్యాన్ని ఉన్నదున్నట్లుగా చిత్రించడం ద్వారా వాస్తవికతకు దూరం కాలేదు. అయితే ఏ పాత్రకూడా ఆ ఆరాచకాన్ని నిరసించే ధైర్యాన్ని కూడా ఆనాడు ఎవరూ ప్రదర్శించలేకపోయిన నిస్సహాయ స్థితిని చిత్రించారనిపిస్తుంది. 'మద్దికేరి మార్తమ్మ' కథలో కూడా మార్తమ్మపై జరిగిన అత్యాచారానికి వెల్లువెత్తిన చైతన్యాన్ని, ఉద్యమాన్ని ఉన్నదున్నట్లుగా వాస్తవానికి దగ్గరగా చిత్రించారేగాని, కాల్పనిక సాహితీ రూపంగా మలుస్తున్న క్రమంలో కూడా కల్పనలకు అవకాశం లేకుండా ఈ కథను చిత్రించటం జరిగింది. కర్నూలు జిల్లాలో నెలకొన్న అగ్రకుల ఆధిపత్యాన్ని ఎదిరించ లేని రాయలసీమ దళితుల దీనత్వానికి ఈ కథ పరాకాష్ఠ.

"మాదిగోడు" సంపుటిలోని కథలన్ని మాదిగ దండోరా రాక ముందు నుండి కొనసాగిన వాతావరణం ఆ తర్వాత దండోరా నేపథ్యం నుండి బయటపడడానికి సుందర్రాజు లాంటి నాయకులు కార్యకర్తలు చేసిన కృషి దండోరా దాక నిలిచిన ఉద్యమాల గురించి ప్రసావిస్తాయి.

Rural nostalgia అందరికి పరిచయం. "మాదిగోడు" కథల్లో ఈ లక్షణం చాలా గాఢంగా కనిపిస్తుంది. కథకుడు ఈ nostalgiaకు పరిహారం లేదా ఎంతవరకు సమర్ధనీయం అనే ప్రశ్న పక్కనపెడితే, అసలు "nostalgia అనేది చారిత్రంగా primary disease of melancholic scholars George Slanth అన్నారు.

1980ల తర్వాత పెట్టుబడిదారీ సమాజ భీభత్సాన్ని పరిశీలించిన తత్వవేత్తలందరు కూడా ఈ nostalgiaలోకే వెళ్ళిపోయారు. సామాజిక విలువల మధ్య కొరవడిన సమతౌల్యాన్ని అన్వేషిస్తూ ఎంతో కొంత సమతౌల్యతను పాటించే బాల్యాన్ని ఆ జ్ఞాపకాల్ని అందులోని సౌందర్యాన్ని చూడగలిగారు. అందుకే ఆ గతాన్నే స్పురణలోకి తెచ్చుకోవడం ద్వారా వర్తమానాన్ని నిర్మించుకొనే స్ఫూర్తిని అందుకోవాలనే తపన నాగప్పగారి సుందర్రాజు అన్ని కథల్లోను కనబడుతుంది.

ఆధునిక కథా లక్షణాల్ని నిర్దేశిస్తూ కథా విమర్శ చేసేవాళ్ళందరూ గమనించాల్సిన అంశం కథ marginal sections agonyని వ్యక్తీకరించే క్రమంలో పొందిన పరిణామ రూపంగా ఈ కథల్ని గుర్తించాలి. వాళ్ళందరూ నాష్టాల్జియాలోని కథనం సంఘటనాత్మకతను, వాస్తవికతను సంభాషణాత్మక శైలి అన్ని లక్షణాలను ఎంత సమర్థవంతంగా పుణికిపుచ్చుకోగలిగిందో సుందర్రాజు "మాదిగోడు" కథలు అత్యంత సమర్థవంతంగా నిరూపిస్తాయి. ఇటీవల భాదర్ "దర్గామిట్ట కథల" నామిని 'మిట్టోరోడి' కథలను కథలే కాదంటూ తీసివేసిన విమర్శకులు సుందర్రాజును, గోపిని కరుణాకర్ను మాత్రం ఉపేక్షించారనుకోవడం అ సంబద్ధం. దాదాపుగా కథలే కాదంటు జరిగిన చర్చంతా రాయలసీమ కథా రచయితల చుట్టూనే ఎక్కువ సంఖ్యలో జరగటం యాదృచ్ఛికం కాదు.

Marginality అయిన ప్రాంతీయ రాజకీయాలకు, ఈ కథలపైన జరిగిన కుహనా చర్చలు దర్పణం కాదా? ఆలోచించాల్సిన సందర్భం ఇంకా చేరువ కాలేదా? అన్న మీమాంసను "మాదిగోడు" కథలు తేటతెల్లం చేస్తాయి. మౌఖిక శిల్పాన్ని కలిగి ఉండటం ఒక రకంగా జ్ఞాపకాలు కావడం రెండో కారణంగా చూపించినప్పటికి ఇవి రెండు. ఎంత బలహీనమైన అంశాలో నిరూపించేం దుకు చేసిన ప్రయత్నం మాత్రం చిన్నదే. కొంతమంది ఈ కథలపై చేసిన చర్చ జరగాల్సిన స్థాయిలో జరగలేదని మాత్రం చెప్పక తప్పదు.

"మాదిగోడు" కథల్లోని మాండలిక భాష informal సంభాషణలకు మరింత శక్తివంతంగా పని చేసిందనినడం కన్నా సుందర్రాజు భాషను ప్రయోగ పూర్వకంగా వ్యక్తీకరిచడంలో ఖచ్చితత్వాన్ని సాధించ గలిగారు. సుందర్రాజులో అద్భుతమైన భావుకత ఉంది. తన చుట్టూ వున్న ప్రపంచాన్ని అందులోని ఆత్మీయ అనుబంధాలలో అద్భుతాన్ని చూపే దృష్టి వుంది.

సృష్టిలో జరిగే హింసను సౌందర్యీకరించడం, తాత్త్వీకరించడంతో పాటు, అహింసను అనుషంగికంగా మానవ సమాజంలోనూ, రాజ్యవ్యస్థలోనూ జరిగే అమానుషత్వాన్ని కూడా ప్రస్థావించిన రచయితకు ప్రతిహింసపట్ల ఎటువంటి చింతనా ధోరణి వుంటుందో పాఠకులకు స్పురిస్తూనే వుంటుంది. మనిషికి సామాజిక స్పృహతో పాటూ అస్థిత్వస్పృహ కూడా  దళిత జీవన స్పృహను పెంపొందించుకోవడానికి దోహదపడేవి నాగప్పగారి సుందర్రాజు "మాదిగోడు" కథలు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (49) హైదరాబాద్ మార్చి : 2025

# గీత కార్మికుల వెతలను రాస్తున్న 'నేరెళ్ళ శ్రీనివాస గౌడ్'

**డా. కొత్తిరెడ్డి మల్లారెడ్డి,** తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుజూరాబాద్. ఫోన్ : 915 469 0580

**పరిచయం**

హన్మాజిపేట గ్రామానికి చెందిన రచయిత, నవలాకారుడు నేరెళ్ల శ్రీనివాస్ గౌడు రెక్కాడితే కాని డొక్కాడని పేద కుటుంబంలో కల్లుగీత కార్మిక కులంలో 1970లో జన్మించాడు. బడికెళ్ళి చదువుకొనే స్థోమత లేక బతుకుబండి నడపడం కోసం చిన్నతనంలోనే వారి కులవృత్తి తాళ్ళెక్కడం నేర్చుకున్నాడు. కల్లు గీసుకుంటూ కుటుంబానికి ఆసరాగా నిలిచాడు. మోకుతాడుతో జీవనం కొనసాగిస్తూ జీవితానుభవాలను అక్షరాలుగా మలుస్తూ బతుకుతాళ్ళ కావ్యాలల్లుతున్నాడు. తల్లిదండ్రులు కష్టపడగా వచ్చే ఆదాయం జీవనానికి సరిపోక ఆ రోజుల్లో ప్రభుత్వ బడిలో మొదలైన మధ్యాహ్న భోజన పథకంతో ఆకలి తీరుతుందని బడిలో చేరాడు. కానీ ఇంటికి పెద్దవాడు కావడంతో తన ఒక్కడి కడుపు చూసుకోవడం సరికాదని, తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండాలని 7వ తరగతిలోనే బడి మానేసి తన 16వ ఏట బొంబాయి వెళ్ళి పనిలో చేరాడు. అక్కడ ఓ కల్లు దుకాణంలో పని చేస్తూ పరిస్థితులు సరిపడక తిరిగి స్వగ్రామానికి వచ్చాడు. చివరకు కులవృత్తే సరైందని నమ్మి తాటి చెట్లు, ఈత చెట్లు ఎక్కడం, కల్లు గీయడం నేర్చుకొని అందులోనే స్థిర పడ్డాడు.

చదువుపట్ల ఉన్న ఆసక్తిగల శ్రీనివాస్‌గౌడుకు జగిత్యాల డిగ్రీ కాలేజీ లైబ్రేరియన్ ఆంజనేయులు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలో ప్రవేశం కోసం నిర్వహించే ప్రవేశపరీక్ష గురించి వివరించాడు. శ్రీనివాస్‌గౌడ్ ప్రవేశ పరీక్ష పాసై 1995లో బి.ఎ.లో చేరి డిగ్రీ పూర్తి చేశాడు. 2002లో కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య ద్వారా ఎం.ఏ. తెలుగు పట్టా పొందాడు. 2021లో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలోనే మానవ హక్కులపై పిజి డిప్లమో చేసాడు. అంతే కాకుండా అదే ఓపెన్ యూనివర్సిటీలో ఎం .ఏ. సామజిక శాస్త్రం చదువుతూనే యూజీసీ నెట్ పరీక్ష మరియూ ఇతర పోటీ పరిక్షలు కూడా రాయడం విశేషం.

**నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ సాహిత్య పరిచయం**

**"తాటి చెట్టు బిడ్డల్లా బతికే తమ బతుకుల్లోని విషాదాన్ని గూర్చి చెబుతూ మొగోల్లు తాడి చెట్లెక్కి ఇంటికొచ్చే వరకు ఆడోళ్ళ కాళ్లకు మట్టెలు, చేతులకు గాజులు ముఖానికి బొట్టు పెట్టుకోవద్దంటారు పెద్దలు, తాళ్లెక్కెటోల్లంత రోజు సావటం పుట్టడం..."** అంటూ గీత కార్మికుల గురించిన కష్టాలతో మొదలౌతుంది ఈయన సాహిత్యం. నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ కులవృత్తి చేస్తూ మోకుతాడునే 'బతుకుతాడు'గా చేసుకొని వారి బడుగు జీవితాన్ని నవలగా రాసి తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు. సాహిత్యంపై ఉన్న మక్కువతో కథలు రాయడం ఆరంభించాడు. ఈయన రాసిన తొలి కథ కులవృత్తి సుప్రభాతం వారపత్రికలో ప్రచురింపబడింది. తన తొలి రచన 2000 సంవత్సరంలో విశాల సాహితీ కథా పురస్కారానికి ఎంపికై అప్పటి హైకోర్టు జడ్జి చేతుల మీదుగా అవార్డును అందుకొన్నాడు.

నేరెళ్ల శ్రీనివాస్‌గౌడ్ మొదటి నవల **'బతుకుతాడు'** 2004లో వెలువడింది. సామాన్య కల్లుగీత కార్మికుడైన శ్రీనివాస్‌గౌడ్ "బతుకు తాడు" నవల కాకతీయ విశ్వవిద్యాలయం పీజీ స్థాయిలో ఎం.ఏ. తెలుగు విద్యార్థులకు 2020-21 సంవత్సరమునకు పాఠ్యాంశంగా ఎంపిక చేయబడింది. ఏడవతరగతి వరకు పాఠశాలలో చదివి తర్వాత పీజీ దూరవిద్య ద్వారా చదివిన తనలాంటి సామాన్యుడికి గొప్ప విజయం. ఇతర పేద రచయితలకు ఇదొక స్ఫూర్తి. నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ దుల్దుమ్మ నవల 2020లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఉత్తమ నవలా పురస్కారానికి ఎంపికైంది. సహజ మట్టి వాసనలు నింపుకున్న సాంస్కృతిక, సాహిత్య కళావైభవానికి ఈ ఎంపిక ఒక గుర్తింపును ఇచ్చింది.

తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయం, బి.ఎస్.రాములు సహకారంతో 2004లో శ్రీనివాస్‌గౌడ్ బతుకుతాడు పుస్తకం ముద్రించాడు. అలా మొదలైన ఈయన రచనా పరంపర నేటికి కొనసాగుతూనే ఉంది. 2006లో పేదోళ్ల బతుకులు, 2008లో మా బతుకులు, 2011లో సర్పంచ్, 2015 రచ్చబండ అనే నవలలు వెలువడ్డాయి. తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయంతో 2017లో దుల్దుమ్మ నవల, 2022లో కల్తీ బతుకులు కథా సంపుటి వచ్చాయి. 2022లో తన డిప్లమోలో భాగంగా **'గౌడ వృత్తి హక్కులు - అభివృద్ధి'** పేరుతో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మానవ హక్కుల విద్యా విభాగానికి ప్రాజెక్టు రిపోర్ట్ సమర్పించాడు. ఇందులో స్వీయ అనుభవాలను జోడించి గౌడవృత్తి అభివృద్ధికి కావల్సిన హక్కుల గురించి వివరంగా చర్చించారు. ఈ విధంగా సామాజిక జాఢ్యాలనే సాహిత్యాంశాలుగా మలిచి సామాజిక అభ్యున్నతికోసం పాటు పడుతున్న నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ తెలంగాణ సాహిత్య చరిత్రలో శాశ్వత స్థానం సంపాదించుకొన్నాడు అనడంలో ఎలాంటి సందేహం లేదు.

**బతుకుతాడు నవల**

శ్రీనివాస్ గౌడ్ 2004లో రాసిన మొదటి నవల బతుకుతాడు. కల్లుగీసే తండ్రి, బీడీలుచేసే తల్లి, జీవితంలో ఎదుర్కొన్న సంఘటనలు దీనిలోని ప్రధాన కథావస్తువు. కాకతీయ విశ్వవిద్యాలయం బతుకుతాడు నవలను ఎం.ఏ. తెలుగు విద్యార్థులకు 2020-21 సంవత్సరానికి గాను నాలుగవ సెమిస్టర్‌కు పాఠ్యాంశంగా ఎంపిక

చేసింది. ఈ ఎంపికను రచయిత ప్రతిభకు తార్కాణంగా చెప్పవచ్చు. నిజ జీవిత అనుభవాలను కథా వస్తువుగా ఎంచుకొని సహజ సిద్ధంగా, పాత్రోచిత సంభాషణలతో రచయిత దీన్ని తీర్చిదిద్దాడు. అప్పటి గౌడ కుటుంబ జీవితాలను ఉన్నదున్నట్లుగా ఆవిష్కరించిన నవల ఇది.

మోకుతాడే గీతకార్మికులకు బతుకుతాడు. వారు తాటిచెట్లు ఎక్కడానికి ఇదే ఆధారం. మోకు బలంగా ఉంటే గీత కార్మికుని ఆయుస్సు బలంగా ఉంటుంది. అందుకే ఇది నవలకు ప్రధానాంశ మైంది. ఈ నవల చదువుతుంటే వారి బతుకులు, వారు అనుభవించే కష్టాలు, పల్లె మనుషుల తీరు కళ్ళకు కట్టినట్లు స్పష్టంగా అర్థమౌతుంది.

ఈ నవల ప్రధానంగా తాటి చెట్టును నమ్ముకొని బతికే మూడు కుటుంబాల మధ్య నడుస్తుంది. ఆ మూడు కుటుంబాల్లో ఒకటి రచయిత పెదనాన్న కుటుంబం, రెండవది తన కుటుంబం, మూడవది తన చిన్నాన్న కుటుంబం. ఇందులోని కథ ప్రపంచీకరణ నేపథ్యంలో కులవృత్తులు పతనమవుతున్న క్రమంలో గౌడులకు ఎదురయ్యే కష్టాలను చూపిస్తుంది. అప్పటి వరకు కులవృత్తులనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారు, ప్రత్యామ్నాయం లేక ఎటూకాని బతుకులు బతుకుతున్న లక్షలాది కుటుంబాల గోడు ఇది. ఇది బడుగు వర్గాల క్షీణిస్తున్న బతుకులను చూపించే కొత్త సాహిత్య చరిత్ర. శ్రీనివాస్ గౌడ్ స్వీయ చైతన్యంతో స్వీయ చరిత్రనే సాహిత్యంగా రాస్తున్న అసామాన్యుడు.

**కల్తీ బతుకులు**

కల్తీ బతుకులు నవల కల్లు మండువ, దాని చుట్టూ ఈత వనం, తాటి వనం, కల్లు మండువలో కల్లు తాగుతున్నారు అంటూ మొదలౌతుంది. ఈ నవలలో శ్రీనివాస్ గౌడ్ సమాజంలోని కల్తీ బతుకులకు కారణమవుతున్న వారిని ప్రశ్నించడం కనిపిస్తుంది. తమ సొంత ప్రయోజనాల కోసం వస్తువులను నాణ్యత లేకుండా చేయడాన్నే కల్తీ అంటారని ఈయన పేర్కొన్నాడు. ఈ నవలలో ఆనంద్ గౌడ్, సదానందం, ఈరయ్య గౌడ్, కమల, కాటమయ్య, ఎల్లగౌడ్, ఆనంద్, రాజ్‌కుమార్ మొదలైన పాత్రలతో కల్తీ జీవితాలను కనులకు కట్టినట్లు చూపించాడు. అంతరించి పోతున్న కులవృత్తులు చూపిస్తూనే గ్రామాల్లో మద్యం వేసే చిందులు చిత్రించాడు. గౌడులు ఎంత కష్టమైనా ప్రాణాలకు తెగించి ఈత, తాటి చెట్లు ఎక్కి తమ పొట్ట కూటి కోసం కల్లు తీసి అమ్ముకొని బతుకుతున్నారు. కాని గ్రామాల్లోని ప్రజలు బీరు, విస్కీ మొదలైన విదేశీ మద్యాలకు అలవాటు పడ్డారు. చాలామంది ఆరోగ్యానికి మేలు చేసే తాటి, ఈత కల్లు తాగడానికి ఇష్టపడకుండా, గౌడ్‌లు కల్లుగీసే పరిసరాల్లోనే విస్కీ తెప్పించుకొని ఇష్టం వచ్చినట్లు తాగుతున్నారు. అంతటితో ఆగకుండా గౌడులనీ, వారు పోసే కల్లుని కల్తీగా చిత్రీకరించి తిట్టి పోస్తున్నారని అంటాడు ఈ నవలలో శ్రీనివాస్ గౌడ్. ఏ రోజు తీసిన కల్లుని ఆరోజే అమ్మడం గౌడ్‌ల నిజాయితీకి నిదర్శనం. కాని బెల్టుషాపుల్లో, వైన్సలలో అమ్మే సారాయి, ఇంగ్లీషు మందులు కల్తీ చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారంటాడు రచయిత.

ఈ నవలలో నాగయ్య నిన్న, మొన్నటి పాత కల్లుని పార బోయకుండా నేటి కల్లులో కలిపి అమ్మితే ప్రజలు ఆనందంగా తాగుతారని హితబోధ చేస్తాడు. కానీ అది వారి ఆరోగ్యానికి హానికరమని అలా చేయడానికి ఇష్టం లేదంటాడు ఆనంద్ గౌడ్. తమ వృత్తిని, ఆదాయాన్ని పోగొట్టే వైన్ షాపులపై ఫిర్యాదు చేద్దామంటే తమ గౌడ కులంలోనే కొందరు ఆ మందు తాగే వారున్నారని బాధ పడతారు గౌడ కులస్తులు. రాజ్ కుమార్ గౌడుల కల్లు ముట్టేవాడు కాదు. తాడి చెట్లకు దగ్గరలోగల అతని పొలంలో రోజూ వైన్ షాపు మందునే తాగేవాడు. అలా ఒకరోజు ఏ తప్పు లేని ఆనంద్ గౌడ్‌తో గొడవ పడి అతన్నే కొట్టి చేతులు విరిచి చెట్లకు కట్టేశాడు. ఆనంద్ గౌడ్ ఎదురు తిరుగగల శక్తి ఉన్నా తనకంటే పెద్దవాడు, భూస్వామని మంచితనంతో ఊరుకుంటాడు. అది తెలిసి దగ్గరలోని గౌండ్లవారు మరియు అనంద్ గౌడ్ అమ్మ అక్కడికి వెళ్ళి జరిగింది విచారించి అతన్ని విడిపించి తీసుకొని వెళ్తారు. తెల్లవారి రాజ్ కుమారే గౌండ్ల వారు తమ పొలంలోకి వచ్చి తనపై దాడి చేశారని పెద్ద మనుష్యులకి ఫిర్యాదు చేస్తాడు. అదీ కాకుండా ఆనంద్ గౌడ్ రోజు తమ తోటలోని కూరగాయలని దొంగతనంగా తెంపుకొని వెళ్ళాడని ఫిర్యాదులో పేర్కొంటాడు. ఈ విధంగా నిజాయితీతో బతికే గౌండ్ల వారికి కల్తీ మందుల అమ్మకందార్ల వలన కలిగే కష్టనష్టాలు, జమీందారులు చేసే ఆగడాలు ఈ నవలలో జీవం పోసుకున్నాయి.

గౌడుల జీవితాలపై ప్రపంచీకరణ ఎలా పంజా విసిరిందో తెలిపే అరుదైన రచయిత నేరెల్ల శ్రీనివాస్ గౌడ్. సమాజంలో వీరవిహారం చేసే కల్తీ వస్తువులు, గౌడుల జీవన విధానం మానవ సంబంధాలు మొదలైన అనేక విషయాలు ఈయన రచనల్లో చర్చించాడు. ఈయన రచనలు సమాజానికి రన్నింగ్ కామెంట్ లాగా ఉంటాయి. కొందరు వారి స్వలాభం కోసం పాలు, పెరుగు, నూనే మొదలైనవన్నీ కల్తీచేసి ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కల్తీ చేసేవారు వారి తప్పులను దాచి ఇతరుల తప్పులని ఎత్తి చూపుతున్నారని రచయిత చురకలు అంటించాడు.

**దుల్దుమ్మ నవల**

తెలంగాణ విమోచనోద్యమ సమయంలో, రైతాంగ పోరాటంలో ఇంకా ఇతర ఉద్యమాల్లో సామాన్య ప్రజలకు ప్రకృతి ప్రసాదించిన ఆయుధం దుల్దుమ్మ. సమాజంలో కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నంత కాలం దుల్దుమ్మతో మనిషికి అవసరం ఉంటుందని ఈ నవల తెలియజేస్తుంది. దుల్దుమ్మ ఒక పొదలాంటి చెట్టు. దాని ఆకులు కాయలు శరీరానికి తగిలితే చాలు చాలాసేపు విపరీతమైన దురద వస్తుంది. రాత్రివేళ చెట్లపైనున్న కల్లు కుండలను దొంగలబారి నుండి కాపాడేందుకు గౌడులు దుల్దుమ్మను ఆయుధంగా ఉపయోగించిన తీరు శ్రీనివాస్‌గౌడ్ ఇందులో వర్ణించాడు. దీనిలో స్వీయ రక్షణ కోసం కూడ దుల్దుమ్మను వాడిన సందర్భాలెన్నో కనిపిస్తాయి.

రచయిత తన అనుభవాలకు లోకంలో జరుగుతున్న సంఘటనలు చేర్చి సాహిత్యానికి దూరంగా ఉన్న గౌడు జీవితాలను కథలుగా మలిచాడు. అనేక కుట్రలకు లోనైన గౌడ జీవితాలను దుల్దుమ్మ పలు కోణాల్లో విశ్లేషిస్తుంది. తన జాతి వెతలు, జీవిత ఒడిదొడుకులను వివరంగా లోతుగా చర్చించాడు రచయిత.

ఈ నవల ప్రధానంగా గౌడుల పెద్దాయన నరసయ్య గౌడ్ కుటుంబం, మిగిలిన కులాల గ్రామస్తుల సంబంధాల చుట్టూ నడుస్తుంది. ఊరి పెద్దలు, ఆబ్కారి శాఖతో తమ వృత్తిలో చితికి పోతున్న కుటుంబాలకు నమూనాగా నరసయ్య గౌడ్, అతని కొడుకు, మనుమడు ఆ ఇంట్లోని ఆడవాళ్లు సాక్షీభూతాలుగా నిలుస్తారు. మూడో తరానికి చెందిన మనిషి కులవృత్తికి దూరమై పట్నవాసానికి మారడంతో కథ ముగుస్తుంది. గౌడులు వాడే పరికరాలు తాటి, ఈత చెట్లలో రకాలు, కల్లులో రకాలు వాటి రుచులు కళ్ళు పారే ఋతువులు అందుకు సిద్ధంచేసే తీరు చదువుతుంటే ఈ నవల ఒక శాస్త్రంలా అనిపిస్తుంది. ఈ కథ తాటి, ఈత చెట్లకు చెల్లించే పన్నులు వాటిద్వారా జరిగే దోపిడిని తెలుపుతుంది. ఊరి దొరకు వెట్టి కింద ఏడాదికి ఒకరు రెండు చెట్లు ఇచ్చి వాటి కళ్ళని గీసి దొర ఇంట్లో పెట్టాలి. ఇంకా ఈ నవలలో గౌడుల దేవతల పూజలు, పండుగల గురించి వివరించాడు. కాటమయ్య గౌండ్లోళ్ల దేవుడు. ముంజకాయలు కోసే ముందు ప్రతి సంవత్సరం ఆయన్ను పూజిస్తారు. రేణుక ఎల్లమ్మ వీరి ఆరాధ్య దైవం. మూడేళ్లకోసారి ఎల్లమ్మ పట్నాలు వేస్తారు. బైండ్ల పూజారులు, మేకల జడతలు, గావు, డప్పులు, గజ్జల మోత, నృత్యాలు, వంటకాలు, భోజనాలు కలిసి ఊరంతా జాతరగా సాగుతుంది. దుల్దుమ్మ నవల మాండలిక భాషతో పరిపుష్టమైంది. ఇందులో శ్రీనివాస్ గౌడ్ స్థానిక వాడుక భాషను ప్రయోగించాడు. అందుకే తెలుగు విశ్వవిద్యాలయం 'దుల్దుమ్మ' ను ఉత్తమ నవలగా ఎంపిక చేసి రచయితను రగిన గుర్తింపునిచ్చింది.

ఇంకా 2011లో వెలువడిన సర్పంచ్ కథల సంపుటిలో సర్పంచులు చేసే మోసాలగురించి వివరించాడు. వారు చేసే అన్యాయాలు ఊరి ప్రజలందరికి తెలిసేలా రాసాడు. వారికి భయపడకుండా "సర్ప"ంచ్ అంటూ వారిని పాములతో పోలుస్తూ వారి అన్యాయాలను అడ్డకుందామని ఈ నవల ముద్రించానని చెప్పుకొన్నాడు.

**ముగింపు**

శ్రీనివాస్ గౌడ్ నేటికి కులవృత్తిచేసుకుంటూ బతుకెళ్ళదీస్తూ సమాజంలో, సాహిత్యంలో తమ స్థానం ఏమిటని ప్రశ్నించే రచనలు చేస్తున్నాడు. తెలుగు సాహిత్యంలో నేరెల్ల శ్రీనివాస్ గౌడ్ గౌడకులవృత్తి చేస్తూ స్వీయ చైతన్యంతో, స్వీయ చరిత్రనే సాహిత్యంగా మలుస్తూ తెలుగు సాహిత్యంలో కొత్త సాహిత్య చరిత్ర సృష్టిస్తూ ముందుకు సాగుతున్నాడు. ఈయన రచనలు బీసీ సాహిత్య ఉద్యమంలో ఒక మైలురాయిగా నిలుస్తున్నాయి. శ్రీనివాస్ గౌడ్ జీవితం సాహిత్యం అనే అంశముపై కాకతీయ విశ్వవిద్యాలయంలో ఓ విద్యార్థిని పిహెచ్.డి పరిశోధన చేస్తూ ఉండడం గొప్ప విశేషం. అక్షరాలు రాయలేని స్థితి నుండి అక్షరాలకు పట్టాభిషేకం చేసిన అయిన జీవితం ఇతరులకు ఆదర్శం. స్త్రీ ప్రేమ ఒక ప్రవాహం లాంటిదని అది తల్లి తండ్రి మీద నుంచి భర్త మీదకు చివరకు పిల్లల మీదకు పోతుందని అందులోని స్వచ్ఛతను చూపించాడు. ఒక కష్టం తర్వాత వచ్చిన సుఖం, ఒక దుఃఖం తర్వాత వచ్చిన ఆనందంలో నిజమైన సంతోషం ఉంటుందని చెపుతాడు. కల్లు గీసే వృత్తిలో ఉన్న సామాన్య సాధక బాధకాలను, వృత్తి మూలాల్లోని వర్తమాన భూత భవిష్యత్ అల్లకల్లోల కడగండ్లను గౌండ్లొళ్ల కష్టాలను, స్త్రీల సమస్యలను వారి మానసిక వేదనను కండ్లకు కట్టినట్లు చిత్రీకరించాడు.

వీరి రచనల్లో గౌడుల జీవన విధానాన్ని తెలియజేస్తూనే పల్లెటూరు లోని భూస్వాములు, పెద్దమనుషుల మనస్తత్వాన్ని చిత్రీకరించాడు. శ్రీనివాస్ గౌడ్ రోజూ తాటి, ఈత చెట్లెక్కి మండువాలో కల్లు అమ్మి కుటుంబాన్ని పోషిస్తున్న శ్రమజీవి. తన భార్య సత్తెమ్మ బీడీలు చేస్తూ వచ్చిన పైకంతో ముద్రణకు డబ్బులు సర్దుతుంది. నేటి సమాజానికి వీరొక గొప్ప ఆదర్శం. కొడుక్కి, బిడ్డకు పెళ్లి చేసి తన బాధ్యత తీర్చుకున్నా ఇప్పటికీ కల్లుగీత పని చేస్తూనే ఉన్నాడు, కలం పట్టి రాస్తూనే ఉన్నాడు. బీడీలద్వారా వచ్చే అతి స్వల్ప ఆదాయంతో తన రచనలు ముద్రిస్తూ మనకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. తన కులానికి, కులవృత్తికి, తాను పుట్టి పెరిగిన గ్రామానికి మరియూ జగిత్యాలకు ఎనలేని కీర్తి తెచ్చాడు. నేటి యువతకు, యువ రచయితలకు శ్రీనివాస్ గౌడ్ గొప్ప ఆదర్శం.

**ఆధార రచనలు**

1. సమగ్ర గౌడుల చరిత్ర, బడ్డిగ ఆదినారాయణమూర్తి గౌడ్, శ్రీ శారదా పబ్లికేషన్స్, భీమవరం, 1993.
2. మా బతుకులు, నేరెల్ల శ్రీనివాస్ గౌడ్, పల్లవి గ్రాఫిక్ జగిత్యాల, 2009.
3. సర్పంచ్ (కథల సంపుటి), నెరెల్ల శ్రీనివాస్ గౌడ్, పల్లవి గ్రాఫిక్స్, జగిత్యాల, 2011.
4. దుల్దుమ్మ, నేరెల్ల శ్రీనివాస్ గౌడ్, శ్రీ దత్తసాయి గ్రాఫిక్, జగిత్యాల, 2017.
5. కల్తీ బతుకులు, నేరెల్ల శ్రీనివాస్ గౌడ్, శ్రీదత్తసాయి గ్రాఫిక్స్, జగిత్యాల, 2022.
6. ఉత్తమ నవలగా నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ "దుల్దుమ్మ, అభినందనలు, ఆశీస్సులు, బి.ఎస్. రాములు.
9. అట్టెం దత్తయ్య (ఇంటర్వ్యూ), తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ నవలా పురస్కార గ్రహీత, మూసీ ముచ్చట, మూసీ మాస పత్రిక, సంపుటి 26, సంచిక 5, మార్చి 2023.
10. గౌడ జీవన పురాణం 'దుల్దుమ్మ' పుస్తక పరిచయం, మన తెలంగాణ (దిన పత్రిక), 23.10.2023.

# గురువు అంటే ...

రైటర్ రాజు, నారాయణ్ ఖేడ్, ఫోన్ : 934 719 6264

అజ్ఞానపు చీకటిని పోగొట్టి
అక్షర వెలుగులు నింపే జ్ఞాని
విద్యార్థులచే అక్షర సేద్యం
చేయించే నిత్య శ్రామికుడు
మట్టి బిడ్డలకు బ్రహ్మాండాన్ని
చూపించే అక్షర యోధుడు...

ఆకాశమంత అర్థం చెప్పి
అద్భుతాలను సృష్టించే మార్గదర్శి
విద్యార్థుల ఆలోచనలకు ప్రేరణ
కలిగించే స్ఫూర్తి ప్రదాత
భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని
కలిగించే గురు బ్రహ్మ...

అక్షరాలనే గండ్ర గొడ్డలిగా మార్చి
అన్యాయాన్ని అంతం
చేసే వీరుడు
విద్యార్థుల భవిష్యత్తుకు
బంగారు బాటలు వేసే నిత్య శ్రామికుడు
అక్షరాల మాయాజాలంతో
అద్భుత ప్రపంచాన్ని సృష్టించే కళాకారుడు...

తన బోధనలో శక్తిని నింపి
జీవితానికీ అర్థం చెప్పేది గురువే
అభ్యాసంలో ఆలోచన జోడించి
విద్యాసాగరాన్ని దాటించే శిక్షకుడు
గురువు చెబితే బోధన
గురువు చూపితే మార్గం,
గురువు నడిపితే విజయం...

భక్తితో తలవంచి నమస్కరించే
ప్రత్యక్ష దైవం మన గురువే?
విద్యార్థుల హృదయాల్లో వెలిసే
సత్య స్వరూపుడు గురువే
అజ్ఞానం నుంచి జ్ఞాన మార్గం
చూపే వెలుగు దీపం గురువే...

# పరవశించి పోవు పరమశివుడు

పసుపులేటి నరసింహా రావు, ఫోన్ : 98408 56206



దేశమందు జరుపు దివ్య పండుగ నేడు,
చిత్త సిద్ధి తోడ శివుని కొలవ
అర్ధరాత్రి నందు ఆవిర్భవించంగ
లింగరూపమెత్తి నింగి కెగసి

నాట్య సృష్టికర్త నటరాజ రూపాన
తాండవంబు జేయు తన్మయించి
యోగ సృష్టి కర్త, యుద్ధ విద్య గురువు
ఆది దేవుడనుచు అంత కొల్వ

గడుపు చుందు నుండి కైలాస గిరిపైన
పహర కాయ నంది వాహనంబు
వరము లన్ని ఇచ్చు, వద్ద ధనము సున్న
తిరిపమెత్తుకొనడె తిండి కొరకు

భోళ శంకరుండు బూడిద ప్రియుడండి
వళ్ళు యంత పులుము భస్మధూళి
భూషణాలు వదలి పుర్రె దండను దాల్చి
కాటి నందు తిరుగు కాళరాత్రి

ఊరు, ఊరు నందు తిరునాళ్ళ జరుపంగ
ప్రభలు కట్టి రారె ప్రజల దండు
రేయి పవలు చేయ లింగాభిషేకము
మోక్షసిద్ధి కొరకు మొక్క హరుని

త్రిదళ పూజ చేయ నంది వాహనునకు
జాగరణలు చేసి చాట భక్తి
ఓం నమఃశివాయ మనము పలికినంత
పరవశించి పోవు పరమ శివుడు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 53 హైదరాబాద్ మార్చి : 2025

# సాహిత్య సంకీర్తకుడు 'సన్నిధానం' జన్మదిన విశేష సంచిక


**ఘట్టమరాజు,** బెంగుళూరు, ఫోన్ : 996 408 2076

షష్టిపూర్తి, సప్తతి, అశీతి, సహస్ర చంద్రదర్శన, శతజయంతి, శతవర్ధంతి సంచికల కూర్పు తెలుగు సాహిత్య ప్రక్రియల్లో విశిష్టమైనదన్న అభిప్రాయం ఇప్పుడిప్పుడే వేరూరుతూంది. ప్రసిద్ధ వ్యక్తుల ప్రతిభా పాటవాల్ని, సాహిత్య, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక సేవల్ని బేరీజు వేసిన ఈ విలక్షణ ప్రక్రియ కవిత్వ, కథా, నవల, నాటక, జీవిత చరిత్ర, స్వీయచరిత్రల మేలు కలయిక. ఇరవైయ్యవ శతాబ్దపు నాలుగవ దశకంలో ప్రారంభమైన షష్టిపూర్తి సంచిక ప్రచురణ కాలక్రమంలో తామరతంపరగా విస్తరిస్తూ, శతపత్ర సుందరమై, సహస్రదళ శోభితంగా గుబాళించింది. 1940లో వెలువడ్డ కట్టమంచి రామలింగారెడ్డి షష్టిపూర్తి సంచిక ముఖ్యంగా ఇంగ్లీషు రచనలతో, అల్పంగా తెలుగు రచనలతో మేళవించిన మేలుపొత్తం. కాని 1941లో వెలువడ్డ బ్రహ్మశ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రి షష్టిపూర్తి సంచిక, 1943లో ప్రచురింపబడ్డ జనమంచి శేషాద్రిశర్మగారి 'షష్టిపూర్త్యుత్సవ సన్మాన సంపుటము' ఈ నేపథ్యంలో పేర్కొనదగ్గ సన్మాన సంచికలు, ఈ దిశలో ఉల్లేఖింప యోగ్యమైన అమూల్య గ్రంథమే **'సాహిత్య సంకీర్తకుడు'** సన్నిధానం జన్మదిన విశేష సంచిక.

నాలుగైదు దశాబ్దాలపాటు **'గోదావరీ పావనోదార వాఃపూరం'** కడుపారా తాగి, మనసారా సరస్వతీ సమారాధనకు సమర్పితమైన సులక్షణమైన వ్యక్తిత్వం సన్నిధానం నరసింహశర్మ గారిది. ఆ మహానుభావుని ఎనబైయ్యవ జన్మదిన సందర్భంగా ఆయన సాహితీ స్నేహం చూరగొన్న వాళ్లు, పరిశోధనా మార్గదర్శకత్వంతో లాభాన్వితులైన ఆబాల వృద్ధులు ఆయన పట్ల ప్రదర్శించిన ప్రేమాదరాల సుఫలమే ఈ 'సాహిత్య సంకీర్తకుడు' అనే అభినందన గ్రంథం.

ఈ సన్మానగ్రంథంలో సన్నిధానం వారి వ్యక్తిత్వం, కృతిత్వం గురించి జ్ఞానవృద్ధులు, యువ రచయితలు, రచయిత్రులు తమకు నరసింహశర్మ పరిశోధనలో చేసిన కొండంత సాయాన్ని మరీమరీ తలుచుకున్నారు. 10 మంది కవులు శర్మగారి నిర్మల, పరోపకార పారీణతను మనస్ఫూర్తిగా కొనియాడుతూ కవితలు రాశారు. శర్మగారి ఎనలేని సాహాయ్యాన్ని జ్ఞప్తికి తెచ్చుకొంటూ పరిశోధకులు, పిన్నా పెద్దలు రాసిన 24 ఉత్తరాలు 'లేఖలు – కాలరేఖలు' అనే శీర్షిక కింద కూర్చబడ్డాయి. సన్నిధానం రాసిన తొమ్మిది వ్యాసాలు. పీఠికలూను, తొమ్మిది కవితలూనూ **'ఎంచిన రచనలు'** శీర్షికలో జతచేయబడ్డాయి. 'సాహిత్య సంకీర్తకుడు' సంపాదకులు **నామాడి శ్రీధర్, ఒమ్మి రమేష్‌బాబు** సన్నిధానంతో చేసిన సంభాషణ ప్రక్రియ

**సాహిత్య సంకీర్తకుడు**
(సన్నిధానం జన్మదిన విశేష సంచిక)
సంపాదకులు : నామాడి శ్రీధర్, ఒమ్మి రమేష్ బాబు.
పేజీలు : 274
వెల : 300 రూ.
ప్రతులకు : సన్నిధానం శాస్త్రి, సి. పి. బ్రౌను మందిరం.
20-16-24, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ -533100.
ఫోన్ : 9849168894)




వల్లనే **'కవిత్వం బతకదు'**అనే ముఖాముఖి నరసింహశర్మగారి నిష్కపట వ్యక్తిత్వాన్ని, విశాలమైన హృదయాన్ని వైవిధ్య భరితమైన దృక్పథాన్ని చక్కగా వ్యక్తం చేస్తుంది.

సన్నిధానం నరసింహశర్మగారి ఎనబయ్యవ జన్మదిన విశేష సంచిక సంపాదకులైన నామాడి శ్రీధర్, ఒమ్మిరమేష్ బాబుగారలు వాడ్రేవు వీరభద్రుడు వాడిన 'సాహిత్య సంకీర్తకుడు' (పేజి:123) అన్న మాటను 'మకుటంగా'? పెట్టామని అంటూ **"అచ్చంగా సన్నిధానం గారికి సరిపోయే సత్యవచనం ఇంతకు మించి ఊహించలేం!"** అని మురిసిపోతూ **"అందుకు భద్రుడు గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం"** (కాలపు సానపై ఓ గంధపు చెక్క – సంపాదకీయం) అని అన్నారు. సన్నిధానం వారికి 'సాహిత్య సంకీర్తకుడు, అన్న కీర్తి కిరీటం తొడగటం కన్నా, **'సాహిత్య సుగంధవహుడు'** అన్న అభిదానంతో అలంకరించడం సముచితంగా వుంటుంది. నరసింహశర్మ సాహిత్య సంకీర్తనం చేశారనటం కంటె సాహిత్య పరిమళాన్ని పదిమందికి పంచి, వాళ్ల పరిశోధనా సాఫల్యానికి తోడ్పడ్డారనటం, రచనా వ్యాసంగానికి ప్రేరణ కల్పించారనటం సూక్తం.

సన్నిధానం నరసింహశర్మ గౌతమీ గ్రంథాలయం చీకటి కొట్లలో ఏనాడూ మూల విగ్రహంగా స్థావరుడై వుండలేదు. ఆయన ఎప్పుడూ గ్రంథాలయం మూల మూలలా ధూళిదూసరితమైన బీరువాలు తెరుస్తూ, మూస్తూ, అక్కడి పుస్తకాలకు విముక్తి కలిగిస్తూ భస్మాంబరధారియై జంగమ దేవరగానే పుస్తక ప్రియులకు కనపడేవారు. శర్మ పాతకొత్తల మేలు కలయిక. మధునాపంతుల

సత్యనారాయణ శాస్త్రి, మల్లంపల్లి శరభయ్య లాంటి సంప్రదాయవాదుల సాన్నిధ్య సాన్నిహిత్యాలు కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ, సతీష్ చందర్, శిఖామణి, నిఖిలేశ్వర్, చలసాని ప్రసాద్, జయధీర్ తిరుమలరావు, ఎండ్లూరి సుధాకర్, అఫ్సర్, యాకూబ్, శిలాలోలిత, కె. గీత, కుప్పిలి పద్మ లాంటి పరిశోధకులు– వెరసి వైవిధ్య దృక్పథంతో కూడుకొన్న పాత, కొత్త, సరికొత్త రచయితల స్నేహ సౌహార్దాలు పాలూ, చక్కెరలా కలిసిపోయిన మనస్వీ. అందువల్లే వీళ్లందరికీ ప్రాణహిత మిత్రుడు కాగలిగారాయన. **"ఆయన్ని కలిస్తే చాలు. నాలోని మబ్బులు విడిపోతాయి. ఎండకాస్తుంది. వెలుగు వస్తుంది. కలిసిన ప్రతిరోజూ నాకు Sunny Dayనే. అంటే మంచి రోజే"** (పేజి: 148) అంటారు కవి, పాత్రికేయులైన సతీష్ చందర్. పరిశోధకుల పాలిటి పెన్నిధి శర్మగారి గురించి శిలాలోలిత ఇలా అంటారు– **"కొందర్ని మనం మర్చిపోలేం వాళ్ళు పూర్తిగా మనసు ఆక్రమించిన తర్వాత వాళ్లను వదులుకోలేం."** (పేజి: 146) **"హైదరాబాద్ వచ్చాక కూడా ఆయన ఆప్యాయత మరువ లేనిదే, తమ్ముడూ అంటూ యాకూబ్‌ని ప్రేమించే వారు. కుటుంబ సభ్యుల్లా చూసేవారు. మనుషులు ఆత్మీయంగా ఎలా జీవించవచ్చో ఆయన దగ్గర నేర్చుకోవచ్చు."** (పేజి: 147) బతుకుబడిలో పాఠాలు నేర్పే గురువులు చాలా మంది వుండొచ్చు. కాని పొత్తపుగుడిలో జీవిత పాఠాలు బోధించే దేశికోత్తములు– సన్నిధానం శర్మలాంటి వాళ్లు అపురూపం. గౌతమీ పుత్ర నరసింహ శర్మ సాన్నిధ్యంలో పరిశోధన పాఠాలు నేర్చి పేరు పెంపులు పొందిన యువతీ యువకులెందరో! **"మొలకలే పెరిగితే మూక మాకులు గావా!"** అని తాళ్ళపాక అన్నమయ్య వూరకే అన్నారా మరి!

'సాహిత్య సంకీర్తకుడు' అభినందన గ్రంథంలో వ్యక్తిగత గరిమను మనసారా పొగడిన అభిమానులు 46 మంది అయితే, శర్మగారి నిస్స్వార్థ, నిర్మల సేవను కొనియాడిన కవులూ కవయిత్రులు 10 మంది. కులమత రాగద్వేషాలు అతీతులైన భోళాశంకరులీ శర్మగారు. **'అందరికీ మంచివాడు అనంతయ్య'** అన్న సామెతకు ఇంతకంటే మిన్న అయిన సన్నిధాన నరసింహుడు మరొక్కడు మనకు దొరుకుతారంటారా?

**"భాండాగారంలోని ప్రతి పుస్తకాన్ని స్పృశించి అహల్యలా కొత్త రూపాన్ని ప్రసాదిస్తాడు"** (పేజి: 174) అని కవి బీరం సుందరరావు గారన్నారంటే **'సన్నిధానం మన పెన్నిధాన'**మే కదా!

సంపాదకులు **'లేఖలు– కాలరేఖలు'** శీర్షిక కింద 16 పేజీల పాటు విస్తరించిన లేఖల్లో విలువైనవి ఆరుద్ర (పేజి: 185–187) జయధీర్ తిరుమలరావు (పేజి: 196–190) స్మైల్ అనబడు ఇస్మాయిల్ (పేజి: 196–197) గారలవి మాత్రమే.

ఉత్తరాలు రాసిన రచయితల, వాటిని అందుకొన్న సన్నిధానం వారి వ్యక్తిత్వం లోని సొబగులు స్పష్టమవుతాయి. కాని నరసింహశర్మ సాహితీ మిత్రులకు రాసిన లేఖలు మచ్చుకైనా లేకపోవటం ఈ అభినందన గ్రంథ ఘనతకు కొంత కొరతే మరి! ఇక శర్మగారు రాసిన 9 వ్యాసాలు, సమీక్షలు, పీఠికలు విషయ వైవిధ్యానికీ, వైశిష్ట్యానికీ మెచ్చుతునకలు. ఇక ఈ పుస్తకంలో సంకలింపబడ్డ 10 కవితల్లో **'నారాణ్మహేంద్ర నగరమా!'** (పేజి: 256–264) కవిత సన్నిధానం వారి స్వస్థాన వైభవ ప్రేమను పాఠకుల హృదయ మందిరాల్లో నెలకొనేలా చేస్తుంది. ఒకనాడు రాజమహేంద్రవరం కందుకూరి, కొక్కొండ, శ్రీపాద కవిపండిత సింహ శార్దూలాలకు **'ఆంధ్రభాషా సమర స్థలంగా'** (పేజి: 259) వుండింది. కాని సన్నిధానం వారు తమ నిష్కల్మష హృదయం, స్నేహసిక్త వచస్సు, నిరపేక్ష బుద్ధుల అండదండలతో ఈ పట్టణాన్ని ఆంధ్రభాషా సమరస స్థలంగా చిత్రించారు.

ఈ గ్రంథం చివరి రచన సంపాదకులైన నామాడి శ్రీధర్, ఒమ్మి రమేష్‌బాబు గారల **'సన్నిధానంతో సంభాషణ'** శర్మగారి నిర్మొహ మాటమైన, స్పష్టమైన, సమరసమైన అభిప్రాయాల్ని పాఠకుల ముందుంచింది. సన్నిధానం నరసింహశర్మగారు సాధించిన అష్ట సిద్ధులు, రచించిన ఎనిమిది పుస్తకాల గురించి సంక్షిప్త వ్యాసాలైనా 'సాహిత్య సంకీర్తకుడు' లో కనపడక పోవడం పాఠక మిత్రులకు బాధాకరం కాదంటారా?

## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే


ఉత్తమ గ్రంథం **'కదంబం'**.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక** సంపుటి -28 : సంచిక - 5 (55) హైదరాబాద్ మార్చి : 2025

# 'నాతి చెరామి' కథలు – వస్తువు

**తుడుం మోహన్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 99496 3869677




తెలుగులో స్త్రీవాద సాహిత్యం రాసిన వారిలో స్త్రీలతోపాటు పురుషులు కూడా ఉన్నారు. అటువంటివారిలో జగిత్యాల జిల్లాకు చెందిన కె.వి.నరేందర్ ఒకరు. కథలు, కవిత్వం, నవలలు రాసిన ఈయన సింగిల్ కాన్సెప్ట్ కథలు అంటే ఒకే వస్తువుని తీసుకొని కథలు రాయడంలో సుప్రసిద్ధులు. తెలుగు కథా సాహిత్యంలో ఇదొక వినూతన ప్రయోగం. ఇలా ఏకాంశంగా అమ్మ పాత్రని వస్తువుగా తీసుకొని రాసిన కథలు **"అమ్మ"** పేరుతో, నాన్న ప్రధాన పాత్రగా రాసిన కథలను **"నాన్న"** పేరుతో, ఇల్లాలు ప్రధానాంశంగా రాసిన కథలు **"నాతిచెరామి"** పేరుతో, పిల్లలే ప్రధాన భూమికగా **"బురదలో జాబిల్లి"** పేరుతో, తెలంగాణలోని పల్లె జీవితాన్ని కథలుగా రాసి **"ఊరు"** పేరుతో, నగర జీవితాలపై రాసిన కథల్ని **"సిటీ"** పేరుతో, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కుటుంబాల్ని, ఆ కుటుంబాల్లో జరుగుతున్న సంఘర్షణలని ఆధారంగా చేసుకొని రాసిన కథలను **"పోరు"** అనే పేరుతో, పరిశుభ్రత, స్వచ్ఛతపై రాసిన కథలు **"చీపురు"** పేరుతో పుస్తకాలుగా ముద్రించారు.

14 కథలతో వచ్చిన నాతిచెరామి కథలు స్త్రీల ఆర్థిక, సామజిక, కుటుంబ సమస్యలు, వరకట్న సమస్య, పిల్లలు కాలేదనే సమస్య, రాయకీయ పదవులకోసం ఇద్దరి కంటే ఎక్కువ సంతానం కనకుండా నిర్బంధించడం, ఉద్యోగం చెయ్యాలనే ఒత్తిడి, భర్త తాగి వచ్చి కొట్టడం, భర్త పరాయి స్త్రీలతో అక్రమ సంబంధాలు పెట్టుకోవడం వంటి సమస్యల గురించి తెలుపుతాయి. **"గుండెనెందుకిచ్చావురా దేవుడా"** కథలో పదహారేండ్ల లలిత హఠాత్తుగా చనిపోయాక ఆమె చావుకు కారణం ఎవరో తెలియక జైలులో ఎవరు కటకటాలు లెక్కపెట్టాల్సి వస్తుందోనని తల్లి, తండ్రి, అన్న, అక్క బావ, పక్కింటి అబ్బాయి అందరు భయపడడం వల్ల ఆమెని మానసికంగా వారు ఎంతగా వేధించారనేది అర్థమౌతుంది. చనిపోయే ముందయినా ఆమెతో కలిస్తే బాగుండనే పక్కింటి సారథి మాటలు చనిపోయిన శవాన్ని కూడా కామంతో చూస్తున్న కీచకుల స్వభావాన్ని గుర్తుచేస్తుంది. తాము చెప్పిన వారినే పెండ్లి చేసుకోవాలని తల్లిదండ్రులు ఆడపిల్లల మీద ఒత్తిడి తీసుకువచ్చి వారి స్వేచ్ఛని హరించడం. శవాన్ని చూడటానికి వచ్చిన వారు ఎవరిని ప్రేమించి మోసపోయిందో అందుకే ఆత్మహత్య చేసుకున్నట్టుంది అనడం వలన ఆడపిల్ల చనిపోతే ఎంతమంది ఎన్ని రకాలుగా అనుమానిస్తారు, ఎంతమంది ఎన్ని నిందలు వేస్తారో అర్థమౌతుంది. అందమైన మరదలు మీద కన్నేసిన బావలు, అవకాశం కోసం ఎదురుచూసే అబ్బాయిల గురించి జాగ్రత్తగా ఉండాలని తెలుపుతుంది ఈ కథ.

తల్లిదండ్రులని కాదని ఇంట్లోనుండి వెళ్ళిపోయి ప్రేమించిన అబ్బాయిని పెళ్ళి చేసుకొని మోసపోయిన అమ్మాయి గురించి తెలిపే కథ **"ఎబిసిడి"**. ఈ కథలో రోష్ని అమెరికాలో పుట్టి పెరిగి అమెరికా యువకుడైన హెన్రిక్‌ని లవ్ చేసి తల్లిదండ్రుల మాట కాదని ఇంట్లో నుండి వెళ్ళిపోయి ప్రేమించినవాడిని పెళ్ళి చేసుకుంటది. కొన్ని రోజుల తర్వాత వాడికి మరొక అమ్మాయితో సంబంధం ఉందని తెలుస్తుంది. అమెరికా వాళ్ళకు ఈ రోజు ప్రేమ రేపు పెళ్ళి ఎల్లుండి విడాకులు అంటారు. కాబట్టి నువ్వు అమెరికా అబ్బాయిని చేసుకోవడం వద్దని తల్లి సునంద ఎంత చెప్పినా వినకుండా వెళ్ళిన రోష్నికి హెన్రిక్ నిజస్వరూపం చూశాక జ్ఞానోదయమైంది. ఇలా ఎందరో అమ్మాయిలు తల్లిదండ్రుల మాటలు వినకుండా బంగారు భవిష్యత్తుని నాశనం చేసుకుంటున్నారు. అమ్మానాన్నల మాట వినకుండా తప్పుచేశానని తెలుసుకొని తిరిగి తల్లిదండ్రుల దగ్గరికి చేరుకుంటున్నారు.

ఒకరిని ప్రేమించి మరొకరిని పెళ్ళి చేసుకున్న ఆడది ఎదుర్కొనే సమస్యల గురించి **"నిదురించే తోటలోకి"** కథలో చూడవచ్చు. మాధురి ఒక వ్యక్తిని ప్రేమించి అనివార్య కారణాలవల్ల మరొకరిని పెళ్ళి చేసుకుంటుంది. మాధురి దూరమవ్వడంతో ఆమెని ప్రేమించిన అబ్బాయి ఆత్మహత్య చేసుకొని చనిపోతాడు. నీ కారణంగానే మా అన్నయ్య చనిపోయాడని అతని తమ్ముడు మాధురికి ఉత్తరాలు రాస్తూ డబ్బులు పంపించమంటాడు. నీవు నాకు డబ్బులు పంపించకపోతే **"మీరు రాసిన ఉత్తరాలు... మీ ఫొటోలు మీ వారికి పంపించి మీ జీవితాన్ని నరకప్రాయం చేయాల్సి వస్తుంది"** (నాతి చెరామి. 2003: పుట:86) అని బెదిరిస్తాడు. ఈ విషయం భర్తకు తెలిస్తే తన సంసారం కూలిపోతుందని భయపడి మానసిక వేదనకు గురవుతున్న మహిళ జీవితాన్ని తన భర్త సుఖవంతం చేయడంతో కథ ముగుస్తుంది.

నమ్మకం లేని సంసారం పునాదిలేని ఇల్లు వంటిది. అవి ఎక్కువ కాలం నిలువలేవు. భార్యాభర్తలు కలకాలం కలిసి ఉండాలంటే ఒకరిమీద ఒకరికి బలమైన నమ్మకం ఉండాలి. చిన్నదానికి పెద్దదానికి అనుమానపడే భర్తల వలన భార్యలు మానసికంగా ఎలా కుమిలిపోతున్నారో **"నిన్నటిదాకా శిలనైనా"** కథలో చెప్పబడింది. దమయంతి ఒక లెక్చరర్. మగ పిల్లలకు ట్యూషన్ చెప్పద్దని భర్త శ్రీధర్ వార్నింగ్ ఇస్తాడు. దమయంతి తన స్టూడెంట్

రామారావుని ఇంటికి పిలుచుకొని సితారా వాయించమని సంగీతం వినేది. అది చూసిన భర్త శ్రీధర్ మగ పిల్లల్ని ఇంటికి ఎందుకు తీసుకువస్తున్నావని తిడుతాడు. ఒకరోజు రామారావు దమయంతి ముందు నాగిన్ మ్యూజిక్ వాయిస్తుంటే చివరి దశలో అత్యంత ఉద్రేకంగా వేళ్ళు కదిలి బ్లేడు విరిగి, తీగలు తెగి రామారావు చూపుడు వేలిని కోస్తాయి. అది చూసి గుండెలవిసిపోయిన దమయంతి రక్తం కారుతున్న రామారావు వేలు నోట్లో పెట్టుకున్నందుకు శ్రీధర్ దమయంతిని కొడుతాడు. ఏ తప్పు చేయని ఆమెని ఎన్నో రకాలుగా అనుమానించి విడాకులు ఇస్తాడు. దమయంతి ఎందుకిలా చేసిందని తెలుసుకుంటే వారు విడిపోయేవారు కాదు. అనుమానమనే అడ్డుగీత గీసి భార్యలకు విడాకులిస్తున్న భర్తలు వివాహ వ్యవస్థని తృణప్రాయంగా తెంచు కుంటున్నారు. మగాడు కావాలనుకున్నప్పుడు ఆడది ఆయనకు భార్యగా రావాలి అవమానించి, అనుమానించి వెళ్ళగొట్టినప్పుడు వెళ్ళిపోవాలి అనే విధంగా ప్రవర్తిస్తున్నాడు పురుషుడు. అనుమానం అనేది పచ్చని కాపురాల్లో చిచ్చుపెట్టి దావాగ్నిలా మారుతుందని ఈ కథ ద్వారా చెప్పాడు రచయిత.

పెళ్ళయిన తర్వాత తమ స్వార్థం కోసం భార్యని బలవంతంగా రాజకీయాల్లోకి ప్రవేశ పెట్టి రాజకీయ పదవుల కోసం వారిని చిత్ర హింసలు పెడుతూ భార్యల పేరుమీద భర్తలే పరిపాలన చేస్తున్నారు. పదవుల పేరిట రాజకీయ రంగంలో స్త్రీలు ఎదుగుతునట్టు కనిపిస్తున్నా భర్తల చేతిలో కీలుబొమ్మల్లాగే ఉంటున్నారనడంలో సందేహం లేదు. **"అవిశ్వాసం"** కథలో భర్త ఒత్తిడితో రాజకీయాల్లో అడుగుపెట్టి శ్వేత మండల అధ్యక్షురాలు స్థాయికి ఎదుగుతుంది. ఆమె మూడవసారి గర్భవతి అయ్యాక పదవి పోవద్దని భర్త అబార్షన్ చేపించుకోమంటాడు. శ్వేత ఒప్పుకోకుంటే బలంగా ఆమె కడుపు మీద గుద్ది అబార్షన్ చేపించడం పురుషునికి గల రాజకీయ కాంక్షని తెలుపుతుంది. బిడ్డని కనకుండా చేసిన పదవి తనకు వద్దని రాజీనామా చేస్తానంటది శ్వేత. **"నువ్వు రాజీనామా చేస్తే.. నేను విడాకులిస్తాను. ఆఖరు అస్త్రం ప్రయోగించబడింది. శ్వేత మౌనంగా తల దించుకుంది. ఆనాడు పెళ్ళిపీటలపై.. కూచున్నప్పటిలాగే.."** (నాతిచెరామి. పుట:82) పేదరికంలో మునిగిన తల్లిదండ్రుల కోసం శ్వేత వంటి ఎందరో అమ్మాయిలు కసాయివాడి ముందు గొర్రెపిల్లలా పెళ్ళి పీటల మీద తల వంచుకొని తాళి కట్టించుకుంటున్నారు. పెళ్ళిపీటల మీద ఆడపిల్ల ఎందుకు తలవంచుకొని కూర్చుంటారో **"ఏడడుగుల కింద"** కథలో ఇలా చెప్పాడు. **"మీరంతా స్కూటర్లు, టీవీలు, బీరువాలు, ఫ్రిజ్‌లు ఆ మూడు ముళ్ళలో కుక్కి కట్టు వేస్తుంటే మా మెడలు వంగిపోవా"** (కథమానం భవతి, పుట:208) హాస్యాస్పదంగా చెప్పినా ఈ మాటల్లో నిప్పులాంటి నిజముంది.

మధ్యతరగతి కుటుంబంలోని భర్తలు టెస్ట్‌ట్యూబ్ బేబీని కనివ్వడానికి భార్యలని కిరాయి గర్భవతులుగా మార్చుతూ వారిని ఎంత వేధిస్తున్నారో **"పరిహారం"** కథలో చూడవచ్చు. ఐదు లక్షల కోసం రాజేశ్ తన భార్యని కిరాయి గర్భవతిగా మార్చుతాడు. ఆమెకు ఇష్టం లేకున్నా రాజేష్ కోపాన్ని చూడలేక సువర్చల టెస్ట్ ట్యూబ్ బేబీని కనివ్వడానికి ఒప్పుకుంటది. ఆమె ప్రసవించగానే పసిబిడ్డని తీసుకొచ్చి రాజేష్ ముందే హాస్పిటల్ సిబ్బంది వేరే వాళ్లకు ఇస్తారు. ఒప్పందం ప్రకారం వారు డబ్బులిచ్చి అగ్రిమెంట్ మీద రాజేష్ సంతకాలు తీసుకొని వెళ్ళిపోతారు. అప్పుడే డాక్టర్ బయటకు వచ్చి ప్రసవ సమయంలో మీ భార్యకు శ్వాస తీసుకోవడం ఇబ్బంది అయింది. **"అయాం సారీ... మీ భార్య చనిపోయింది..."** (సిటీ, పుట : 114) అంటుంది. ఐదు లక్షలకు ఆశపడి కట్టుకున్న భార్యని కాటికి పంపాడు. పిల్లల్ని కనే యంత్రంలా భార్యని భావించాడు. ఆమె ఎంత వద్దన్నా తన పట్టు విడువకుండా టెస్ట్ ట్యూబ్ బేబీని కనివ్వడానికి ఒప్పించాడు. కాలం మారినా స్త్రీలకు పరిపూర్ణమైన స్వేచ్ఛ రాలేదు. ఇంట్లో భర్త ఏది చెప్పినా గంగిరెద్దులా తల ఊపాల్సిందే.

తొందరపడి విడాకులు తీసుకున్నవారి పరిస్థితి ఎలా ఉంటదో **"అలసి పోయాను ప్రభూ"** కథలో చూడవచ్చు. శారద తన భర్త నుండి విడాకులు తీసుకొని పుట్టింటికి వచ్చాక వదిన మాట్లాడటం తగ్గిస్తది. ఆఫీసులో అందరు శారద ఏదో తప్పు చేసినట్టు విచిత్రంగా చూస్తారు. భర్త నుండి విడాకులు తీసుకున్న బాధ కన్నా వీళ్ళంతా ఆమెని ఒంటిరి చేయడం ఎక్కువ బాధగా ఉండేది. శారదని బాధలో నుండి బయటకు తేవడానికి నాన్న ఒక జోక్ వేస్తాడు శారద నవ్వుతుంది. ఎంటా నవ్వు మొగుణ్ని విడిచి మూడు రోజులకే ఎలా నవ్వుతుందో అని అందరూ అనుకుంటారని అమ్మ కోప్పడుతది. ఆడది నవ్వడం కూడా తప్పే, మనసార నవ్వుకునే స్వేచ్ఛ కూడా ఆడదానికి లేదనిపిస్తుంది. అందుకే **"నేనొక స్త్రీని నేనొక నిషిద్ధ జీవిని మొన్నటి దాకా నా నవ్వు నిషిద్ధం నిన్న నా చదువు నిషిద్ధం నేడు నా బ్రతుకు కూడా నిషిద్ధమే"** (నీలి మేఘాలు,1993:పుట:) అనే మాటలు వాస్తవాలు. రెండు సంవత్సరాల తర్వాత ఇద్దరు కలిసి మనసు విప్పి మాట్లాడుకుంటారు. ఇంటికి వచ్చి నేను మళ్ళీ నాభర్త దగ్గరికి వెళుతాను అంటది. అంతలోనే అస్సలు ఊరుకోను మా మధ్యలోకి రావడానికి నువ్వు ఎవరు? మా మధ్యలోకి వస్తే ఊరుకునేది లేదని ఆయన రెండో భార్య శారదకు వార్నింగ్ ఇస్తది. ఆవేశంతో తొందరపడి విడాకులు తీసుకుంటే ఆ తర్వాత వచ్చే పరిణామాలు ఎలా ఉంటాయో ఈ కథలో తెలియజేశాడు కె.వి. నరేందర్.

పేద కుటుంబంలో, తక్కువ కులంలో పుట్టిన ఆడది అందంగా ఉండడం కూడా ఆమెకు ప్రమాదాన్ని తెస్తుందని **'దొరుంచుకున్న దేవక్క'** కథలో చూపించాడు రచయిత. దేవక్క అందానికి రుచి మరిగిన ఆనందరావు దేవక్క భర్తని చంపి చెరువులో పడేస్తాడు. దొర పట్నం వెళ్ళిపోయాక దేవక్క ఒంటరిది అవుతది. ఎందరో కామాంధుల చేతిలో నలిగిపోతది. ఎయిడ్స్ వ్యాధితో చనిపోతది. ఈ విధంగా స్త్రీలు సమస్యల గురించి తెలియజేస్తూ నాతి చరామి అనే పదాన్ని నాతి చెరామిగా మార్చి స్త్రీల బాధల్ని కథల రూపంలో అందించిన కె.వి.నరేందర్ తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయులు.

❖ ❖ ❖ ❖ ❖

# జీవన సమరం – బి.సి. అస్తిత్వ ప్రకటన

**డా. మద్దిరాల సత్యనారాయణ రెడ్డి,** అధ్యాపకులు, తెలుగు విభాగం, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం. నల్లగొండ.
ఫోన్ : 9502771776

**"వృత్తులు వేరైనా మా నెత్తురు ఒకటే"** అనే నినాదంతో బి.సి.లు ఈ సమాజానికి పునాదిరాళ్లుగా కనిపిస్తున్నారు. బి.సి.లు సమాజంలో వివిధ రకాల వృత్తులను నిర్వహిస్తూ ఆత్మగౌరవంతో జీవిస్తూ, తమ అస్తిత్వాన్ని కాపాడు కుంటున్నారు. బి.సి.ల అస్తిత్వాన్ని ప్రకటిస్తూ వెలువడిన సాహిత్యమంతా బి.సి.సాహిత్యమే. నేడు తెలుగు సాహిత్యంలో బి.సి. సాహిత్యం ఒక ప్రభంజనంలా కనిపిస్తుంది.అలా బి.సి.ల అస్తిత్వాన్ని చిత్రిస్తూ వెలువడిన నవలలో ఎం.వి. తిరుపతయ్య రాసిన **'జీవన సమరం'** నవల ప్రముఖంగా కనిపిస్తుంది. ఈ నవల సమాజంలో ఉన్న వృత్తులనే కాకుండా, మానవ సంబంధాలు, సంస్కృతి, సంప్రదాయాలు కూడా ప్రతిభావంతంగా చిత్రించింది.

జీవన సమరం నవలలో భద్రమ్మ బాలమల్లుతో కూడిన పేద కుటుంబం ప్రధానంగా కనిపిస్తుంది. భద్రమ్మ బాలమల్లు కొడుకు నందు. ఈ నందు చదువు చుట్టూ నవల ఇతివృత్తం తిరుగుతుంది. భద్రమ్మ బాలమల్లు కుటుంబం రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం. భద్రమ్మ పనికిపోతేనే ఆ రోజు పూట గడిచేది. బాలమల్లు మాత్రం బాగా తాగి బాధ్యత లేకుండా తిరిగేవాడు. నందు చదువు దృష్టికోణం నుంచి నవల ఇతివృత్తం మొత్తం నడిచినా, రచయిత ఎక్కడా కూడా నందు కథానాయకుడిని ప్రకటించలేదు. నందు అనేక కష్టాలను ఎదుర్కొని చదువును కొనసాగిస్తుంటాడు. నందు ఒకవైపు చదువుకుంటూనే, మరోవైపు తన చుట్టూ జరుగుతున్న వాస్తవ పరిస్థితులను నిశితంగా గమనిస్తూ ఉంటాడు.

నందు చుట్టూ ఉన్న ఈ పరిస్థితులలో బి.సి. అస్తిత్వం స్పష్టంగా కనిపిస్తుంది. సారంగపాణి, ఆర్.ఎం.పి మల్లేశం, వెంకన్న, రాధమ్మా, శ్రీను, పుల్లయ్య, చెన్నమల్లు, రాముడు మొదలైన పాత్రలన్నీ బి.సి. సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలుగా కనిపిస్తాయి. రచయిత తాను పుట్టి పెరిగిన గ్రామాల్లోని జీవన విధానాన్ని, ఆచార వ్యవహారాలు, మానవ సంబంధాలను విస్తృతంగా చిత్రించారు. సమాజంలో ఉన్న నమ్మకాలు, విశ్వాసాలు, కట్టుబాట్లతో పాటు ఆహారపు అలవాట్లను కూడా చిత్రించారు. తెలంగాణ ప్రజలు భోజనప్రియులు. ఆ భోజనంలోకి మాంసాన్ని ఎక్కువగా ఇష్టపడతారనే విషయం ఈ నవలలో మన ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అలాగే కల్లు ప్రస్తావన కూడా కనిపిస్తుంది. ధర్మరాజు పల్లెలో దసరా పండగనాడు రాఘవులు ఉదయం లేవగానే మాంసం తయారయ్యే సరికి ఆలస్యమవుతుందని కోడిని కోయించి వండిస్తాడు. కల్లు తాగుతూ ముందుగా కోడి కూర తింటారు. కాబట్టి తెలంగాణ ప్రాంతంలో మేకలు, గొర్రెలు, కోళ్ళను విరివిగా పెంచుతారు.

జీవన సమరం నవలలో కల్లు, మాంసం ప్రస్తావన అనేక సందర్భాల్లోనూ చూడవచ్చు. **"భద్రవా! ఇవాళ పెద్ద పండగ గాదే. పూటకు లేనోని కాన్నుంచి పటెండ్లు, దొరలూ, దాతలందరి బజార్లన్నీ కల్లు, సారా, మాంసం వాసనతో నిండిపోతాయ్. గట్లయితేనే మన తెలంగాణలో దసరా పండగ చేసుకున్నట్లయితది"** అని రచయిత రాఘవులు పాత్ర ద్వారా పలికించడం వల్ల తెలంగాణ ప్రజలు ఆహార అలవాట్లకు ఎంత విలువిస్తారో అర్థమవుతుంది. **"తెలంగాణ ప్రజలు మద్యమాంసాలతో పాటు కల్లు కూడా చాలా ఇష్టంగా స్వీకరిస్తారు. ఇక్కడి కష్టజీవులు అయిన స్త్రీలు కూడా కల్లు, మద్యం లాంటివి తాగుతారు. జీవన సమరం నవలలో ముసలమ్మ మద్యం తాగడం వలన ఆరోగ్యం చెడిపోయి, చివరికి మరణించింది కూడా. నవలలో కల్లు ప్రస్తావన చాలాసార్లు వచ్చింది. కల్లు మద్యమంత ప్రమాదకర మైనది కాదు. అందుకే స్త్రీలు కూడా కల్లు తాగడం చూస్తాము. బాలమల్లు కల్లు సీసాలు ఇంటికి తెచ్చి తల్లికి భార్య భద్రమ్మకు తాగిస్తాడు".**

జీవన సమరం నవలలో బి.సి. కులాలను ఆలంబనగా చేసుకొని జీవించే అనేక వృత్తి గాయకుల చిత్రణ ఉంది. తెలంగాణలో ప్రముఖంగా కనిపిస్తున్న పాండవుల కథ వివరణ ఉంది. ఒకనాడు నందు బడి తప్పించి వెంకన్నతో కుంటకట్ట కింద స్మశానం దగ్గర కాలక్షేపం చేస్తుంటారు. అప్పుడే అటుగా వస్తున్న పందరి మాస్టారుని చూసి అతనికి కనపడకుండా వేరే దారిలో వస్తారు. ఆ దారిలోనే కలంగడి ఉంది. అందులో పాండవుల కథ చెబుతుంటారు. ఈ పాండవుల కథకులు ముదిరాజుల వృత్తి గాయకులుగా మనకు కనిపిస్తూ, పాండవులను గురించిన అద్భుత కథలను ఆలపిస్తారు. వాళ్లు కథ చెప్పే తీరు నందుని బాగా ఆకర్షించింది. వాళ్లు కథలు చెబుతూ మధ్య మధ్యలో కల్లు కావాలని ముందే చెబుతారు. నందు స్కూలుకు పోయివచ్చే దారిలో జరిగే పోచమ్మ గుడి దగ్గర పూజలు, కల్లు దుకాణంలో చెప్పే పాండవుల కథలు, ఒగ్గు కథలు, ఆటగాళ్ళు చేసే గారడీ విన్యాసాలు, కోతుల్ని, ఎలుగుబంట్ల నాడించి, పాము ముంగీసకు పోట్లాట పెట్టి ఆడించి పొట్ట పోసుకునే వాళ్ళు మొదలైన అనేక కళారూపాలను తిరుపతయ్య సమగ్రంగా చిత్రించారు.

ధర్మరాజుపల్లె, సీతారాంపురం, కురమగూడెం, కరీమాబాద్ లాంటి గ్రామాలలో ఉన్నటువంటి సామాజిక, సాంస్కృతిక విషయాలను, అక్కడ జరిగే ఉత్సవాలను రచయిత కళ్లకు కట్టినట్లు చిత్రించారు. గ్రామాలలో వ్యవసాయ సంబంధంగా ఉన్న రైతుల నమ్మకాలను వాస్తవ దృష్టికోణం నుంచి చిత్రించారు. ఇంకా

తెలంగాణకే పరిమితమైన పూల పండుగ అయినా బతుకమ్మను, ఆ సందర్భంగా తయారు చేసే పిండి వంటలను, బతుకమ్మ నిమజ్జనం వంటి సాంస్కృతిక సంబంధమైన అనేక విషయాలను హృదయాలకు హత్తుకొనేలా వర్ణించారు. దసరా పండగ విశిష్టతను, జమ్మి ఆకుల ప్రాధాన్యాన్ని, పాలపిట్ట దర్శనాన్ని చక్కగా వర్ణించారు. తెలంగాణ సాంస్కృతిక ప్రత్యేకతను చాటే పండుగలలో హోలీ ఒకటి. ఈ పండుగ ప్రత్యేకతను, పండగ రోజు పాడే పాటలను రచయిత సహజ సిద్ధంగా చిత్రించారు.

జీవన సమరం నవలలో చావుకు సంబంధించిన విషయాలను ప్రత్యేకంగా వర్ణించాడు. బాలమల్లు తల్లి ముసలమ్మ మరణించింది. ముసలమ్మ శవయాత్ర, దింపుడు కళ్ళం, తలకొరివి పెట్టి దహనం చేయడం, పిట్టకు పెట్టడం, దశదిన కర్మ చేయడం, నిద్రలు చేయడం, కడుపు చల్ల చేయడంలాంటి తెలంగాణ ప్రాంతపు నమ్మకాలు, విశ్వాసాలను విస్తృతంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి రచయిత సఫలీకృతుడయ్యాడు.

తిరుపతయ్య సమాజ నిర్మాణానికి మూలకారకులైన పునాది వర్గాల రూపంలో ఉన్న బి.సి.లతో పాటు, సమస్త వర్గాల సామాజిక వైరుధ్యాలను బహుచక్కగా వర్ణించారు. ఈ నవలలో రచయిత చెప్పిన అనేక సన్నివేశాలలో బి.సిల అస్తిత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. కాబట్టి ఈ జీవనసమరం నవలలో జీవన పోరాటం చేసిన వర్గాలలో ఎక్కువగా బిసి వర్గాలకు చెందినవిగానే కనిపిస్తున్నాయి.


**ఉపకరించిన పుస్తకాలు**

1. జీవన సమరం (నవల).ఎమ్.వి. తిరుపతయ్య – పుట 162.
2. డా.ఎం.వి.తిరుపతయ్య జీవనసమరం పరిశీలన. (అముద్రిత సిద్ధాంత గ్రంథం) ముద్దెర్ల రమేష్ పుట:88.
3. కొలిమి, సెప్టెంబర్ 2020.


❖ ❖ ❖ ❖ ❖

## ఆగు పాఠకా!

**గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్,** భాగ్య నగరం







కవిత చదువకుండా
ముందుకు వెళ్ళకు
శీర్షిక చూడకుండా
చకచకా పరుగెత్తకు

అర్థం చేసుకోకుండా
నోరును పారవేసుకోకు
పూర్తిగ పఠించకుండా
పుక్కిటిపురాణము చెప్పకు

భావము తెలుసుకోకుండా
అభిప్రాయము తెలుపకు
విషయము విశ్లేషించకుండా
విమర్శలకు దిగకు

అక్షరవిన్యాసాలు గమనించకుండా
అమాయకుడవని అనిపించుకోకు
పదప్రయోగము పరికించకుండా
వ్యాఖ్యానాలు చేయకు

ప్రాసలు పరిశీలించకుండా
పసందును పంచలేదనకు
శ్రోతలు ఎవరూలేకుండా
కూనిరాగాలు తీయకు


లోతులు చూడకుండా
లోటుపాట్లు ఎంచకు
కయితలను స్వాగతించు
కవులను ప్రోత్సహించు

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (59) హైదరాబాద్ మార్చి : 2025

# పాత్ర నిర్మాణ పద్ధతిని విశ్లేషించే విశిష్ట రచన

డా. డి. చంద్రశేఖర రెడ్డి, హైదరాబాద్. ఫోన్ : 98661 95673

**ప్రపంచమొక నాటకరంగం** అన్నారు. ఈ మనుషులందరూ అందులో పాత్రధారులే, రచయితలు కూడా. రచయితలకు ఇతివృత్తాలూ, పాత్రలూ కూడా చుట్టూ ఉన్న సమాజం నుండే లభిస్తాయి. కాకపోతే వాటిని ఉన్నదున్నట్లుగా కాక కొన్ని మార్పులతో తమ రచనల్లో వాడుకుంటారు. ఈ మార్పులెందుకు? ఉన్నదున్నట్లు చెప్తే అందులో అందమేముంటుంది, ఆకర్షణేముంటుంది? నిజజీవితంలోని పాత్రల్ని యథాతథంగా వాడుకుంటే అంటే ఆ పాత్రలు సమకాలంలోనివి అయితే వివాదాలకు ఆస్కారం ఉంటుంది. అసలు రచయిత ఎందుకు రాస్తాడు? అతనికి/ఆమెకు చెప్పటానికేదో ఉన్నప్పుడు కదా రాసేది, ఆ చెప్పదలచుకున్నదేదో చెప్పటానికి అనుగుణంగా రచయిత ఇతివృత్తాన్నీ, పాత్రల్నీ కూడా మలచుకుంటాడు. అందువల్లే మార్పులు.




రచయిత తనకు తెలిసిన దాని నుండే తెలియనిదానికి వెళ్ళాలి తప్ప, నేరుగా తెలియనిదేదో వచ్చి కూర్చునే అవకాశమే లేదు. మనకు ఈ మనుషులు చాలక పక్షులు, జంతువులు, క్రిమికీటకాలు, చెట్టు చేమలు, రాళ్లు రప్పలను కూడా పాత్రలు చేసికొంటున్నాం. ఇవన్నీ మన కళ్లకు కనిపించేవే. మరీ సూక్ష్మక్రిములైతే సూక్ష్మదర్శినుల్ని ఉపయోగిస్తాం. ఇవన్నీ కూడా చాలనట్లు దేవతలు, కిన్నరులు, గంధర్వులు, రాక్షసులు, పిశాచులు, దయ్యాలు వంటివి మరెన్నో మనకు అందుబాటులోకి తెచ్చుకున్నాం.

అయితే మానన పాత్రల్ని మలచుకున్నట్లుగానే మన రచనల్లో పాత్రలుగా వీటన్నిటినీ మలచుకుంటున్నాం. అందుకే మన కథనంలో మానవేతరాలన్నీ మానవ గుణగణాలతోనే దర్శనమిస్తాయి. అన్నీ మనిషి లక్షణాలే. మనం పాత్రగా ఎంచుకునే మనిషికి మనం ఆరోపించే మానవ లక్షణాలన్నిటి లాగానే, మానవేతరాలన్నిటికీ కూడా వాటిని ఆరోపించడం తప్ప మనకు గత్యంతరం లేదు. మనిషి లక్షణాలే కాకపోతే దేవగణాలు అందంగానూ, రాక్షసగణాలు వికారంగానూ ఎందుకుంటాయి? వీళ్లకు సద్గుణాలు, వాళ్లకు దుర్గుణాలు ఎందుకుంటాయి? ఏవైనా మనకున్నవే, మనం కల్పించేవే. లేకపోతే మన దేవుళ్లుకూడా ఏకపత్నీవ్రతులో బహుపత్నీవ్రతులో ఎందుకవుతారు. బహుపత్నులు సవతి కయ్యాల కెందుకు దిగుతారు? దేవతలైనా రాక్షసులైనా ఎవరినో ఎందుకు చెరబట్టడం?

మనిషిలో సత్వరజస్తమో గుణాలుంటాయంటాం. అందరిలోనూ అన్నీ ఉంటాయి. కాకపోతే వాటి పాళ్లలో తేడా. ఏ గుణం ఎక్కువగా ఉంటే ఆ వ్యక్తికి ఆ గుణాన్ని ఆపాదిస్తాం. మనం సృష్టించే అన్ని పాత్రలకూ దేవరాక్షసాదులతో సహా ఈ గుణాలన్నీ ఉంటాయి.

ప్రపంచంలో ఎంతమంది మనుషులుంటే అన్ని పాత్రలెలాగూ ఉంటాయి. ప్రస్తారాలూ, సంయోజనాలూ అన్వయిస్తే అవి అనంతాలవుతాయి. రచయిత ఈ మిశ్రణను వాడుకొని ఏ పాత్రనయినా తయారు చేసికోవచ్చు. అందువల్ల రచయిత సృష్టించే పాత్రలు ఇన్ని అని కానీ, ఇలానే ఉండాలని కానీ చెప్పడం కష్టం.

కాకపోతే సాహిత్యమనే ఒక పదార్థం ఏర్పడిన తర్వాత, అది పాత్రరహితంగా సాధ్యం కాదు కాబట్టి అసంఖ్యాకమైన పర్ముటేషన్లు, కాంబినేషన్లతో రచయిత తనక్కావలసిన పాత్రను తయారు చేసికొంటాడు. అయితే సాహిత్య స్వభావం ఇలా ఉండాలి అని - బహుశా అప్పటికి వచ్చిన సాహిత్యం ఆధారంగానే కావచ్చు - చెప్పే కొందరు లాక్షణికులు పుట్టుకు వస్తారు. సంస్కృతంలో ఆలంకారికు లెందరో వచ్చారు. ఎన్నో సిద్ధాంతాలు చేశారు. ఇతివృత్తం ఇలా ఉండాలని నిర్ణయించేటప్పటికి పాత్రల స్వరూప స్వభావాలు కూడా నిర్ణయమైపోతాయి. ఒక రచనలో ఉండే పాత్రలు సాధారణంగా నాయకుడు, నాయిక, ప్రతినాయకుడు, ప్రతినాయిక (ఉంటే) - వీళ్లందరి సహాయకులు, వీళ్లు ఎన్ని రకాలుగా ఉండవచ్చోనన్న సమీకరణం ఆధారంగా నాయక, నాయికా భేదాలు, తదితర భేదాల లక్షణాలు, వర్గీకరణలు జరిగాయి. ప్రాచీన భారతీయ సాహిత్యానికి సంబంధించి పకడ్బందీగా లక్ష్య లక్షణ నిర్దేశం జరిగింది.

ఎప్పుడయితే ఆధునిక కాలంలో ప్రవేశించామో (భారతీయ సాహిత్యాలకు సంబంధించి కూడా) ప్రాచీన లాక్షణికుల లక్షణాలకు ప్రాసంగికత లేకుండా పోయింది. ఇతివృత్త స్వరూపం మారింది, దానితో పాటుగానే పాత్రల స్వరూప స్వభావాలు కూడా.

ఇక్కడ ఒక విశేషమేమంటే ఇతివృత్తం సమకాల జీవితమే కాబట్టి, పాత్రలు కూడా సమకాలానివే. అంటే అవి మన జీవితాల, స్వభావాల లక్షణాలనే పుణికి పుచ్చుకుంటాయి.

లక్షణశాస్త్రం మారింది. మనం కొత్తగా రాసుకోలేదు. పాశ్చాత్య దేశాలలో సాహిత్యం కూడా సమకాలికమయినదే అయినప్పుడు అక్కడ పాత్రలు కూడా సమకాలీనులే. వాటి స్వరూన స్వభావ నిరూపణ కానీ, సాహిత్య సిద్ధాంతాలు కాని అక్కడి సాహిత్యానికి సంబంధించి విస్తృతమైన అధ్యయన ఫలితంగా ఏర్పడ్డాయి. మనకు సాహిత్యంలో పరిణామాలు వచ్చాయి. కాని ఆధునిక సాహిత్యశాస్త్రం స్వతంత్రంగా ఏర్పడలేదు.

అందువల్ల ఇప్పుడు మనం సమకాలిక లేదా ఆధునిక సాహిత్యం గురించి మాట్లాడాలంటే పాశ్చాత్య సాహిత్య సిద్ధాంతాలను అవలంబించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

బూదాటి వెంకటేశ్వర్లుగారు సంప్రదాయ సాహిత్యం చక్కగా చదువుకున్నవారు. అలాగే ఆధునిక సాహిత్యాన్ని కూడా విమర్శనాత్మకంగా అధ్యయనం చేసినవారు. గతానుగతికంగా ఏదో ఒకటి చేయాలనే ఆకాంక్షతో కాక, ఒక విశిష్టమైన అధ్యయనం, సమకాలీనులకు ఉపయుక్తమైన అధ్యయనం, అనంతర పరిశోధకులకు మార్గదర్శకంగా ఉండే అధ్యయనం చేయాలని తలపెట్టారు. ఇప్పటి వరకూ ఒక రచయిత సృజించిన సాహిత్యంలో పాత్రపోషణ ఎలా జరిగింది వంటి అధ్యయనాలు జరిగాయి. అట్లాగే ఒక కాలంలో, ఒక ధోరణి రచనలలో పాత్ర నిర్మాణం గురించిన అధ్యయనాలూ పరిశోధనాంశాలుగా పరిశోధకులు చేపట్టిన సందర్భాలున్నాయి.

ఒక శాస్త్రీయమైన పద్ధతిలో తెలుగులో **'సాహిత్యంలో పాత్రల సృజన పద్ధతి'**ని గురించిన అధ్యయనం చేపట్టిన తొలి పరిశోధకుడు బూదాటి వెంకటేశ్వర్లేనని అనుకుంటున్నాను. శీర్షిక కొంత విశాలంగా కనిపిస్తుంది. సాహిత్యంలో అంటే ఏ సాహిత్యంలో? ఇది కూడా అడగాలా? తెలుగు కాక మరొకటేమిటి ? అని మీరు ప్రశ్నించవచ్చు.

కాని ముఖ్యంగా ఈ పుస్తకంలో సిద్ధాంత చర్చ చాలా వరకు ఇంగ్లీషు ఆధారంగా జరిగింది. అంతేకాదు ఉదాహరణలు, అన్వయం కూడా ఇంగ్లీషు సాహిత్యం నుండే స్వీకరించారు. ఆ తర్వాతే తెలుగు సాహిత్యానికి అన్వయించారు. పరిభాష కూడా ఇంగ్లీషుదే.

ఈ పాశ్చాత్య సిద్ధాంతాలన్నిటినీ పక్కన పెట్టి కేవలం గత ఒకటిన్నర శతాబ్దాలలో తెలుగులో వచ్చిన (ప్రాచీన సాహిత్యానుసరణ రచనల్ని కూడా వదిలి) కథలు, నవలలు, నాటకాలు, కావ్యాలలోని పాత్రలను వాటి లక్షణాల కనుగుణంగా అధ్యయనం చేస్తే ఎలా ఉంటుంది. ఆ పాత్రల స్వరూప స్వభావాలను బట్టే వర్గీకరణలు కూడా చేయవచ్చు. అయితే ఆధునిక తెలుగు సాహిత్యం పైన ఆంగ్ల సాహిత్య ప్రభావం కారణంగా ఇటువంటి అధ్యయనానికి ఎంత అవకాశం ఉందో ఆలోచించవలసిందే.

మరో అంశం. ఎందుకోగాని వెంకటేశ్వర్లుగారు తెలుగు నాటకాల లోని పాత్రల నిర్మాణాన్ని తగినంతగా పరిశీలించినట్లు తోచదు. తెలుగు నాటకరంగ పరిస్థితే దీనికి కారణం కావచ్చు.

పాత్ర నిర్మాణ పద్ధతిని గూర్చి సిద్ధాంత, లక్షణ, వర్గీకరణ చర్చ ఒకవైపు విస్తృతంగా చేస్తూనే ఆంగ్ల సాహిత్యంలోని పాత్రలకూ, తెలుగు సాహిత్యంలోని పాత్రలకూ సామ్య భేదాలను కూడా బూదాటి చర్చించారు. ఈ చర్చలో తెలుగు వారి అనుసరణలు కూడా చాలా వరకు వెల్లడయ్యాయి.

తెలుగు రచయితలు సృష్టించిన విశిష్ట పాత్రలు, వాటి లక్షణాలను చర్చిస్తూ వెంకటేశ్వర్లుగారు కొన్ని పాత్రల విషయంలో మనకు కొత్త చూపునిచ్చారు. అట్లాగే వాటి మంచిచెడ్డలను కూడా మనకు అవగాహన పరిచారు. రచయితల బలాలు, బలహీనతలను కూడా సూచించారు.


రచయితలు లక్షణ శాస్త్రాలు చదివిన తర్వాత రచనలు చేస్తే, అంటే వాటికే కట్టుబడిపోతే మూస రచనలు వచ్చే అవకాశం లేకపోలేదు. కాని శాస్త్ర పరిచయం వల్ల రచయితల పరిధి విస్తృత మవుతుంది, వారు తమ సృజనశక్తిని జోడించి ఉత్తమ రచనలు చేయగలుగుతారు, విశిష్టమైన పాత్రలు నిర్మించగలుగుతారు. ఈ దిశలో బూదాటి వేంకటేశ్వర్లుగారి ఈ పుస్తకం రచయితలకు కూడా మహోపకారి. ఇక పరిశోధకులు, విద్యార్థులు, సాహిత్య బోధకులు, సాహిత్య ప్రియులైన పాఠకుల విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఒక రచనను, ఆ రచనలోని పాత్రలను అర్థం చేసికోవడంలో అది ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఒక మార్గదర్శకమైన రచన చేసినందులకు ఆయనను అభినందిస్తూనే, తెలుగులో మరిన్ని పరిశోధనలు జరిగి పాత్ర నిర్మాణ శాస్త్రానికి మరిన్ని సూత్రాలు చేరి దోహదపడాలన్న వారి ఆకాంక్ష సఫలమవ్వాలని కోరుకుంటున్నాను.

❖ ❖ ❖ ❖ ❖


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**




ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**


**సంప్రదించండి.**

**మూసీ మాసపత్రిక**

**ఫోన్: 934 7971177**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2025

## స్వ'కృతి'




## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,
బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట,
హైదరాబాద్-500013.


చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com





**మసన చెన్నప్ప సమగ్ర సాహిత్యం**
ధూళిపాళ అరుణ
వెల : 200/-
**ప్రతులకు :** ధూళిపాళ దత్తాత్రేయ శర్మ
హరిహర త్రిశక్తి క్షేత్రం,
వలిగొండ, యాదాద్రిజిల్లా - 508 112
ఫోన్ : 871 234 2323





**జోడు దివ్వెలు (భారవి నీతి హేతి - మాఘ సౌరభం)**
కృతికర్త : మేడవరము సత్యనారాయణ శాస్త్రి
భావ వివరణము : మేడవరము అనంతకుమార శర్మ
వెల : 250/-
**ప్రతులకు :** మేడవరము మాణిక్యాంబ, ఫ్లాట్ నెం. 506, 5వ ఫ్లోర్, సాయిసుధ రెసిడెన్సీ, విద్యానగర్, నిజామ్ సాగర్ రోడ్, కామారెడ్డి - 503 111
ఫోన్ : 98493 01940





**కవితా సుందరి (పద్యకావ్యం)**
డా. నలవోలు నరసింహా రెడ్డి
**ప్రతులకు :** నలవోలు విక్రం రెడ్డి,
ఇం.నెం. 9-9-144, రెడ్డి కాలనీ,
చంపాపేట, మం. సరూర్ నగర్, జి. రంగారెడ్డి,
హైదరాబాద్ - 500 059.
ఫోన్ : 9848898515





**విశ్వ బ్రాహ్మణులు (సంస్కృతీ - అనుకరణము)**
కన్నడ మూలం : డా. జి. జ్ఞానానంద
తెలుగు : డా. కపిలవాయి లింగమూర్తి
వెల : 300 /-
**ప్రతులకు :** డా. లాల్ కోట వెంకటాచారి
ఇం.నె. 3-64/బి/5/1, ఎండోమెంట్స్ కాలనీ,
రామంతాపూర్, హైదరాబాద్ - 500 013
ఫోన్ : 98499 08888



**జీవ గణితం (కవితలు)**
రేడియమ్
వెల : 100 /-
**ప్రతులకు :** రేడియమ్
ఫోన్ : 929 152 77 57




**గణతంత్ర ముగ్గలు**
డా. భీంపల్లి శ్రీకాంత్
వెల : 30 /-
**ప్రతులకు :** రచయిత, 8-5-38, టీచర్స్ కాలనీ,
మహబూబ్ నగర్ - 509 001.
ఫోన్ : 903 28 44 017





**నమ్మలేని నిజాలు**
రేడియమ్
వెల : 150 /-
**ప్రతులకు :** రేడియమ్
ఫోన్ : 929 152 77 57




**సోమ రుద్రేశ శతకము**
మరుమాముల దత్తాత్రేయ శర్మ
వెల : 60/-
**ప్రతులకు :** రచయిత, శ్రీరామ సదనం, 29-1499/6/1, రోడ్ నెం. 1, పశ్చిమ కాకతీయ నగర్, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్ - 500 056.
ఫోన్ : 94410 39146

ISSN 2457-0796


# అవును ! నేను అబలనే !!






పరిస్థితులతో పోరాడే బలంలేని అబలనే
పురుషాధిక్య సమాజంలో
స్త్రీలపై జరిగే అకృత్యాలను
ఎదుర్కొనే ఆ బలంలేని అబలనే

తాను తగ్గుతూ
తనవారిని పెంచే తరుణిని
తన వారికోసం
తనను తానే కోల్పోయిన కోమలాంగిని
తనకు తోడుగా
కన్నీటిని చెలిగా చేసుకున్న నెచ్చెలిని

బాధ్యతల బంధాలతో చిక్కుకున్న పూబంతిని
తనని కోరి వచ్చిన బంధానికి లొంగి
తన కోసమే తపించే తన్విని
నిరంతరం శ్రమిస్తూ.... త్యాగిస్తూ..
గుర్తింపులేని, ఫలితం పొందని కాంతామణిని

సముద్రమంతటి బాధను లోపల దాచి
పైకి నవ్వుతూ లోలోపలి రగిలిపోతున్న రాగిణిని
ఏనాటికైనా తన హృదయంలో...
ఆనందపు హరివిల్లు విరియాలని

కాంక్షించే ఆకాంక్షను
భవబంధాల నుండి
విముక్తిని కోరుకునే విమలను
ఊహాలోకంలో
అందమైన సౌధాలను నిర్మించుకున్న నిర్మలను

వ్యామోహాల గమ్మత్తుల్లో...
ప్రేమకు, ఆకర్షణకు తేడా తెలియని
జనాల మధ్య జీవిస్తున్న జీవితని
చెప్పుకోలేని, చెప్పరాని బాధలతో
కృంగి కృశిస్తున్న ఆడదాన్ని
ఆడ....దాన్నే అవును నేను అబలనే
అబల 'నే' అని అలుసుగా చూస్తే
అపర కాళికలా కాలరాస్తా(ను)

**ఎం. అనంత లక్ష్మి**
ఫోన్ : 897 843 2973

Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2023-2025
Date of Publication 1st of Every Month
Date of Posting 5th / 6th of Every Month


# హరిహర త్రిశక్తి క్షేత్రం

నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా.



ఆలయ నిర్మాణ, నిర్వహణకు సహకరించండి.....

దాతలు తమ సహకారం ఆన్‌లైన్ ద్వారా కూడ అందించవచ్చు.

State Bank of India, Nallakunta Branch,
A/c. No. 62011461764, IFSC Code : SBIN0020083

రండి ... ఈ ధర్మయజ్ఞంలో అందరం పాలుపంచుకుందాం.

## వేద సంస్కృతి పరిషత్

వైదిక సాంస్కృతిక ఉద్దీపన పరిశోధనా సంస్థ

సెల్ : 9704227744, 9347971177

Website : www.vsparishath.com, E-mail : vsp613@gmail.com


From :
**The Manager, MUSI Telugu Monthly Magazie**
# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.
Cell : 9347971177, Email : editormusi@gmail.com

Printed, Published and Owned by : B.Manohari, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Published at H.No.2-2-1109/BK, LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana
Editor : Dr.Sagi Kamalakara Sharma

Scanned with OKEN Scanner